

ఆంధ్రసచిత్రవారపత్రిక

14-11-75
60 పైసలు




దేనితోనూ సరిపోల్చలేని ఆ లావణ్యం.
మృదువైన. సుకుమారమైన. సహజ సౌందర్యం.
అవును మరి! లక్స్ సుప్రీమ్‌తో మీ లావణ్యం తొణికి
సలాడుతుంది, మీలో కలిగే అనుభూతి అదే. మరి
దానికి కారణం బ్యూటీ క్రీమ్ గల ఒకే ఒక సబ్బు
లక్స్ సుప్రీమ్ మాత్రమే. దాని సమృద్ధియైన
నురుగుల్లో మీరు బ్యూటీ క్రీమ్‌లోని అనుభూతు
లను చవి చూస్తారు. దీని మెత్తటి నురుగు
శ్రేష్ఠమైన పరిమళాల సౌరభాలతో మీ చర్మాన్ని
సుకుమారంగా అతి మనోహరంగా లాలిస్తుంది
మీ శరీరానికి పట్టులాంటి మృదుత్వాన్ని,
సహజమైన సౌందర్యాన్ని యిస్తుంది.
LUX
SUPREME
మీరు తిరిగి ఇంక
మరేదీ వాడలేరు


"బాబు రవి పుడతాడని తెలిసినప్పటినుంచీ నేను హార్లిక్స్ తీసుకున్నందుకు
నాకు చాలా సంతోషంగా వుంది"
"నా బాబుకోసమూ, నాకోసమూ కూడా."
అంటుంది సుచిత్ర.
సుచిత్ర గర్భవతిగా వున్నప్పుడు ఆరోగ్యంగా, ఆనందంగా వుండేది. ఆమెకు ఆరోగ్యంగా, చక్కగా వున్న బాబు పుట్టేడు. ఆమె దీనికోసం హార్లిక్స్‌కి కృతజ్ఞతలు తెలియచేస్తోంది. హార్లిక్స్ ఆమెకు అవసరమైన పౌష్టికాహారాన్ని సమకూర్చింది. గర్భిణీస్త్రీకి, పుట్టబోయే శిశువుకి ముఖ్యంగా అవసరమైన శరీర నిర్మాణపు మాంసకృత్తులూ, శక్తిని చేకూర్చే కార్బోహైడ్రేట్లూ హార్లిక్స్‌లో వున్నాయి.
బాబు రవి పుట్టిన తర్వాత కూడా, సుచిత్ర హార్లిక్స్ తీసుకునే అలవాటు మానలేదు. బాబు పుట్టిన తర్వాత తిరిగి బలం చేకూరడానికీ, బాబుని సుఖంగా, సంతోషంగా పెంచడానికీ అవసరమైన శక్తిని హార్లిక్స్ సమకూర్చింది.
Horlicks
THE IDEAL FOOD DRINK FOR ALL AGES
హార్లిక్స్ పుష్టి చేకూరడానికి ప్రధాన సాధనం
హార్లిక్స్, గర్భిణీస్త్రీలకూ, బాలింతలకూ కావలసిన అపురూపమైన మాంసకృత్తులనూ, కార్బోహైడ్రేట్లనూ సమకూరుస్తుంది. ఇవి తేలిగ్గా జీర్ణమవుతాయి. బాలింతలు హార్లిక్స్ సేవించడంవల్ల పాపకి పాలు ఎక్కువగా యివ్వగలుగుతారు. రోజుకు రెండు పార్లు హార్లిక్స్ సేవించమని నా సలహా. రాత్రి బాగా నిద్ర పట్టడానికి, ప్రొద్దున్న లేవగానే విస్సత్తువగా లేకుండా వుండటానికి మంచిది."
దీనిలో ఆరోగ్యముంది.
హార్లిక్స్—మంచి పుష్టికరమైనది
హార్లిక్స్ రిజిష్టర్డ్ ట్రేడ్ మార్క్.
Hx-3748A 1-Tel.



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)

శుక్రవారం . 14–11–'75
రాక్షసనామసం. కార్తీకమాసం [illegible]

సంపుటము : 69 సంచిక : 10

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు 33-80
ఆరుమాసాల చందా – రు 16–90
విడిప్రతి నెల 60 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ–520003.

విషయానుక్రమణిక

దీపావళి చిన్న సీరియల్ కథల పోటీలో ఎన్నికైన కథ

మైనస్ బతుకులు

(గత సంచిక తరువాయి)

ఊళ్లో అప్పుడు కృష్ణ జయంతికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.

"ఈ ఏడు మనం ఒక గమ్మత్తు చెయ్యాల్రా" అన్నాడు లోకల్ కృష్ణుడు చిట్టిబ్బాయి

శర్మ, విష్ణు, బుడ్డిగాడు కుతూహలంగా చూశారు.

"కొత్తగా వచ్చిన పంతులు పని పట్టిద్దాం."

ఆ వూరికి ఏ మేష్టారొచ్చినా నెల రోజుల కన్నా ఎక్కువ వుండనివ్వరు.

"ఏం చేద్దాం ?"

"చాలా పెద్ద ప్లాను వేశా. నిన్న మా పాలేరు చేత పంతులున్న పాత కొంపలో దయ్యాలున్నాయని చెప్పించా."

"భలే" పంతులుగారు పారిపోతాడని అందరూ సంబర పడ్డారు.

"అంత సులభంగా పోడురా. ఇవ్వాళ రాత్రి చిన్న నాటకం ఆడ్దాం.

ఖుషీగా వుంది వాళ్లకి.

"మురళిగాడూ, నేనూ దయ్యాలం !" చిట్టిబ్బాయ్ కళ్లు పెద్దవి చేశాడు.

"బాబోయ్ నాకు భయం నేను రాను" అన్నాడు మురళి.

"వేషం వెయ్యొద్దురా నేను చెప్పినట్లు చెయ్యి అంతే."

అందరూ రాత్రి తుమ్మల బావి దగ్గర కాపు వేశారు.

పంతులుగారు వైదికుడు. భార్య పోయినప్పట్నుంచి వంటరిగానే గడుపుతున్నాడు. పిల్లలు లేరు.

ఒక రకంగా ఆయనకి పిల్లలంటే ఎవర్షన్. ఎవడేంచేసినా చింత బరికితో చావగొట్టి చెవులు మూసేవాడు. రక్తం మూసేంత వరకూ ఆయన 'బదలా' తీరేది కాదు.

అయితే పిల్లలు తప్ప ప్రపంచంలో ఏది చూసినా కాస్త జంకుగా వుండేది. రోడ్డు మీద కుక్క కనిపించినా, పంది కనిపించినా భయం. రాత్రిళ్లు వంటరితనం భయం. గట్టిగా అరిస్తే భయం. భయపడుతున్నప్పుడు పిల్లిని చూసినా భయం. ఎలుకను చూసినా భయం గతిలేక యీ మారుమూల పల్లెటూళ్లో వంటరి జీవితం గడుపుతున్నాడు.

"ఒరేయ్ పంతులు భోంచేసి పక్క సర్దుకుంటున్నాడు. అవతలి కెళ్లగానే దుప్పటి, దిండూ కింద పారేసిరా. చప్పుడు కానీకు" మురళిని పంపించి కిటికీదగ్గిరి కొచ్చేశారు

మాస్టారు మంచినీళ్లకోసం లోపలికెళ్లి రాగానే పక్కమీద బట్టలు కనిపించలేదు. బిక్కచచ్చి చూశాడు. భయంతో చెంబు కింద పడిపోయింది

మళ్లీ కింద పడివున్న పక్క బట్టలు దులుపుకొని పరుచుకున్నాడు; చుట్టూ ఒకసారి చూసుకున్నాడు

నేలమీదపడిన నీళ్లు కాళ్లతో నెట్టేసి చెంబుతో లోపలికెళ్లాడు కాని బెదురుగానే.

లోపల కూజా కనిపించలేదు

కుర్రాళ్ళు కూజాతో తుమ్మలోకి పారిపోయారు.

మాస్టారి కాళ్లు నేలమీద నిలవటంలేదు. లోపలికొచ్చి మళ్లీ ముక్కుమీద వేలేసుకున్నారు. మళ్లీ పక్క కిందపడి వుంది. వేసినమంచం రెండుకాళ్ల మీద నిలబడి ఉంది.

రాత్రంతా నిద్ర పట్టలేదు. రక్తం పోటెక్కువైంది. పచార్లు చేస్తూనే గడిపాడు.

మర్నాడు మాస్టారు వెళ్లిపోలేదు.

"ఇంకో ప్లానుంది రా యివ్వాళ రాత్రి."

"ఇక నేను రానురా" కచ్చితంగా చెప్పేశాడు, మురళి.

"ఎవ్వరూ రానవసరంలేదు. పథకం మార్చా." చిటబ్బాయి డిక్లేర్ చేసి వెళ్లిపోయాడు.

జరిగినకథ 1 : చాలా కాలం క్రితం చనిపోయిన తల్లికి సమాధి కట్టించాలని మళ్లీ ఆ వూరు వస్తాడు మురళి. ఓ స్త్రీని వెంటాడుతూ తన కళ్లెదుటే దుర్మరణం పాలయిన వ్యక్తి ఆవూరి పెద్ద హరిబాబుగారని గుర్తిస్తాడు మురళి. పాత జ్ఞాపకాల వుచ్చులో, చిక్కుకుంటాడు మురళి.

రాత్రి పన్నెండు గంటలకి యిద్దరు పాలేర్లతో వచ్చి నిద్రపోతున్న మాస్టార్ని మంచంతో సహా ఆరుబయట పెట్టించాడు.

ఉదయం మాస్టారికి జ్వరం సల్లావారి దగ్గర మాతలు పుచ్చుకున్నారు

జ్వరం తగ్గకమునుపే ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు మాస్టారు.

ఘన విజయం సాధించాడు చిటబ్బాయి.

పండుగ వచ్చేసింది. గుడి దగ్గర వుట్టి కట్టారు వచ్చేపోయే జనంతో, భజన కీర్తనలతో అంత ముమ్మరంగా వుంది పిల్లలంతా గోపాలకులు చిట్టిబ్బాయే వుట్టి కొట్టే స్వామి వాతావరణం వెల్లడి చేస్తోంది

చీకటి పడగానే మెల్లిగా జనం మూగారు.

గాస్ లైట్లు వెలుగుతున్నాయి. కేకలు, పరుగులు. చిందులు అంతా కోలాహలంగా వుంది.

గుడిదగ్గ భజనకీర్తనల జోరెక్కువైంది, అందమయిన ఉడపలర్పి మూడగానే

ఒక సెటు పనిపాటాలేని ఆడజనం 'పెద్దింటోరి' అరుగులమీద లోకాభి రామాయణం మొదలు పెట్టారు

వుట్టి కోసం కుమ్ములాట, ఈలలు, చప్పట్లు, చుక్కేసుకున్న వాళ్ల కేకలు మారు మోగుతున్నాయి.

హరిబాబుగారి చంద్రం జనం సాధ్య నుంచి పైకెక్కి కిందపడిపోయాడు

అందరూ గొల్లుమన్నారు

"ఎదవల్లారా... చివరికి నేనే కొట్టేస్తాను చూడండి" దుప్పటి బుగ్గలమీద సెట్టు మెలితిప్పుతున్నాడు మీసాల్ని

కోటయ్యగారబ్బాయి లావుగా వుంటాడు. 'బోండాం పెళ్లి' వాడి పేరు.

కాస్త ఎక్కనిచ్చి పిల్లలంతా ఎంకరేజ్ చేశారు వాణ్ణి

పైదాకా వెళ్లి కిందికి చూశాడు. బోండాం ఎప్పుడూ అంత ఎత్తు ఎక్కలేదు

కళ్లు తిరిగి పడిపోయాడు

"సచ్చినోళ్లు నా బిడ్డని చంపేశారో".

అని మొత్తుకుంటూ మట్టిదులిపి, దిష్టితీప్పి వెళ్లింది.

"బోండాంగాడి పెళ్ళయిందిరోయ్" పిల్లలంతా చప్పట్లు కొట్టారు.

శక్తికొద్దీ అందరూ ప్రయత్నిస్తూనే వున్నారు.

ఆడపిల్లలు నవ్వడం చూసి కుర్రాళ్ళు ఇంకా చెలరేగిపోతున్నారు.

చివరికి చిట్టిబ్బాయి చొక్కా తీసి బుడ్డిగాడికిచ్చాడు.

అంతా అతనికేసి చూశారు.

రెండుసార్లు పాములా మెలికలు తిరిగి అందరికన్నా ఎత్తుగా పాకిపోయాడు. ఇంకా అతనికి అందలేదు.

మురళికి కాస్త ధైర్యం చిక్కింది. కళ్ళు మూసుకొని పైకెళ్ళి ఉట్టి పట్టుకున్నాడు.

కిందవున్న వాళ్ళంతా చప్పట్లు కొట్టారు. ధైర్యంగా కళ్ళు తెరిచి చూశాడు.

ఉట్టికి ఎదురుగా 'పెద్దింటోరి' పై అంతస్తు పడకగదిలో లైటు ఆరిపోయింది. కాని పక్కగదిలో దీపం వెలుగుతూనే వుంది. ఆ వెలుగు [illegible] మధ్య ఒక దృశ్యం కనిపించింది మురళికి.

స్పైనస్ బతుకులు

దూలంనుంచి ఒక తాడు వేలాడుతూ వుంది. తెల్లటి చీరలో నిలువునా నిర్జీవంగా పడివున్న ఒక స్త్రీని ఆ తాడు పట్టి వేలాడదీస్తుంది హరిబాబుగారే.

మురళి చేతులు అప్రయత్నంగా ఉట్టిని వదిలేశాయి.

కిందనుంచి కేకలు, పుట్టి వొదలొద్దని.

ఇప్పుడు మెడకు వుచ్చు వెయ్యడం పూర్తయింది. ఎదురుగా వున్న పుట్టిలా ఆమె శరీరంకూడా వేలాడుతుంది.

"మురళీ పుట్టి వొదలొద్దురా!!" పెద్దవాళ్ళుకూడా కేకలు వేస్తున్నారు.

ఎలానో తెలివి తెచ్చుకొని పుట్టిలాగేశాడు, మురళి.

కిందికి దిగిరాగానే స్పృహతప్పినట్లయింది. అమ్మ కోసం చుట్టూ చూశాడు. గుడి దగ్గర కూడా కనిపించలేదు చిన్నగా ఇంటికి వెళ్లిపోయాడు.

అమ్మ నిద్రపోతుంది.

నెమ్మదిగా పిలిచాడు.

"పడుకో బాబూ..."

"అమ్మా...మరే..."

"పడుకోరా.. అర్ధరాత్రి వొకటే ఏడుస్తూ, పండగని వదిలేశా రేంట్రా వీ, వుందు నీ సంగతి చెబుతా..." కసిరింది అమ్మ.

[illegible] మంచంపైన [illegible]

భయంగా వుంది

లేచి అమ్మ దగ్గర పడుకున్నాడు.

పుట్టిలా వేలాడుతున్న అమ్మాయి ఎవరో!


కళ్ళు మూసుకొని నిద్రపోలేక పోయాడు.

నాలుగు దిక్కులా చూశాడు. ఆ స్త్రీమూర్తి [illegible] కదులుతున్నట్టు వుంది, ఏ శబ్దం వినిపించినా.

మర్నాడు వూరంతా గుప్పుమంది.

హరిబాబుగారి మరదలు శ్యామలమ్మ ఉరి పోసుకుని చచ్చిపోయిందన్నారు

"[illegible]. విధవరాలు పాపం! విరక్తి చెంది తనువు చాలించింది, మహాసాధ్వి [illegible] సీతా ఎంత సాధ్వి" [illegible]



"పాపం, మంచిదేనే ఎవరిజోలికి వచ్చేది కాదు"

మనిషి చచ్చినప్పుడు చెడ్డకన్నా మంచే ముందు చెప్పుకుంటారు.

"పాపం హరిబాబుగారింటో యిలాంటివి జరగటం యిదే మొదటిసారి" సానుభూతి ప్రకటించింది లోకం.

చనిపోయిన శ్యామలమ్మ వ్యక్తిగత జీవితం గురించి ఆడవాళ్లు చర్చించుకున్నారు.

ఎక్కడా సందేహాలకు తావులేదు. వున్నా పెద్దింట్లోకెళ్లి అడిగే సాహసం ఆ గడ్డమీద పుట్టినవాడికి లేదు. ఎవరి సందేహాలకి వాళ్లే సమాధానం చెప్పుకున్నారు.

పోలీసులూ అలాగే చేశారు.

జరగవలసిన తతంగం జరిగింది.

మురళి మనస్సు మాత్రం ఎల్లా ఎల్లో అంగా వుంది. అమ్మతో చెప్పాలని రెండు మూడు సార్లు ప్రయత్నించాడు. అవకాశం దొరకలేదు.

మధ్యాహ్నం భోంచేస్తున్నప్పుడు నెమ్మదిగా అమ్మ పక్కన చేరాడు.

"నిన్న పుట్టేలా సుతుల్ల ప్పుడు పెద్దింట్లో ఏం జరిగిందో చూశాను."

ఏమిటన్నట్టు చూసింది.

తను చూసిన దృశ్యం చెప్పాడు.

ముద్ద మింగుడు పడలేదు. గొంతులో ఏళ్ళు పోయినంది.

"నిజమేనమ్మా."

"ఈ సంగతి నాతో చెబితే చెప్పావ్. ఇంకెక్కడా నోరు జారకు."

ఆ పగలంతా అతన్ని కదలనివ్వలేదు.

రెండు రోజులు కుర్రాళ్లెవర్నీ ఆయుకెస కలనివ్వలేదు. స్కూలు కూడా లేదు.

వాతావరణం కాస్త పల్చబడింది.

చనిపోయిన శ్యామలమ్మ కడుపుతో వుందన్న విషయం శవపరీక్షలో తేలిందని చిన్న పుకారు పుట్టింది.

మళ్ళీ ఎవరికీ బహిరంగంగా మాట్లాడే ధైర్యం లేదు.

"సొసైటీమీద సినిమాస్ బాడబరేషన్. విడోస్‌కి ఎగ్జామినేషన్. సోదిస్ ఖన్ కారనేషన్ అఫ్ ఇన్లిగర్ ఫెర్సన్. ట్వంటీ ఫస్ట్ సెంచరీలో విడోస్‌కి పిల్లలు పుట్టకపోతే ఆశ్చర్య పోతారు." సరదాగా అనడానికి ఏమ్మాలు వాళ్లేదు. (నల్లాచారికి)

"ఎప్పుడో, ఎక్కడో గడ్డితింది ముదనష్టపుది. నలుగురికీ తెలుస్తుందని ఆ పని చేసింది." నోళ్ళు నొక్కుకున్నారు అమ్మలక్కలు.

తరవాత కొత్త వార్తలేం అందలేదు. కొన్ని గుసగుసలు వినిపించినా 'హుషవ్' చేశాదు వయసు మళ్ళినవాళ్లు.

ఒకరోజు మురళి గుడి దగ్గరికొచ్చాడు. ఇంటికి వెళ్తున్న హరిబాబు గారబ్బాయి మురళికోసం వచ్చాడు.

"ఏరా చంద్రం కాలవగట్టుకి వెళ్దామా?"

ఇద్దరూ చాలాసేపు ఆడుకున్నారు. తరవాత యీత కొట్టారు కాలువలో.

తలలు తుడుచుకొని గట్టుమీద కూర్చున్నారు. కాస్త చీకటి పడింది.

నెమ్మదిగా మురళి కదిలించాడు. "ఏరా, నీకు మీ పిన్నంటే యిష్టమేనా?"

"అవున్రా. అమ్మ కొట్టినా తిట్టినా పిన్నే అడ్డం వచ్చేది" కాసేపు నిట్టూర్చాడు "పిన్నమ్మ లేకపోతే ఇల్లంతా బోసిగా వుంది"

"ఆరోజు పుట్టి రాగుతున్నప్పుడు మీ ఇంట్లో ఏం జరిగిందో చూశా."

ఏం జరిగిందన్నట్లు చూశాడు చంద్రం.

"మీ నాన్న పిన్నమ్మ ఉచ్చుకట్టి వేలాడదీశాడు."

చంద్రం తెరిచిన నోరు తెరిచినట్టే ఉండిపోయింది. ఇద్దరికీ నోట మాట రాలేదు. నోరు జారినందుకు నొచ్చుకున్నాడు మురళి.

చాలాసేపు మౌనంగా కూర్చొని, మౌనంగానే వెళ్ళిపోయారు.

ఎందుకో మురళి గుండె తేలిగ్గా వుంది.

మర్నాడు హరిబాబుగారే తోటకి వచ్చి అమ్మ యోగక్షేమాలు విచారించారు. "ఏమోయ్ మురళి సోమేశ్వరరావుగారి జాం కాయలు ఏమంటున్నాయ్" మురళి సైకాలజీమీద ఓ దెబ్బ విసిరాడు.

"మాంచి పసుపచ్చన్నాయ్ మాఇంట్లో. నాతో వచ్చావంటే నువ్వే సెలక్ట్ చేసుకొని తెచ్చుకోవచ్చు."

భుజంమీద చెయ్యేసుకొని చాలా ఆప్యాయంగా యింటికే తీసుకొచ్చారు.

"మురళీ..."

రాళ్ళు చేతులూ వణికిపోతున్నాయి.

"మంచినీళ్లు తాగొస్తానండి." నిజంగనే నాలుక పిడచగట్టుకు పోయింది.

అతన్ని కదలనివ్వలేదు. నీళ్లు ఆయనే తెప్పించారు.

ఘర్షణలో

డా॥ సి. నారాయణరెడ్డి

వచ్చింది ప్రేమ
ఉరి పోసుకుంటున్న
ఉద్రిక్త బాహువుల మధ్య

తెచ్చింది బ్రతుకు
ఉడుకెత్తిపోతున్న
ఉభయ సంధ్యల మధ్య

ఒరిగింది కాలం
రేపు తనను లేపుతుందనే
ఊపిరిని విశ్వసించి.

వెలిగింది విశ్వం
కళ్లలో విచ్చుకుంటున్న
నవజీవం నుంచి.

ప్రేమ పొంగితేనే బ్రతుకు
బ్రతుకు పండితేనే కాలం
కాలం పరుచుకుంటేనే విశ్వం.
విశ్వం గుండె ఘర్షిస్తేనే
నాశ్వత భవిష్యత్ దృశ్యం.

"మురళీ ... మా అబ్బాయితో ఏదో అన్నావట."

మురళి మాట్లాడలేకపోయాడు.

"చీకట్లో ఏం చూసి జడుసుకున్నావో. శ్యామలమ్మ ఆత్మహత్య చేసుకుంది. నేను రక్షించాలని వచ్చి తాడు విప్పబోయాను. అంతే. ఎవరైనా అడిగితే అలాగే చెప్పాలి తెలిసిందా?"

మురళి గుడ్లప్పగించి అలాగే చూస్తున్నాడు. ఆయన చెప్పేదంతా పచ్చి అబద్ధం అని తెలుసు.

"శ్యామలమ్మ వురిపోసుకుని చచ్చిపోయింది. నేను రక్షించాలని వచ్చి తాడు విప్పబోయాను. అంతే నువ్వు చూసింది."

పాఠం చెప్పినట్లు చెప్పాడు.

"ఇప్పుడు నువ్వు చెప్పుబాబూ ... నీ మంచికోసం, మీ అమ్మ మంచికోసం చెబుతున్నా తండ్రిలేని కుర్రాడివి. ఈ వూళ్లో మీకెవరు దిక్కు చెప్పు." మెత్తటి వార్నింగ్ వినిపించింది ఆయన గొంతులో.

మురళి కళ్లు చెమ్మగిల్లాయి.

"నీ క్షేమం గానా జరిగిందంటే మీ అమ్మ ఎంత తల్లడిల్లిపోతుందో తెలుసా ... ఎవరైనా

వ్యైనస్ బతుకులు

ఏదైనా చేస్తే మీరేమైపోతారు తెలుసా...''

పొంగుతున్న ఉద్వేగాన్ని ఆపుకున్నాడు.

''ఇప్పుడు చెప్పు నువ్వు చూసిం దేమిటో...''

పాఠంలా అప్పగించి బావురుమన్నాడు మురళి.

మర్నాడు ఆరు జతల ఎడ్లు వచ్చి తోటంతా దుక్కి దున్నేశాయి. పదిమంది పాలేర్లు తోటంతా శుభ్రంచేసి కంచె కట్టారు. నూతులు పూడిక తీశారు.

''ఈ ఏడు వేరుశనగ వెయ్యండి. మంచి విత్తనాలు పంపిస్తాను'' హరిబాబుగారు అమ్మతో అన్నారు.

అమ్మ అర్ధం అయినట్టూ, కానట్టూ చూసింది.

''చిన్న తాసిల్దారుగారు ఏం చేస్తున్నారు?'' మురళిచుట్టూ ఆయన మనుషులు నీడలా తిరుగుతున్నారు.

హఠాత్తుగా ఒకరోజు హరిబాబుగారి గుమాస్తా మురళిని పిలిచి శ్యామలమ్మ సంగతి చెప్పమన్నాడు. చాటుగా నిలబడి వింటున్నాడు హరిబాబు.

ఆ రోజు నేర్చుకున్న పాఠం వల్లెవేసు కుంటూ చెప్పాడు.

సాయంత్రం వికసిత వదనంతో వచ్చాడు హరిబాబు.

మురళికి కొత్త బట్టలు వచ్చాయి.

వెనక బండినిండా విత్తనాలు, ఎరువులు వచ్చాయి.

''దీనుల పాలిట కరుణామయుడండీ హరి బాబుగారు. లార్డ్ విష్ణు ఇన్‌కారనేషన్'' చేతులెత్తి జోడించాడు నల్లాచారి బహి రంగంగా.

నెలరోజుల తరవాత మళ్ళీ వచ్చారు హరి బాబుగారు తోటకి.

''ఇవ్వాళ అబ్బాయిని నాతో టౌనుకు తీసుకువెళ్తున్నాను.''

అమ్మ భయపడింది.

''మరేం భయంలేదు. సర్దాగా నాతో వస్తాడు.''

సరే అనలేదు.

''ఏంలేదమ్మా. ఇవ్వాళ కచేరీలో చిన్న విచారణ. మన చిన్న తాసీల్దారుగారు చిన్న సాక్షి'' చాలా చిన్నగా చెప్పాడు.

అమ్మ గుండె దడదడ లాడింది.

''మీరూ రండి. మరేం భయం లేదు ఆ రోజు మనవాడు కళ్ళారా శ్యామలమ్మ పురి పోసుకోడం చూశాట్ట. అక్కడ ఆ ముక్క చెబితే అయిపోతుంది. మీరూ రండి వెంట.''

అమ్మతో టౌనుకు వచ్చాడు మురళి. అడిగిన ప్రశ్న లన్నిటికీ సమాధానం చెప్పాడు.

''చహబాస్''. అన్నారు హరిబాబుగారు. ''నువ్వు కలక్టర్ అవుతావోయ్.''

ఈ వార్త వూళ్ళో గుప్పుమంది.

అవకాశం దొరికిన వాడల్లా అడిగాడు వివరాలు.

అందరికీ అదే సమాధానం చెప్పాడు మురళి.

విసుగెత్తి వూళ్ళోకెళ్ళటం మానేశాడు.

వంటరిగా వున్నప్పుడు అమ్మనడిగాడు. ''అబద్ధం చెప్పటం పాపం కదమ్మా.''

అతనే మథనపడుతున్నాడో అర్థం చేసు కుంది. ''ధర్మరాజు లాంటివాడే అబద్ధం చెప్పాడు నాయనా.''

''నేనడిగేది అదికాదమ్మా. నేను ఆ రోజు కోర్టులో అబద్ధం చెప్పనని ప్రమాణం చేసి, దేవుడి ముందు నిజం చెబుతానని...'' మురళి నోరు నొక్కేసింది.

''నలుగురూ నమ్మేదే నిజం బాబూ. మీ నాన్నగారు ఎప్పుడూ అనేవారు. మనం ఇక్కడ బతకడానికి వచ్చాం. మళ్ళీ యీ విషయం ఎత్తకు.''

* * *

ఇన్నాళ్లకు మళ్లీ గుర్తొచ్చింది ఆ విషయం మురళికి.

గడియారం వెన్నెల్లో చూసుకున్నాడు.

కొందరు జనం తోటకేసి హడావిడిగా వెళ్తున్నారు. మురళి నెవరూ చూసినట్లు లేదు.

కొత్త మనిషి ఆ పరిసరాల్లో వుండటం కూడా ప్రమాదమే ననిపించి తిన్నగా కాలవ దగ్గరికి వచ్చాడు.

(ఇంకా వుంది)

హైదరాబాద్ నోట్ బుక్

డాక్టర్ భగవంతం సూచన

ప్రముఖ విజ్ఞానశాస్త్రవేత్త డాక్టరు సూరి భగవంతం అక్టోబర్ 18, 19 తేదీలలో హోటల్ ఎమరాల్డ్‌లో జరిగిన "విజ్ఞానశాస్త్ర విధానం"పై గోష్ఠిని ప్రారంభిస్తూ చేసిన సూచనలను విజ్ఞానవేత్తలే కాక, రచయితలూ పాటించడం అవసరం. ప్రజల ప్రాథమికావసరాలను తీర్చడమే విజ్ఞానశాస్త్రం పరమావధి కావాలని, ఆయన చెబుతూ, విదేశాలనుంచి సంపాదించుకొనే విజ్ఞానశాస్త్ర పరిజ్ఞానం స్థానికుల అవసరాలను తీర్చకపోగా, వారిలో ఆత్మ విశ్వాసం కలిగించడంలేదని విచారం ప్రకటించారు. వర్ధమాన దేశాల విజ్ఞానశాస్త్రవేత్తలు తమ పరిశోధనలను తమ దేశాల ప్రజల నిత్యజీవితావసరాలను తీర్చడానికి వినియోగించాలని ఆయన సలహా యిచ్చారు. ఆ మధ్యన ఒక మహాకవి అణ్వాస్త్రాన్ని సూర్యునితో పోల్చాడు. అణ్వాస్త్రం పిచ్చివానిచేతి రాయివలె ఎవరినైనా నాశంచేసేది. అలాటి దానిని ప్రకాశం, జీవం ప్రసాదించే సూర్యునితో పోల్చడం ఏమి ఉపమ ? ప్రజాశ్రేయో దృష్టికల కవులు పదప్రయోగ పద్ధతిలో జాగరూకులై వుండాలని నా మనవి.

తెలుగు ధాతువులపై డాక్టరేట్

ధాతువనేది వ్యాకర్తలు రూపసిద్ధి కోసం పెట్టుకొన్న సంకేతం. తెలుగులోని ధాతువులు ఇన్ని ఉన్నాయి అని మనకేమి తెలుసు? శ్రీ వివేకానంద విద్యావ్యాసక సంస్థ తెలుగు కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు శ్రీ కె. రామకృష్ణశర్మ వీటిని ఏరి, వింగటించి, పరిశీలించి, వర్గీకరించి తెలుగు భాషకు ఎంతో సేవ చేశారు దానికి డాక్టరేట్ ఇటీవలే లభించింది ఈయన తెలుగు ధాతువులను అంత్యాక్షర ప్రదానంగా ద్విస్వర (బా.ఎం ఇత్యాది), త్రిస్వరములు (లంగు ఇత్యాది) వర్గీకరించి, క్రియా రూపాలు చూపెంచారు వివిధ నిఘంటువుల తోడ్పాటు పొందారు. ఈయన తత్సమ దాతువులను తీసుకోలేదు కేవలం ఆచ్చిక క్రియలనే గ్రహించారు శ్రీ రామకృష్ణశర్మ అనుసందాన వ్యాసం పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడడమే గాక, తెలుగు అధికార భాషగా ముందునుంచే (1966 నుంచే) తెలుగులో డిగ్రీ కోర్సు ఆరంభించి విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ విద్యా ప్రచార సంస్థ తలపెట్టిన పెక్కు బాషా పరిశోధన పథకాలకూ ప్రయోజనకరం

శ్రీ శ్రీనివాస చక్రవర్తి

నాటకకళకు జీవితం అంకితంచేసిన కళా తపస్విమిత్రులు శ్రీ శ్రీనివాస చక్రవర్తి. నాలుగు దశాబ్దాల క్రిందటే పట్టభద్రులైన శ్రీ చక్రవర్తి నాటకాల పిచ్చి లేకపోయివుంటే, ఈపాటికి, ఏ ఉన్నత ప్రభుత్వోద్యోగులుగనో పింఛను పుచ్చుకొని, ఈ పశ్చిమ దశలో హాయిగా ఉండేవారు కదా, అని మూడు దశాబ్దాలకుపైగా ఉన్న సరిచయంతో తలపోస్తూంటాను, కని, అలా జరిగివుంటే, ఆయనే కూర్చదగిన "నాటక విజ్ఞాన సర్వస్వం" ఆంధ్రావళికి అందేదా ? కర్మ సిద్ధాంతం ఎంతకాదనుకున్నా, ఎవరు ఎప్పుడు, ఎందుకు, ఏమవుతారో చెప్పడం కష్టమేననిపిస్తుంది. చక్రవర్తి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా, చలన చిత్రరంగంలో కొంతకాలం వున్నా, మీజాన్, తెలుగుదేశంవంటి పత్రికలలో పనిచేసి ఒర్నలిస్టుగా కొంతకాలం



గడిపినా, నాటక కళకు సంపాదకులుగా ఉన్నా, 'సావజి' గ్రంథమాలను నడిపినా, తలమీద నిండు కడవపెట్టుకుని ఎన్నోపనులు చేసినా, కడవను వదలని జనకునిలాగ శ్రీనివాసుని లక్ష్యం, పక్షం, చిత్రం, విత్తం నాటకకళే అయింది దాని ఫలితంగా ఆయన ప్రాచ్యపాశ్చాత్య నాటకకళను అగస్త్యునిలాగ ఆపోశనంపట్టి దాదాపు 75 రచనలను చేయడమేకాక, నాటకకళా సర్వస్వమే కాక ఆయన జీవిత పరిశ్రమ పరిశోధన సర్వస్వమైన "నాటక విజ్ఞాన సర్వస్వం"ను ఒంటిచేతిమీదుగా గ్రథించారు. దీనిలో తమ అపూర్వ సిద్ధాంతాలను ఎన్నిటినో పొందుపరచారు. దీనిని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఎకాడెమీవారు ముద్రించనున్నారు 65 ఏళ్ళు నిండనున్నా, ఆరోగ్యం సన్నగిలుతున్నా, నాటకకళకోసం, నాటకకళలో, నాటకకళ వ్యాపంగంతో జీవిస్తున్న శ్రీనివాస చక్రవర్తిని సంగీత నాటక అకాడెమీ నిర్వి సభ్యత్వంతోను, ఆంధ్ర విశ్వవిద్యాలయంవంటి సంస్థలు డాక్టరేట్లతోను గౌరవించడం అవసరం.


మంత్రి శ్రీ కేశవుల విదేశయాత్ర

రాష్ట్ర చేనేత పరిశ్రమ శాఖా మంత్రి శ్రీ కె. వి. కేశవులు పట్టుపరిశ్రమకు సంబంధించిన సాంకేతిక సహకారం విషయమై తూర్పుదేశాలతో సంప్రతింపుల జరిపే బృందంతోపాటు పర్యటనకోసం అక్టోబర్ 19వ తేదీన బయలుదేరి వెళ్ళారు. ఈ బృందానికి కేంద్ర మంత్రి శ్రీ ఎ పి. శర్మ నాయకులు. ఈ బృందం జపాను దక్షిణ కొరియా సింగపూర్ మొదలైన దేశాలు పర్యటించి 'పట్టుపరిశ్రమకు సంబంధించిన సాంకేతిక విజ్ఞానం సేకరిస్తుంది. మన రాష్ట్రంలో రెండవ పెద్ద సంఘం చేనేత కార్మికులది. శ్రీ కేశవులు తమ విజ్ఞానంతో ఈ సంఘాన్ని, తద్వారా రాష్ట్రాన్ని సంపన్నం చేయగలరని చైతన్య విలసితమైన ఆయన కార్యక్రమం, కార్యదక్షత, దీక్ష తెలిసిన ప్రతివారూ ఆశిస్తారు.

ఉపశ్రుతి

"సార్ ! ఏడుకొండలవాడు, ఆశ్రిత పక్షపాతి, భక్త వత్సలుడు, ఆపద మొక్కులవాడు, బహుపత్నీకుడు, మరి ఆయనను అనుసరించే ప్రభుత్వోద్యోగులకు ఎందుకు కంపల్సరి రిటైర్మెంటు ?" అని అడిగింది బి. ఎ విద్యార్థిని కె రమాదేవి నన్ను. నాకు ఏమీ సమాధానం తోచలేదు. మీకు తోస్తే చెప్పండి.

— తిరుమల రామచంద్ర.



మనస్సుల తారతమ్యం

'బాలవాక్యం బ్రహ్మవాక్యం' అని తెలుగులో ఒక సామెత ఉంది. బ్రహ్మ దేవుడు చెప్పినమాట ఎలా తప్పక జరుగుతుందో పిల్లవాళ్ల మాటకూడా ఆ విధంగానే జరుగుతుందని దీని అభిప్రాయం. దీనివల్ల మనకు ఏమి తెలుస్తున్నదంటే – బాలురు దైవసమానులని వాళ్ళ మనస్సు నిష్కల్మషంగా ఉండడంవల్ల వాళ్లకు ఆ గౌరవం కలిగింది.

పిల్లవాళ్లకు ఏ చీకూ, చింతా ఉండవు. ఇంట్లో ఏమి ఉన్నాయో, ఏమి లేవో – ఆ సంగతి వారికి అక్కరలేదు. ఆటలతోనూ, చదువులతోనూ కాలం గడిచిపోతుంది. వారు ఇతర విషయాలను వేటినీ పట్టించుకోరు.

ధర్మపథం —బులుసు వేంకటరమణయ్య.

అందువేత బాలుర మనస్సు పరిశుద్ధమైన తెల్లని వస్త్రంమాదిరి నిర్మలంగా ఉంటుంది. అట్టి శ్వేతవస్త్రంపైని ఏ రంగు అద్దినా బాగా పట్టుకుంటుంది. ఆ రీతినే పిల్లల మనస్సులో భగవంతుని గురించిన ఏ విషయమయినా గట్టిగా నిలిచి ఉంటుంది.

గృహస్థుల సంగతి అట్టిది కాదు. సంసార సముద్రంలోపడి ఉక్కిరి బిక్కిరి అవుతున్న వారికి ఎన్నో సమస్యలు! గృహ నిర్వహణం కోసం ధనికంగానూ, ఇంకో విధంగానూ – అంటే వస్తువుల సేకరణలోనూ ఎంతో శ్రమ ఉంటుంది. ఇలాగే కుటుంబంలోని వ్యక్తుల అభిప్రాయ భేదాలవల్ల కలహాలు, అనారోగ్యం, అతిథ్యభ్యాగతులనూ, బంధువులనూ గౌరవించడం – ఈ మొదలైనవి ఎన్నో మనస్సులో ప్రదర్శనలిస్తూ కలతపాటును కలిగిస్తాయి. అందువల్ల మనస్సు పరిశుద్ధంగా ఉండదు. అది పూతమైన శ్వేత వస్త్రంవంటిది కాదు మలినమై ఉంటుంది. లేదా ఒక రంగుపూసిన వస్త్రంవలె ఉంటుంది. అట్టి వస్త్రంపైని ఇంకొక రంగు పూయడం సాధ్యంకాదు. అది పట్టుకోదు. ఆ విధంగానే కలతపాటులో కూడిన మనస్సులో భగవంతుని గురించిగాని, ఆత్మ

తత్వాన్ని గురించిగాని ఏమి చెప్పినా నిలవదు. విషయం బోధపడినా వెంటనే మరపులోనికి వస్తుంది. అట్టివారికి తత్వోపదేశంవల్ల తగిన ప్రయోజనం ఉండదు.

అందువల్ల ఏ విషయాన్ని గ్రహించడానికైనా బాల్యావస్థయే ఉత్తమమైనది. విద్యాభ్యాసానికి బాల్యావస్థయే ఎంతో అనుకూలమైనదనీ, గృహస్థాశ్రమంలో ఉన్నవారు విద్య నేర్చుకోవడం కుదరదనీ అంటారు.

పెళ్లిచేస్తే చదువుకు ఎగనామమే అని 'వివాహో విద్యా నాశాయ' అనే సామెతయే తెలుపుతున్నది.

ఆత్మతత్వాన్ని గ్రహించడానికి చిన్నప్పుడే గట్టిగా ప్రయత్నించాలి. పెద్దఅయిన తర్వాత ఆ విషయం ఆలోచిద్దామని అనుకోకూడదు. అప్పుడు అది సాధ్యపడుతుందని చెప్పలేము.

"అదిరోసం"

కావలసిన వస్తువులు : బియ్యం పావుకిలో, బెల్లం 300 గ్రాములు, నెయ్యి 1 కప్పు, యాలకులు 15, ఉప్పు తగినంత, తినేసోడా చిటికెడు.

తయారుచేయు విధానము : మొదట బియ్యాన్ని బాగా నానపెట్టి పడపోయాలి. వడేసిన బియ్యం ఆరబెట్టి మెత్తగా పిండి కొట్టాలి. పిండిని సన్నని జల్లెడతో జల్లించాలి. లేదా పలచని బట్టతో రాల్చి, మెత్తని పిండిని వేరు చెయ్యాలి. మొరాలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. తర్వాత కొద్దిపాటి నీళ్ళలో ఉప్పు కలిపి. ఆ నీళ్లను పిండిలో జల్లించి, ముద్దగా, కలిపి వుంచుకోవాలి. అప్పుడే, కొద్దిగా, తినేసోడాను కూడా కలుపుకోవాలి. తర్వాత బెల్లం, ఒక పాత్రలో వేసి, తీగపాకం వచ్చేవరకు పాకం పట్టాలి. పాకం సరయిన పదునుకు వచ్చాక, దింపేసి వేరేగా అట్టేపెట్టుకోవాలి. ఇందులోనే యాలకుల పొడిని వెయ్యాలి. తర్వాత, మూకుడులో నెయ్యి బాగా కాగినతర్వాత, పిండిని, అరిటాకు మీద వేసి, పల్చగా, చెక్రాల్లా, వత్తుకుని, ఈ చెక్రాలను నేతిలో వేసి, ఎర్రగా, దోరగా వేయించి, పాకంలో పడెయ్యాలి. ఈ చెక్రాలు పాకాన్ని పీల్చుకుని తర్వాత గట్టిపడతాయి. ఇవి చాలా రుచిగా వుండి, కనీసము రెండు నెలలయినా కరకరలాడుతూ నిలవ వుంటాయి. తయారు చేయుట చాలా సులభం.

— జి. రామలక్ష్మి

వారఫలం

మహేష్

14-11-1975 శుక్రవారంమొదలు 20-11-1975 గురువారం వరకు

మేషం :— వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. ఉద్యోగంలో శ్రమకలుగుతుంది. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. వ్యాపారములో ఆదాయం పెరుగుతుంది. ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

వృషభం :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వ్యవహారాలు బాగుంటాయి వారంమధ్యలో చికాకులు యేర్పడతాయి. విద్యావైజ్ఞానిక రంగాలలో మీ కృషి కి ఆటంకాలు రాగలవు. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిధునం:— అన్నివ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశములు కూడా జారి పోవచ్చును. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. మీ తాలూకు వస్తువులుపోవచ్చును

కర్కాటకం:— సంతోషకరమైన వార్తలను వింటారు. వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి స్త్రీలకు— వినోద కాంక్షేపాల్లో పాల్గొంటారు. దైవ కార్యాలు నెరవేరతాయి.

సింహం :— ప్రయోజనం లేని శ్రమ కలుగుతుంది. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ఉద్యోగములో గౌరవం బాగుంటుంది స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు బంధుమిత్రులను కల్సుకొంటారు

కన్య :— వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది మీ ప్రయత్నాలకు ఆటంకాలు రాగలవు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి బంధువులకు చికాకులు ఏర్పడతాయి.

తుల :— ఇతరులనిమిత్తం శ్రమకుగురికాగలరు పోటీవారితో వాద ప్రతివాదాలు తగవు నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రాగలదు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

వృశ్చికం — వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

ధనుస్సు:— 'ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు పోటీవారిలో గౌరవం బాగుంటుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం :— వ్యాపారంలో పోటి వారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ముమ్మందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు— పుణ్యకార్యాలు చేస్తారు. అనుకూలమైన సమాచారం అందగలదు.

కుంభం:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు అందుతుంది ప్రయాణాలు ఫలిస్తాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం :— మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. విద్యావైజ్ఞానిక రంగాలలో మీ కృషి రాణించగలదు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

వివాహం

శ్రీ ఆరుద్ర శ్రీమతి కె. రామలక్ష్మి దంపతులు తమ జ్యేష్ఠ పుత్రిక చి. సౌ: కవితను శ్రీ. సి. విజయానంద్‌గారి కుమారుడు చి: అశోక్ చింతామణికిచ్చి అక్టోబర్ 9 న మద్రాసులో వైభవంగా వివాహం జరిపించారు. పెళ్లికి చిత్రపరిశ్రమకు పత్రికా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు.



చేతిలోని బ్రీఫ్‌కేస్‌ని, తాటాకుబుట్టని ప్లాట్‌ఫారం మీదుంచి, కర్చీఫ్‌తో అలసటగావున్న మొహం తుడుచుకున్నాను.

'మన అదృష్టం కొద్దీ యీవేళ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా కరెక్ట్ టైముకే వస్తుందిట'— అనుకుంటూ వాచీవంక చూసాను.

'నాలుగూ యాభై అయింది. ట్రెయిన్ అయిదూ అయిదుకి వస్తుంది. ఇంకా పావు గంట వుందన్నమాట. 'ఓ పెద్ద కంపెనీలో యింటర్వ్యూకి పిలుపొస్తే యిక బయలు దేరక తప్పిందికాదు — నాగపూర్‌కి.

ఎండాకాలం కావటంచేత టైమ్ అయి దవస్తున్నా, యింకా ఎండ తీక్షణంగానే వుంది. కాసేపు అటూ యిటూ చూస్తూ కాలక్షేపం చేస్తుంటే వినిపించింది ఎనౌన్సర్ గొంతు, మైకులో —

"దయచేసి వినండి! మద్రాసు నుండి న్యూఢిల్లీ పోవు 'లింక్ ఎక్స్‌ప్రెస్' యింకా కొద్ది క్షణాల్లో ప్లాట్‌ఫారం మీదికి రాబోతున్నది!!"

ప్రయాణీకులు అటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నారు.

కోన శ్రీనివాసరావు

కాసేపట్లోనే రైలొచ్చి ఆగింది. నేను ముందుగానే సీటు రిజర్వేషన్ చేయించుకున్నందువల్ల నాకు కేటాయించిన సీట్లో కూర్చున్నాను. కంపార్ట్‌మెంట్‌లో జనం కాస్త ఎక్కువగా ఉన్నారు. ఏమీ తోచక దగ్గరున్న మాగజైన్ తిరగేస్తూ కూర్చున్నాను.

ఇంతలో ఓ పాతికేళ్ళ కుర్రాడు ఒక నడి వయస్కుణ్ణి తీసుకొచ్చి నాకెదురుగా ఉన్న సీట్లో కూర్చోబెట్టాడు.

"కూర్చోండి ఫర్వాలేదు"— అన్నాడతను.

నాల్గు రూపాయినోట్లు లెక్క పెట్టి అతని చేతిలో పెట్టాడా నడి వయస్కుడు.

"యిదిగో టి. సి వస్తాడా!"

"మీ కెందుకు నే చెప్తాగా, టి. సి. కి. అతను మా బాబాయ్ కొడుకే" — అంటూ వెళ్ళిపోయాడతను. నా కర్థమైపోయింది, యిదొక రకం సంపాదనలే! అనుకున్నాను.

"ఎందాకా వెళ్ళారి మీరు ?"

"నాగపూర్"- ముక్తసరిగా జవాబిచ్చాను.

"నేను గూడా 'చాందా' దాకా వస్తాను" —తనంతట తానే చెప్పుకున్నాడు. "ఉహూఁ!" అన్నాను. ఇలాగే కాసేపు మాట్లాడటం మొదలెట్టాడు నాతో. తలూపుతూ కూర్చున్నాన్నేను.

కాసేపటికి టి. సి. వచ్చి దించేశాడతన్ని— అది యింకోళ్ల సీటంటూ.

గార్డు విజిల్‌తో రైలు కదిలింది. స్టేషన్ దాటటంతో వేగాన్ని పుంజుకుంది రైలు. బ్రీఫ్‌కేస్ పైన పెట్టి, బుట్టని సీటు కిందకి నెట్టుంటే గుర్తొచ్చింది — నిన్నటి సంగతి.

బాబిగాడు చెప్పాడుట ఎదురింటి పరంధామయ్యగారికి — మా అన్నయ్య నాగపూర్ వెళ్తున్నాడు అని. నిన్న సాయంత్రం యింటి కొచ్చారాయన "ఏమోయ్ సారథీ,, నాగపూర్ వెళ్తున్నావటగా ఓ చిన్నపని చేసిపెట్టుదూ" —అంటూ.

"ఎమిటో చెప్పండి" అన్నాను, కమలాఫలాలు అక్కడ ఎక్కువగా దొరుకుతాయట, ఓ బుట్ట తెచ్చిపెట్టు. అంటాడేమో అనుకుంటూ.

"ఆఁ! ఏమీలేదు. మనమ్మాయ్ సునీత అక్కడేగా వుంటోంది. ఎలాగూ వెళ్తున్నావు గాదా, ఓ పూట తీరిక చేసుకువెళ్లి యీ

వచ్చింది!

క్రొత్తగా

విజయ్ 24-24-0

ఇస్తుంది మీకు పుట్లకొలది పంట


మన రాష్ట్రంలోని నేలల్లో భాస్వర లోపం విస్తారంగా ఉంది. అధిక దిగుబడులు రాబట్టాలంటే ఈ ప్రాంతాల్లోని పొలాల్లో నత్రజనితో పాటు హెచ్చుమోతాదుల్లో భాస్వరపు ఎరువులను కూడా వేయాల్సి ఉంటుంది. ఈ అవసరాన్ని గుర్తించి మద్రాస్ ఫర్టిలైజర్స్ సంస్థ క్రొత్తగా విజయ్ 24-24-0 ను ప్రవేశపెట్టింది.

విజయ్ 24-24-0 యూరియా, అమ్మోనియా-భాస్వరాలు కలిగియున్న రసాయనిక ఎరువు. ఇందులో నత్రజని, యూరియా, అమ్మోనియా రూపాల్లో ఉంది. భాస్వరం అంతా నీటిలో పూర్తిగా కరిగే రూపంలో ఉంది. ఈ విధంగా క్రొత్త విజయ్ 24-24-0 వరిపైరుకు తక్కువ కాలంలో పంటకువచ్చే ఇతర పైర్లకు అన్నివిధాల తగిన ఎరువు.

విజయ్ 24-24-0 వ్యవసాయ శాఖవారి సిఫార్సుల ప్రకారం అన్ని పైర్లకు అనువైనది.

విజయ్ 24-24-0, నాణ్యమైన ఎరువుల ఉత్పత్తికి పేరెన్నికగన్న మద్రాస్ ఫర్టిలైజర్స్ వారిచే తయారుచేయబడింది.





మీ హితుడు
స్నేహితుడు
విజయ్

VIJAY
MADRAS FERTILIZERS

మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్
మద్రాస్ 600 068.

MFL-1059

"పదళ్ళు, కొత్త యిచ్చిరా నాయనా" అన్నా
రాయన.

ఆయన అనేదాకా సునీత అక్కడే వుంటున్నదన్న విషయం గుర్తు రాలేదెందుకో! ఆయన మాట కాదనలేక "పరేనండి, దాందేముంది" అన్నాను అయినా ఆయన 'మాట' కంటే, సునీత మీద నాకున్న అభిమానానికే ఎక్కువ విలువిచ్చి వప్పుకున్నాను.

ఎందుకో మొదట్నుంచీ సునీతంటే చాలా అభిమానం. సునీతకోసం ఏ పనైనా చేసే వాడ్ని.

అప్పటికి పదేళ్ళుంటాయేమో, మా యింటికి ఎదురుగానే పరంధామయ్యగారు యిల్లు కట్టుకున్నారు సునీత చాలా చిన్న పిల్ల - ఆరేళ్ళుంటాయేమో అప్పటినుంచి కలిసిమెలిసి తిరిగి, ఆడుకునే వాళ్ళం అలా కాలం గడుస్తుంటే, యిద్దరి వయసూ పెరుగుతోంది కానీ మా మధ్య అనుబంధం మాత్రం తరగలేదు

ప్రతిమనిషికీ ఒక్కొక్క మనిషిని చూసినప్పుడు ఒక్కొక్క అభిప్రాయం ఏర్పడుతుంది నాకూ అదేలాంటి అభిప్రాయం ఏర్పడింది అందుకే మా యిద్దరి మధ్యన స్నేహం సునీత పెళ్ళయేవరకు కూడా అలాగే నిర్మలంగా నిలిచిపోయింది

సునీతకు పెళ్ళి అయి గూడా రెండేళ్ళే

ఇలా సునీత గురించి ఆలోచిస్తుండగనే ట్రయిన్ కాజీపేట చేరుకుంది టైమ్ పదకొండాయాభై అయింది

చాయ్‌వాలాల కేకలతో చుట్టుపక్కలంతా నిండిపోయింది.

'ఇక్కడ గంట ఆగుతుంది కాబోలు' అనుకున్నాను. ప్రయాణీకుల హడావుడిలో

సునీత కాపురం

ఆలోచనలు, రైలు కదిలేవరకూ సునీతమీదికి మరల్లేదు

సునీతంటే నాకు ప్రాణంతో సమానం. తను కనబడని రోజంతా యేదో వెలితిగా వుండేది నాకు అదే నాకు అప్పటికీ ఇప్పటికీ అర్థంకాని విషయం. సునీతలోని అందం, ఆకర్షణ నన్నామె కంత దగ్గరగా చేశాయా?

—కాదు మనసందుకు ఒప్పుకోదు.

లేక ఆమెతో నాకున్న చనువువల్ల అభిమానమా?

'ఏమో? ఆ ప్రశ్నకి సమాధానం దొరకటం లేదు'

ఏది ఏమైనా నా హృదయంలో సునీతకొక స్థానం ఉన్నదనుకుంటే - యిప్పటికీ నా మనసేదో చెప్పలేనంతగా అనుభూతికి లోనవుతుంది!


ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాను. రైలు వేగంగా వెళ్తోంది.

ప్రక్కవాళ్ళు పెద్దగా మాట్లాడటంతో మెలకువ వచ్చి లేచి కూర్చున్నాను రైలు సరిగా ఎనిమిదీ యిరవైకి నాగపూర్ స్టేషన్‌చేరి ప్లాట్‌ఫారం మీద ఆగింది బ్రీఫ్‌కేస్, బుట్ట చేతిలో పట్టుకుని బయటకి వచ్చాను నాగపూర్ రైల్వేస్టేషన్ పెద్దదే

రిక్షాలో 'సిటా బర్డి' చేరి లాడ్జిలో దిగాను.

సాయంత్రం మనసులో సునీతని చూడాలని ఉబలాటంగా ఉన్నా, అడ్రస్ వెతికి, యిల్లు పట్టుకునేసరికి చాలాసేపవుతుందని వూరకుండిపోయాను.

మర్నాడుదయం యింటర్వ్యూకి వెళ్లి వచ్చాను.



తర్వాతిరోజు పరంధామయ్యగారిచ్చినబుట్ట తీసుకుని సునీతావాళ్ళింటికి బయలుదేరాను.

గోకుల్‌పేటలో వెతుక్కుంటూ వెళ్ళగా ఓ పెద్ద బిల్డింగ్ ముందు 'చంద్రశేఖర్, ఎల్ ఐ సి.' అన్న బోర్డు చూసి లోపలికి గేటుతీసుకుని అడుగుపెట్టాను. ఇంటిముందు పచ్చని లాన్ వుంది.

తలుపుతీసి "అరె సారథీ, నువ్వా! ఎప్పుడొచ్చావ్, రారా" అంటూ లోపలికి ఆహ్వానించింది సునీత

నాకాశ్చర్యమేసింది సునీత ఆకారాన్ని చూసి— అసలు సునీతేనా అనిపించింది నా మటుకు నాకైతే!

సన్నగా వున్నా, అందంగా సౌష్టవంగా వుండే సునీత ఆనాడు యింకా సన్నగా పీలగా, తెల్లగా పాలిపోయిన మొహంతో ఉన్నదంటే - ఏమిటోగా ఉంది నాకు. ఆ పరిస్థితికి నాలో కలవరం బయలుదేరింది.

"రా సారథీ కూర్చో! అలాగే నిలబడి వున్నావేం"- అని సునీత అనేదాకా, 'నేను నిలబడే వున్నానన్న' సంగతి నాకు తెలీదు. వెళ్ళి కుర్చీలో కూర్చున్నాను.

తనూ కుర్చీలో కూర్చుంటూ అంది సునీత, "అందరూ కులాసేనా!" అని

"ఆఁ" అని, "ఏమిటలాగైపోయావ్"— అన్నాను ఉండబట్టలేక.


"ఏం, ఎలాగున్నాను, బాగానే ఉన్నాను" అంది- ఓసారి తన వంక చూసుకుంటూ, మళ్ళీ తనే అంది, "- చాలా రోజులైంది గదూ నన్ను చూసి - అలాగే అనిపిస్తుందిలే, ఆత్మీయులందరికీ"- నవ్వుతూ

నా కళ్ళు యింట్లో గోడలచుట్టూ చూస్తున్నాయి. ఓ ఫోటో దగ్గిర ఆగిపోయాయి కళ్ళు.

"ఆ ఫోటో మీవారిది గదూ, పెళ్ళిలో చూడటమే, మళ్ళీ చూడలేదు -" అన్నాను.

"అవును" అంది యే భావమూ వ్యక్తం కాలేదామె మొహంలో. "యిది చూస్తుండు— క్షణంలో కాఫీ తెస్తాను"— అంటూ ఓ వీక్లీ నా ముందు పడేసి లోపలికి వెళ్ళింది సునీత. దాన్ని తిరగేయసాగాను కానీ నాకెందుకో చిరాకనిపించింది. నా కళ్ళముందు — కళ్ళు లోతుకుపోయి, బుగ్గలు పీక్కుపోయి— సన్నగా ఉన్న సునీత ఆకారమే మెదులుతున్నది

"సునీతెందుకలాగైపోయింది ?" - యిదే ప్రశ్న నన్ను వేధిస్తున్నది మరింకెవరైనా



రాజేష్ ఖన్నా
వారం వారం కొత్త తీరులు, రెన్నులు, కొత్త రకపోలతో—బాంబే డయింగ్ వారి దర్జా అయిన బట్టలతో తయారు చేసినవి. సింథెటిక్ షర్టింగుల హుందా అయిన శ్రేణిలో—50/50, 67/33, 80/20, ఇంకా 100% పోలియస్టర్ ప్రింటులు, పోలియస్టర్ డెనిమ్స్, ఇంకా టెక్స్చరైజ్డ్ సూటింగులు.
కాషిటాన్ పోలియస్టర్ షర్టింగు
వాడ్రేన్ పోలియస్టర్ సూటింగు
BDM-27A tel

అయితే అలా బాధపడేవాడ్ని కాదేమో!

సునీత కాపురం సరిగ్గా లేదా?

మన మనసెపుడూ గ్రాసుకుండే ముల్లు లాగుండాలి. 'సునీత స్వభావసిద్ధంగానే ఎంతో మంచిది. శేఖర్‌కూడా మంచివాడే. ఒకవేళ అలాంటిదేమైనా వుంటే — పరంధామయ్య గారంత తాపీగా ఉండేవారా — కూతురి జీవితాన్ని చూస్తూ,' అనిపించింది. ఈమధ్యేమైనా జబ్బుపడిందేమోలే అనుకున్నాను. అంతేననిపించింది.

అంతలో సునీత కాఫీ తీసుకొచ్చి అందించింది.

కప్పు అందుకుని "నువ్వూ తీసుకో" అంటూ ఆమె ముఖంలోకి పరీక్షగా చూసాను. ఆమె బుగ్గల మీదుగా కన్నీటి చారలు విస్పష్టంగా కనిపిస్తున్నాయి. లోపలికెళ్లి తనూ కాఫీ తెచ్చుకుని కూర్చుంది.

ఖాళీ కప్పు కింద పెడుతూ అడిగాను — "సునీతా! కన్నీళ్ళు కార్చావెందుకు?" — కొద్దిగా బాధగా.

"కన్నీళ్ళా! - కన్నీళ్లెందుకు సారధీ, యేం తక్కువైందనీ నాకు" — చాలా తేలిగ్గా అనేసింది.

కానీ నాకు మాత్రం, ఏదో విరక్తి కనిపించిందామె మాటల్లో.

"లేదు సునీతా, నువ్వేదో దాస్తున్నావ్" — నా గుండె బాధగా మూలిగింది.

"దాచేదేముంది సారధీ! ఏదో చిన్న నలక పడ్డది కంట్లో. నీళ్లు రావటం సహజం!"

ఆమె సమాధానం నాలోని ఆవేదనని కొద్దిగా తగ్గించింది.

"సునీతా, అన్నట్లు, మీ వారేరి?"

"కేంపెళ్లారు. వారు నెం కిరవై రోజులకు పైగా వెళ్తుంటారు క్యాంప్‌లకి."

"మళ్లెప్పుడొస్తారు కేంప్ నుంచి" — అడిగాను.

"ఎల్లుండి" అంది. తనే మళ్లీ, "సారధీ యివాళ భోజనానికి ఉండు" అంది.

"లేదు సునీతా, యివాళ పనుంది. రేపు వస్తాను" అన్నాను. సునీలేమీ మాట్లాడలేదు. కాసేపు కూర్చుని "వస్తా సునీతా" అంటూ ఆమెకు బుట్టు యిచ్చేసి బయలుదేరాను.

విసుగ్గా ఉంది. దగ్గర్లో సినిమా హాలు కనిపించింది. హాల్లోకి వెళ్లి కూర్చున్నాను. హాల్లో జనం ఎక్కువగానే ఉన్నారు.

సు నీ త కా పు రం

వెనుక వరుసలో కూర్చున్నాను. న్యూస్ రీల్' అయిపోయింది. సినిమా మొదలైంది. సినిమా కొద్ది కొద్దిగా రిలీఫిస్తున్నది నా మనసుకి.

కిసుక్కున నవ్వు—గాజుల గలగల—చిన్నగా గుస గుసలు — వినబడటంతో నా దృష్టిని సినిమా తెరమీది నుంచి ముందు వరస సీట్ల మీదికి సారించాను.

నల్ల గళ్ల గళ్ల సూటులో — చామన చాయగా, చెవుల కిందుగా ఉన్న పట్టీతో ఉన్నాడు—అతని పక్కనే కూర్చుందో యువతి —నల్లగా ఉన్నా ఏదో కొద్దిగా గ్లామర్ లేక పోలేదామె మొహంలో.

ఆమె చేయి అతని మెడ మీదుగా పోయింది. అతన్ని భుజంమీద వాలిపోయి నవ్వుతోంది.

అతనికేసి కొద్దిగా దీక్షగా చూసాను. లతన్నెక్కడో చూసినట్లనిపిస్తున్నది. కాని

> **టేబుల్ టెన్నిస్**
>
> ఏకబిగిన 'టేబుల్ టెన్నిస్ ఆడటంలో రికార్డు ఇంతవరకూ 28 రోజులు. ఈ రికార్డు కూడా బద్దలై పోయింది. ఇప్పుడు కొత్త రికార్డు 32 రోజులు. ఓ 8 మంది కలిసి యీ కొత్త ప్రపంచ రికార్డు స్థాపించారట అంతా బాగానే వుంది గానీ, ఇంతకీ ఆడినవాళ్లు ఎవరో తెలుసా ఇంగ్లాండులోని ఓ పిచ్చాసుపత్రి పేషెంట్లట.

ఎవరో సరిగ్గా పోల్చ మాత్రం చెయ్యలేక పోతున్నాను. చివరికి చంద్రశేఖరేమో అనుకున్నాను.

'ఛ! అయినా చంద్రశేఖర్ యింతగా దిగజారిపోతాడా! సునీత కన్యాయం చేస్తాడా, సునీతలో ఏం తక్కువైందని. యితను సునీత భర్త కాదులే! అయినా శేఖర్ కేంప్ కెళ్లాడుగా. మరితనెవరైవుటాడు. అయినా మనుషుల్ని పోలిన మనుషులుండటం సహజంగదా! అనుకున్నాను. మనసు యీ విధంగా ఆలోచిస్తున్నది.

సినిమా వదిలిన తర్వాత లాడ్జికొచ్చేసి, తీరిగ్గా బాల్కనీలోంచి కిందికి చూస్తున్నాను.

అయినా, వాళ్లిద్దరి రూపాలు నేను మరిచి లేకపోతున్నాను. వాళ్ళని గూర్చిన ఆలోచనన్నే నన్ను వెంటాడుతున్నాయి.

లాడ్జీ ముందో టాక్సీవచ్చి ఆగింది.

ఓ జంట దిగింది, అందులో నుంచి, నా కనుమానమేసింది. ఇందాకటివాళ్లే వీళ్ళు. కాసేపటికి నా పక్కనుంచే నన్ను దాటి దూరంగా ఉన్న రూమ్‌లోకి వెళ్లిపోయారు.

నా కంతా అయోమయంగా ఉంది. నా మనసంతా గందరగోళమైపోయింది.

* * *

మర్నాడుదయం పదింటికి బయలుదేరాను, సునీతా వాళ్లింటికి. సునీత తీరిగ్గా కూర్చొని వుంది హాల్లో.

"రా సారధీ, కూర్చో ... నీ కోసమే చూస్తున్నా —" అంది.

కాసేపు కబుర్లు చెప్పుకున్నాక సునీత అన్నది "వడ్డించనా," అని. తలూపాను, "నువ్వూ తిను"— అంటూ.

భోజనం ముగించి హాల్లో సోఫాలో కూర్చున్నాను, వీక్లీ తిరగేస్తూ. సునీత వచ్చి పక్కనే కూర్చుంది.

"సునీతా నేనొకటడుగుతాను, సమాధానం చెప్తావా?" ఎలాగో అడిగాను.

"ఏమిటది?"— ప్రశ్నార్థకంగా చూసింది నావేపు.

"నువ్వేదో లోలోపల బాధపడుతున్నావ్, నాతో చెప్పగూడదా!"

"లేదు సారధీ బాధేముంది' '— ఆమె గొంతు పూడ్చుకుపోయింది. సునీత కళ్ళలో నీళ్ళు తిరిగాయి

"కాదు సునీతా! నువ్వు చాలా బాధ పడుతున్నావ్. నాతో చెప్పు సుజాతా. చేతనైన సహాయం చేస్తాను."

సునీత కళ్ళు ధారగా వర్షిస్తున్నాయి. నా గుండె తరుక్కుపోయింది. ఆత్మీయులు బాధపడుతూ కళ్లవెంట నీరు కారుస్తుంటే, ఎవరికైనా అంతేనేమో! మెల్లగా పక్కకి జరిగి ఆమె తలమీద చెయ్యేసాను.


"ఛ! ఏమిటి సునీతా, చదువుకున్న నువ్వు గూడా యిలా అధైర్యపడితే ఎలా? ఉన్న సంగతేమిటో చెప్పు సునీతా!" — అన్నాను, అనునయంగా.

అలా అన్నానేగానీ, చదువుకున్న వాళ్లైతే మాత్రం, కష్టాల్లో బాధపడకుండా ఎలా

(32వ పేజీ చూడండి)

దగ్గులను కొట్టిపడవేయు ఛాంపియన్

Alembic



గ్లైకోడిన్ వలె దగ్గులను కొట్టిపడవేయగల గృహవైద్యం మరొకటి లేదు. దగ్గులను 4 స్థలాలలో— అనగా మెదడు, గొంతు, రొమ్ము, ఊపిరితిత్తులలో— ఎదుర్కొని శీఘ్రమే ఉపశమనాన్ని యిస్తుంది • ఇది త్వరగా పనిచేస్తుంది • రుచికి మధురం • మరియు పొదుపు.

గ్లైకోడిన్ — లక్షలాది ప్రజలు 40 ఏళ్లుగా నమ్ముకొన్నది.

everest/617r/ACW-tl

సీరియల్

శ్రావణసంధ్య

తెళ్ళూరు నాగేశ్వరరావు

“ఇదుగో! శాంతీ! ఈ వంద రూపాయలు పట్టుకెళ్లి నే చెప్పినవన్నీ తీసుకురా! జల్దీ!” అన్నాడు రాంమ్మోహన్ వంద రూపాయల నోటు ఇవ్వబోతూ

చివుక్కున భర్తకేసి చూసింది శాంతి

“ఎక్కడదండీ ఆ నోటు?”

“ఎక్కడిదైతేం? ముందు అవసరాలకు వాడు తర్వాత ఇద్దాం”

“రాజారాం డబ్బులోదా?”

“కరెన్సీ నోటుకు ఆనవాలేముంది? అత నొచ్చినప్పుడు మన డబ్బు యిద్దాం”

“ఏమీ అక్కర్లేదు ప్రాణం పోయినా నేను ఆ డబ్బు ముట్టుకోను” అంటూ లేచింది శాంతి

ఎదురింటి లాయరుగారి భార్యదగ్గర కెళ్లి పదిరూపాయలు చేబదులు తీసుకుంది శాంతి రిక్షాలో బజారు కెళ్లింది మందులూ, అవీ తీసుకు రావటానికి

ఆ సాయంత్రానికి నీలిమకు జ్వరం తగ్గింది

ఆ సాయంత్రమే యింట్లో వున్న కొన్ని వస్తువులను అమ్మివేసింది శాంతి అలారం టైంపీస్, గ్రైండర్, బాయిలర్, రెండు వెండి గ్లాసులు, రిస్టువాచీ, సోఫాకంబెడ్ మొదలైనవి అమ్మగా ఆరువందల ఏభై అయిదు రూపాయలు వచ్చాయి ఆ వస్తువులన్నీ ఒకప్పుడు యింటి హోదాను చెప్పక చెబుతూండేవి ఇప్పుడు ఆ హోదాయే లేదు ఇంకా ఆ వస్తువులు దేనికి? అనుకుంది శాంతి

రేడియో మాత్రం అమ్మవద్దనీ, అదే తనకు కాలక్షేపమనీ రాంమ్మోహన్ అనగా, దాన్ని అమ్మ లేదు శాంతి

“ఇట్లా అమ్ముకొంటూపోతే, కొన్నాళ్ళకు వస్తువులన్నీ అయిపోయి, మనుషులమే మిగిలి పోతాం” అంది శాంతి ఆ రాత్రి

“అవును అదీ నిజమే. మనుషుల్ని కొనేవాళ్లు వున్నా — నాబోటివాడ్ని కొనుక్కొని ఏం చేసు కుంటారు? నాకే ఎదురు తిండి పెట్టి, పోషించాలి!”

“మాటవరసకంటున్నా!.. ఈ డబ్బు అయి పోయే లోపుగానే, నాకేదైనా ఉద్యోగం దొరికితే కుటుంబానికి ఆసరా చిక్కుతుంది ఉద్యోగమే ఎలా

(గత సంచిక తరువాయి)

దొరుకుతుందో, ఎవరిస్తారో, ఏమిటో — అంతా అయోమయంగా వుందండీ!”

రాంమ్మోహన్ రెండు నిముషాలపాటు తీవ్రంగా ఆలోచించాడు

“శాంతీ! నాకో ఐడియా వచ్చింది.”

“ఏమిటండీ!”

“నేను పనిచేసిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు రఘునాథ్ చాలా మంచివాడు యోగ్యుడు దయా దాక్షిణ్యాలు గలవాడు నాకు యాక్సిడెంట్ జరిగాక ఒకసారి హాస్పటల్‌కు కూడా వచ్చి పరామర్శించి వెళ్ళాడు నేనంటే సానుభూతిగా వుంటాడు ఒక ఉత్తరం వ్రాసియిస్తాను తీసుకెళ్లు. ఆ కంపెనీలో ఏదో ఒక ఉద్యోగం యివ్వకపోడు. నాకు నమ్మకముంది”

కారుచీకటిలో కాంతిరేఖ గోచరించినట్లయింది శాంతికి “అల్లాగే” అన్నది నూతనోత్సాహంతో

10

కంపెనీ మేనేజింగ్ డైరక్టరు యిల్లు బంజారా హిల్స్‌లో వుంది ఉదయం ఏడుగంటలకు సిటీబస్సులో బయలుదేరింది. ఆమె అక్కడకు చేరుకొనేసరికి ఏడూ యిరవై అయింది. బస్సులో కూర్చున్నంతసేపూ ఆమె మనస్సు గత జీవితంవైపు మళ్లింది

రాంమ్మోహన్‌ను గాఢంగా ప్రేమించడం

పెళ్లిచేసుకోవాలని పట్టుబట్టడం

వర్ణాంతర వివాహానికి తండ్రీ అన్నయ్యా ససేమిరా ఒప్పుకోకపోవడం

తను వాదించి, మొండిపట్టు పట్టి, చెప్ప కుండా కట్టుబట్టలతో ఇంట్లోంచి రావడం...

స్నేహితులు పెళ్లి ఏర్పాట్లు చేయడం

రిజిస్టర్డు మేరేజి కావడం, ప్రమాణాలు

హోటల్లో పార్టీ

ఆ పార్టీలో కొంతమంది దాంపత్య జీవితాన్ని గురించీ, వర్ణాంతర వివాహం గురించీ ఉపన్యాసాలు ఇవ్వడం

రాంమ్మోహన్‌కు వెంటనే ఉద్యోగం రావడం...

కులాసాగా జీవించటం .


అయినవాళ్లతో సంబంధాలు తెగిపోవటం...

విధి వక్రించడం.

— మొదలైన సంఘటనలన్నీ సినిమా ‘ఫ్లాష్ బాక్’ వలె ఆమె మనస్సులో మెదిలాయి

గత జీవితానికీ, ప్రస్తుత జీవితానికీ ఎక్కడా సామ్యం లేదు ‘ఇలా ఎందుకు జరిగింది?’ అనే ప్రశ్నకు తాను ఏం సమాధానం చెప్పకుంటుంది? ముందు హెచ్చరిక లేని సంఘటనలు ఎన్నో జరుగుతూ వుంటాయి జీవితంలో వాటికి తార్కిక జ్ఞానాన్ని అనువర్తింపజేసినా, కారణాలూ — ఫలితాలూ బోధ పడవు ‘జరిగేదేదీ అనుకొన్నట్టు జరగదు’ అనే సిద్ధాంతం ప్రాతిపదికగానే నిత్యకర్మల్లో అందరూ పాల్గొవడం జరుగుతుంది కాకరకాయ చేదుగా వుంటుందని, తినడం ఎవ్వరూ మానివేయరు అట్లాగే జీవితంలో ఎదురయ్యే కొన్ని సంఘటనలు తగని చేదుగా వుండొచ్చు వాటిని స్వీకరించి, అనుభ వించక తప్పదు ప్రస్తుతం తన పరిస్థితి అల్లాగే ఉంది జీవితంలో చేదునూ, విషాదాన్నీ, సంక్షోభాన్నీ, చీకటి దశనూ తాను అనుభవిస్తున్నది ముందు నుంచీ ఆర్థిక విషయాలలో జాగ్రత్తగా వుండి వుంటే, పొదుపు ప్రవృత్తిని అవలంబించి వుంటే, ముందు చూపుతో పది రాళ్లు నిల్వ చేసుకొని వుంటే — సంసారం ఇంతగా ఆర్థిక సంక్షోభానికి గురై వుండేది కాదు ఇప్పుడు అనుకొనీ, అఘో రించీ ఏం లాభం? అనుకొంటూ శాంతి అడ్రసు ప్రకారం మేనేజింగ్ డైరక్టరు ఇంటికి వెళ్లింది

అది పెద్ద భవనం చుట్టూ అందమైన ప్రహరీ ఉంది లోపల సిమెంట్ రోడ్లు బారులు తీర్చి వున్నాయి దాదాపు మేడ చుట్టూ గార్డెన్ వుంది ఆ గార్డెన్‌లో రకరకాల పూల చెట్లున్నాయి. గులాబీలు, ధాలియా, యాస్టర్, జర్బేనియమ్, కాస్‌మాస్, మందార, నందివర్ధన, రాధాకృష్ణ, మల్లె మొదలైన పూలచెట్లు రంగు రంగుల పువ్వులు



పూస్తూ గార్డెన్ కెంతో శోభను యిస్తున్నాయి గార్డెన్ మధ్య ఫౌంటెన్ వుంది ఆ గార్డెన్‌లోని పువ్వు లన్నింటిని, వాటి పేర్లనూ చదువుకొంటూ మెల్లగా గార్డెన్‌లో నడుస్తూ వెళుతూంది శాంతి

ఉదయపు తెల్లని, మెత్తని ఎండకు ఆ గార్డెన్ ముగ్ధమనోహరంగా వుంది రెండువేల గజాల్లో చిన్న బిల్డింగ్‌ను అధునాతన పద్ధతుల్లో కట్టుకొని, చుట్టూ గార్డెన్‌ను వేసుకోవాలనీ, ఆ గార్డెన్‌లో దేశంలో ఎక్కడెక్కడ వున్న ఫ్లవర్ ప్లాంట్స్‌ను తెచ్చిపెట్టాలనీ తానూ, రావ్ ఎన్నో మాట్లు అనుకొన్నారు ఇప్పుడవన్నీ ఆలోచనలకు కూడా అందుబాటులో లేవు అనుకొంది శాంతి

ఒక లావుపాటి ఆవిడ ఎదురైంది శాంతికి. వయస్సు కచ్చితంగా ఎంత ఉంటుందోగానీ, నలభై యేళ్ళు వున్నట్టుగా కనబడుతోంది. నల్లగా తుమ్మ మొద్దులా వుంది రెండొందల పౌన్లకు పైచిలుకు బరువే వుంటుంది పసిపిల్లలు చూస్తే దడుచు కొనేంత వికారంగా, వికృతంగా వుంది. నుదురు చాటంత, చెవులు ఏనుగు చెవులు, ముక్కు రాంములక్కాయ, నోరు చేపనోరు, కిందనుంచీ, పైవరకూ ఎత్తుపళ్లాలులేకుండా వార్నీషు పులిమిన దేవాలయపు స్తంభంవలె వుంది ఈ అందానికి తోడు ఎలకతోకలాంటి జడ అయితే యేం, ప్రింటెడ్ నైలెక్స్ చీర కట్టుకొని వుంది మెడ నిండా నగలుకూడా ఉన్నాయి ఎందుకో ఆవిడను చూడగానే లోకంలో యింత అందవికారులు కూడా వుంటారా ? అనిపించింది శాంతికి ఆ యింట్లో పనిమనిషి కామోసు అనుకుంది శాంతి ముందుగా ఆవిడ పలకరించింది

"ఏయ్! ఎవరుకావాలి ?" అంది ఆవిడ నిర్లక్ష్యంగా



ఆ సంబోధనకు శాంతి అదిరిపోయింది ఏం చూసుకొని దీనికింత టెక్కు ? అనుకుంది శాంతి.

"రఘునాధ్‌గారు —"

"ఆయన్తో నీకేం పని ?"

"పని వుండే వచ్చాను"

"నీలాంటి సీతాకోక చిలకలు అస్తమానం వస్తూపోతూనే వుంటారు ఆ పనేంటో నాతో చెప్పు"

శాంతి మనస్సు చివుక్కుమంది ఆ ధోరణి చూస్తే ఆయన భార్య కాబోలు అన్న అనుమానం వేసింది శాంతికి పనిమనిషికి యింత అధికారికంగా మాట్లాడే దమ్ము ఎలా వుంటుంది ?

"వారితో మాట్లాడాలి" అన్నది శాంతి నెమ్మదిగా

"ఏం మాట్లాడాలి ? దేన్ని గురించి ?"

"వారితోనే మాట్లాడాలి"

"అదే ఏమిటని నేను అడుగుతున్నాను విన బడడంలా! ఏం మాట్లాడాలో ముందుగా నాతో చెబితే, ఆయనతో మాట్లాడే అర్హతా, అవకాశమూ ఉన్నదో, లేదో నేను ఆలోచిస్తాను. ఆపైన నేను వారితో మాట్లాడతాను"

ఆ ధోరణీ, వైఖరీ శాంతికి ఓ పట్టాన అర్థం కాలేదు

అంతలోనే ఓ విమానం చెవులు 'ఝుయ్' మనిపిస్తూ కింది ఎత్తుగా పోతూన్నది. కార్ వెళ్లీ అప్పుడే 'టేక్ ఆఫ్' అయినట్లుంది

"వారు ఇంట్లో లేరా ?"

"ఆపైన పోయేదేమిటి ?"

"విమానం"

"అందులో వారు మద్రాసు పోతున్నారు"

శాంతి గుండె నిరాశతో నీలుక్కుపోయింది

"ఎప్పుడొస్తారు ?"

"ఆయన ఎప్పుడొచ్చేదీ, ఎక్కడుండేదీ, ఏం చేసేదీ నాకు తెలుసు మరో ఆడదానికి తెలియాల్సిన పనిలేదు అయినా నీబోటివాళ్ళకు సమాధానాలు చెప్పటానికి నాకు బైమెక్కడిది! ముందు నువ్వొచ్చిన పనేమిటో నాకు వివరంగా చెప్పు! నా యిష్టంలేనిదే ఈ యింట్లో ఏమీ జరగదు. ఆయనైనా ఏమీ చేయలేడు"

తాను వచ్చిన పని ఈవిడతో చెప్పటమా, మానటమా అనే సందిగ్ధావస్థలో పడింది శాంతి చెబితే ఏం తంటావస్తుందో, చెప్పకపోతే ఏం కీడు జరుగుతుందో అనే మీమాంసలో పడింది. ఆమె ఆవిధంగా ఆలోచించుకుంటూ వుండగా, డ్రాయింగ్ రూమ్‌లోంచి బయటికి వచ్చాడు రఘునాధ్.

"ఎవరూ ?"

అతన్ని చూసింది శాంతి ఆరడుగుల విగ్రహం హుందాయైన పర్సనాలిటీ. ఎముకపుష్టిగలవాడు పచ్చని ఛాయ చెంపలు కిందివరకూ పట్టెలు పైకి దువ్విన క్రాపు గ్లాస్కో లుంగీమీద, లాల్చీ వేసుకున్నాడు అప్పుడే షేవ్ చేసుకున్నట్టుంది. మనిషిలో ఎగ్జిక్యూటివ్, కళ ఉట్టిపడుతోంది అతనే రఘునాధ్ అయివుంటాడని భావించి, వెంటనే నమస్కారం చేసింది శాంతి

ఆమెకేసి కొన్ని క్షణాలపాటు రెప్పవాల్చకుండా చూశాడు రఘునాధ్ ఆపైన చూడటానికి

జరిగిన కథ 4 : ప్రేమించి పెళ్లి చేసుకున్న రాంమ్మోహన్, శాంతిల అనురాగ ఫలం నీలిమ. ఎంతో వైభవంగా ఏడవ వెడ్డింగ్ యానివర్సరీ జరుపుకుంటారు. స్కూటర్ ప్రమాదంలో కాలూ, చేయీ పోగొట్టుకుంటాడు రాంమ్మోహన్. ఆర్థిక ఇబ్బందుల్లోకూడా పూర్వంలాగా జరగాలనే రాంమ్మోహన్ మనస్తత్వం మరింత బాధి స్తుంది శాంతిని. ఉద్యోగం వెతుక్కోవాలను కుంటుంది శాంతి శాంతి బావ రాజారావ్ వచ్చివెళుతూంటాడు

నిజంగా ఆయనకు ధైర్యమూ లేదు; పర్మిషనూ లేదు ఎదురూగ్గా భార్య లీలామణి భూతంలా నిలబడేవుంది.

"ఏం కావాలి ?" అన్నాడు రఘునాధ్ కను బొమలు ఎగరవేసి తాను అంతకు ముందు ఆమెను ఎక్కడా చూడలేదన్న భావం భార్యలో కలిగించాలి అప్పటికిగానీ లీలామణి మనస్సు చల్లబడదు

హ్యాండ్ బ్యాగ్‌లోంచి భర్త వ్రాసిన లేఖను తీసి అతనికిచ్చింది శాంతి ఆ ఉత్తరాన్ని చూసి, "లోపలకు రండి" అన్నాడు రఘునాధ్

శాంతి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లింది. ఆమె వెంటే లీలామణి కూడా లోపలకు నడిచింది.

"పాపం! రాంమ్మోహన్‌ది వెరీ అన్ హాపీ యాక్సిడెంట్ అంతా విచారించాం మన చేతుల్లో ఏముంది ? ఇప్పుడెలా వున్నాడు ?" అన్నాడు రఘునాధ్.

శాంతి కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. వెంటనే జవాబు చెప్పలేకపోయింది. ఆమె మొహంలో విషాదాన్ని రఘునాధ్ గ్రహించాడు

"ఒక కాలూ, చెయ్యీ తీసివేశారండీ!... లేకపోతే ప్రాణాలకే మోసం అన్నారు డాక్టర్లు నా అంగీకారం అడిగారు. చూస్తూ చూస్తూ ఏ భార్య తన భర్త ప్రాణాల్ని పోగొట్టుకోవటానికి సిద్ధపడుతుంది ? తరువాతి ఫలితాలు ఏమైనాగానీ, ఆయన బ్రతికితే చాలు అన్నానండీ. నెల రోజుల తర్వాత అవిటివాడై, అశక్తుడై ఇంటికి రావాల్సి వచ్చింది అప్పట్నుంచీ సంసారాన్ని ముందుకు నెట్టుకెళ్లే బాధ్యత నామీద పడిందండీ!"

"హృదయ విదారకమైన పరిస్థితి. ఒక్కొక్క ప్పుడు భగవంతుని చేష్టలు పరమ కిరాతకంగా వుంటాయి అయినా నిశ్శబ్దంగా వాటి పరిణామాల్ని అనుభవించాల్సిందే!"

"మీ కంపెనీలో నాకేదైనా చిన్న ఉద్యోగం ఇప్పించారంటే – జీవితానికి కొంత పట్టు చిక్కు తుందండీ!" అన్నది శాంతి దీనంగా

"ఓహో! అదా సంగతీ! ఉద్యోగం కోసం వచ్చావన్న మాట! ఆ సంగతి నాతో చెప్పొచ్చుగా! నన్ను కాదని నేరుగా యజమాన్ని కల్సుకోవాలనే ఉబలాటమా ?" అంది లీలామణి దీర్ఘాలు తీస్తూ

మొహం చిట్లించి భార్యకేసి చూశాడు రఘునాధ్

"ఇదుగో అమ్మాయ్! ఇక్కడ మేం ఉద్యోగాల్ని

కబుర్లు చెప్పకండి పని చేయండి!

రాసులు పోసుకు కూర్చోలేదు. ఇదేమీ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజీ కాదు. ఉద్యోగం లేదు, గిద్యోగం లేదు. వెళ్ళు. వచ్చిందారినే పట్టు" అంది లీలామణి రుస రుస లాడుతూ.

శాంతి హతాశురాలైంది. ఆవిడకు తనమీద అంత పగా, ద్వేషమూ ఎందుకో? జీవితంలో మొదటిసారే ఆవిడను తను చూస్తూంట!

ఆవిడ భర్తమీద అస్త్రాన్ని ప్రయోగించింది.

"ఏమండోయ్! ఈ వన్నెల విసనకర్రకు మీరు ఉద్యోగం యిస్తేరా, మీముందే ఉరేసుకు చస్తాను. ఆc! ఏమనుకున్నారో, ఏమిటో!"

ఆవిడ శపథంతో శాంతి నిలువునా నీరై పోయింది.

అందమైన స్త్రీలంటే లీలామణికి మొదటి నుంచీ గిట్టదు. జెలసీ కానివ్వండి, ద్వేషం కానివ్వండి, సినిసిజం కానివ్వండి, అందమైన స్త్రీ తటస్థపడిందంటే ఆవిడ కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది. జన్మవైరం వున్నట్టు కొరకొర చూస్తుంది. శాంతి అందంగా వుండడమే ఆవిడలో నిష్కారణమైన ద్వేషానికి హేతువైంది.

భార్య చేతిలో పూర్తిగా కీలుబొమ్మ కానప్పటికీ, ముఖతా ఆవిడకు ఎదురు చెప్పడు రఘునాథ్. ఎందుకంటే, రఘునాథ్ ఈ వున్నతస్థితికి రావటానికి ఆవిడ ఆస్తే కారణం. ఆవిడ ఐశ్వర్యమే రఘునాథ్‌కు సాంఘికంగా గొప్ప హోదాను తెచ్చిపెట్టింది. అతను ఈనాడు ఆర్థికంగా యింత ఉన్నతంగా వున్నాడంటే,అందుకు మూలవిరాట్టు లీలామణియే!

"ఐయామ్ సారీ! ... ఇప్పుడు మా కంపెనీలో ఉద్యోగాలేమీ లేవు. ఇంతకుముందు పెట్టిన వాళ్ల అప్లికేషన్లే ఆరుడజన్లు వున్నాయి. మీరు మరెక్కడైనా ట్రై చేసుకోవడం మంచిది" అన్నాడు రఘునాథ్ మొహాన్ని పక్కగా పెట్టి.

శాంతి మనస్సు నిరాశతో కుంగిపోయింది ఒక్కసారిగా. నోరుతెరిచి మాటాడలేకపోయింది. ఒక నిముషంపాటు నిశ్శబ్దంగా కూర్చుని, "వస్తానండీ!" అంటూ నమస్కారంపెట్టి, లేచి వచ్చింది.

గర్వంగా చిరునవ్వు నవ్వింది లీలామణి – తన మాట నెగ్గినందుకు.

11

తాను లేవగానే ఎవరి మొహం చూసిందో, ఎంతో ఆశతో వచ్చిన పనికి చుక్కెదురైంది. శనిదేవత నీడలా వెంటాడుతూంటే, అనుకున్నవి అనుకొన్నట్టు జరుగుతాయా? తను దురదృష్ట జాతకురాలు. పాపం! తన దురదృష్టమే రామ్‌కు శాపంలా తగిలి, అవిటివాడ్ని చేసింది. ఈ జీవితంతో పోరాడటానికే తాను ఈ భూమిమీద పుట్టిందేమో! ఈ పోరాటానికి అంతమెప్పుడో! ఈ ఆశాజ్యోతి కూడా ఆరిపోయింది. మళ్లీ ఆశల్ని కల్పించుకొనే శక్తీ, ఓర్పూ క్రమేపీ క్షీణిస్తున్నాయి...అనుకుంటూ శాంతి నిరాశతో, నిస్పృహతో

నీరసంగా, నెమ్మదిగా నడుస్తూ బస్ స్టాప్ దగ్గరకు వెళుతూంది.

వెనగ్గా, దగ్గరలో కారు హారన్ వినబడేసరికి ఉలిక్కిపడి వెనక్కుతిరిగి చూసింది శాంతి. ఆమె చెంతగా వచ్చి ప్రీమియర్ పద్మిని కారు ఆగింది. ఆ కారులోంచి రఘునాథ్ కిందికి దిగాడు.

"ఐయామ్ సారీ శాంతీ! అంత నిర్మొహమాటంగా మాట్లాడినందుకు మీ మనస్సు నొచ్చుకొని వుండొచ్చు."

"ఫర్వాలేదులెండి. అవతల మీ సతీమణిగారు ఎందుకో నాపైన అనవసరంగా పగబట్టారు."

"ఆమె స్వభావమే అంతలెండి. తాను అంద వికారంగా వుంటుందిగదా! అందమైన ఆడవాళ్ళు కనబడితేసరి విరుచుకుపడుతుంది. వాళ్లకెలాంటి సహాయమూ చేయదు. ఆవిడకుండే భయాలు ఆవిడకున్నాయి. మీరేమీ అన్యధా భావించకండి. ఐ విల్ సర్టెన్లీ హెల్ప్ యు. రేపు మా ఆఫీసుకు రండి. మీ విషయం ఆలోచిస్తాను."

"వెరీ మెనీ థ్యాంక్స్ సర్!" అంటూ రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేసింది శాంతి.

"రాంమ్మోహన్ నైస్‌ఫెలో! పాపం! ఆ యాక్సిడెంట్‌వల్ల నిష్ప్రయోజకుడైపోయినాడు. అతని ఫామిలీకి సహాయం చేయడం నా ధర్మం. వస్తాను" అంటూ కారెక్కాడు రఘునాథ్.

ఆ కారుబయలుదేరి వెళ్లేవరకూ నిలబడి అతనికేసి కృతజ్ఞతా భావంతో చూస్తూనే వుంది శాంతి.

ఆమె మానసిక కల్లోల సముద్రం కొంత శాంతించింది. మంచి రోజులు కనుచూపుమేర దూరంలో గోచరిస్తూన్న ఆశాభావం ఆ క్షణంలో పొడ చూపింది. ఉషారుగా బస్‌స్టాప్ దగ్గరకు నడిచింది శాంతి.

12

ఆ మధ్యాహ్నం రాజారాం వచ్చాడు. శాంతి ఇంట్లో లేదు. ఉద్యోగం నిమిత్తం రఘునాథ్ కంపెనీకి వెళ్లింది. రాజారాం వస్తూ వస్తూ రాంమ్మోహన్‌కు ప్రజెంటేషన్‌గా హేగ్ స్కాచ్ బాటిల్ తెచ్చాడు. దాంతోపాటు రెండు త్రీ ఫైవ్స్ సిగిరెట్ ప్యాకట్లు కూడా ఇచ్చాడు. ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా బాధల్లో వున్న రాంమ్మోహన్‌కు ఆ స్కాచ్ బాటిల్ అమృత కలశంవలె కనబడింది. విపరీతంగా సంతోషించాడు.

బాటిల్ ఓపెన్ చేసి, గ్లాసుల్లో పోసుకొని, ఇద్దరూ సేవించసాగారు – సిగిరెట్లు ముట్టించి.

"సోడాలుంటే బావుండేది. దగ్గర్లో షాపు లేదు. తెచ్చేవాళ్లుకూడా ఎవరూ లేరు" అన్నాడు రాంమ్మోహన్ ఎక్స్‌క్యూజ్ చెబుతూన్నట్టుగా.

"ఏం ఫర్వాలేదండీ! అసలు నన్నడిగితే – స్కాచ్‌కు సోడాకంటె మంచినీళ్ళే బావుంటాయి. రియల్ టేస్ట్ తెలుస్తుంది."

"మీరన్నదీ నిజమే! రెగ్యులర్‌గా డ్రింక్ చేసేవాళ్ళు సోడాతో తీసుకోరు. గ్యాస్ట్రిక్ ట్రబుల్స్ వస్తాయట."

"అవునట. నేనూ విన్నాను."

"మీకు స్కాచ్ ఎక్కడ దొరుకుతుంది?"

"ఇక్కడే. నాకో ఫ్రెండ్ వున్నాడు. బిజినెస్ మాన్. పెద్ద కాంట్రాక్టరులే. వాడికి కబురు చేస్తే చాలు – ఎన్ని బాటిల్స్ కావాలంటె అన్ని పంపుతాడు. ఏ వెరైటీ కావాలన్నా దొరుకుతుంది. రాయల్ శాల్యూట్ దగ్గరనుంచీ వేట్ సిక్ట్సైన్ వరకూ దొరుకుతాయి.కాకపోతే బాంబేమార్కెట్‌మీద పదిరూపాయల ధర హెచ్చు. మీకేమైనా కావాలా?"

"ప్చ్! ఈమధ్య అలవాటు తప్పింది. అదీగాక నేను హాబిట్‌గా తాగేవాణ్నికాదు. ఎప్పుడైనా ఫ్రెండ్స్ కలిస్తేనూ, ఇస్తేనూ. ఇప్పుడా ఫ్రెండ్స్ సర్కిల్ లేదు. అలవాట్లూ లేవు."

మధ్యాహ్నం రెండున్నర గంటలకు శాంతి వచ్చింది. ఆ దుకాణం చూసింది. నిలువెల్లా మండిపోయింది. మొహం ఎర్రగా కందగడ్డలాగా అయింది. కోపోద్వేగంతో వొళ్లంతా వొణికిపోయి, కొన్ని క్షణాలపాటు నోరెండిపోయింది.

రాజారాం గాబరాపడ్డాడు. ఏమీ తోచక దిక్కులు చూశాడు.

రాంమ్మోహన్‌లో కూడా అశాంతి చెలరేగింది గానీ, బయటకు కనబడనివ్వలేదు. 'ఏదైతే అదే అవుతుందిలే!' అన్న నిర్లక్ష్యంతో ఉన్నాడు.

దెబ్బతిన్న ఆడపులిలా బుస్సున లేచింది శాంతి.

"మీకు బుద్ధీ, జ్ఞానాలు ఏమైనా ఉన్నాయా? మీరు చేసేదేమిటి? ఇంట్లోనే విస్కీ దుకాణం తెరిచారు. వీధి మనుషుల్లా విచ్చలవిడిగా తాగుతున్నారు. మంచీ, మర్యాదా తెలిసే ఇలా బరితెగిపోయారా? చేసేవి బీద కాపురాలు; వేసేవి రాజుల వేషాలు."

"ఫీ. నోర్ముయ్!" అన్నాడు రాంమ్మోహన్ కోపోద్దీపిత మనస్కుడై.



తెనాలి అరవింద సేవా సమితివారు అంతర్జాతీయ మహిళా సంవత్సరం వేడుకలలో భాగంగా "రమ్య కథా కవయిత్రి" అన్న బిరుదునిచ్చి ప్రముఖ రచయిత్రి డా. కె.వి. కృష్ణకుమారిని సన్మానించారు. చిత్రంలో యస్. యశోదారెడ్డి గారు రచయిత్రిని దుశ్శాలువతో సన్మానించడం చూడవచ్చు. ఈ సభలోనే రచయిత్రి కథల సంపుటిని కూడా శ్రీమతి సుగుణాశంకర్ ఆవిష్కరించారు.

"నేను నోరు మూస్తేమటుకు — లోకం నోరు మూసుకుంటుందా? పూటకు తిండికి గతిలేని కొంపకు, ఈ తాగుళ్లేమిటి, తందనాలేమిటని అనుకోరూ?"

"లోకం ఎలా అనుకుంటే నాకేం? తాగాలనుకున్నాను తాగుతున్నాను నువ్వు ఆట్టే రాద్ధాంతం చేయక, నీ పని చూసుకో! అంత అయిష్టంగా వుంటే, దగ్గరకు రాకు"

రాజారాం కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు శాంతి మొహం కేసి చూసే ధైర్యం అతనికి లేదు

"అది కాదండీ! నా బాధనూ, ఆవేదననూ మీరు అర్థం చేసుకోవటంలేదు."

"నా బాధనూ, ఆవేదననూ నువ్వు అర్థం చేసుకొంటే, అవతల పెద్దమనిషి ముందు నన్ను చీడపురుగును తీసిపారేసినట్టు తీసిపారేస్తావా? నేను శారీరకంగా కుంటివాడ్ని, అశక్తుణ్ణిగానీ — మానసికంగా కాదు నాలో ఇంకా చీమూ, నెత్తురూ చచ్చిపోలేదు నాకు హృదయమూ, మనస్సూ, స్పర్శజ్ఞానమూ ఉన్నాయి ఏది ఆనందమో, ఏది అవమానమో, ఏది అభిమానమో, ఏది వ్యథో, ఏది వేదనో గ్రహించే శక్తి ఇంకా నాలో చావలేదు శాంతీ!"

"నన్ను మీరు అపార్థం చేసుకుంటున్నారండీ!"

"సరిగ్గానే అర్థం చేసుకుంటున్నాను నువ్వే నా బ్రతుకు స్థితిని అవగాహన చేసుకోవటంలేదు నేను జీవచ్ఛవంలా బ్రతుకుతున్నానని నీకు తెలియదా? ఏదో కాస్త మనస్సుకు కులాసాగా వుంటుందనీ, బాధల్ని కొంతసేపు మర్చిపోదామనీ, నరకంలో రవ్వంత సేపైనా స్వర్గాన్ని చవిచూద్దామనీ ఈ డ్రింక్ తీసుకుంటూ వుంటే — పెద్దపులిలా మీద పడతావా? ఇంట్లో వున్న వస్తువులతోపాటు నేనూ ఒక వస్తువునే! బయటికి వెళ్లలేను. నా బ్రతుక్కి భగవంతుడు ఆజన్మాంతపు ఖైదు శిక్ష విధించాడు ఈ ఇల్లే నాకు జైలు ఈ జైల్లో యీపాటి స్వేచ్ఛకూడా నాకు లేదా?" అన్నాడు రాంమ్మోహన్ ఆవేశంతో రొప్పుతూ

శాంతిని ఆవరించిన కోపమంతా దిగిపోయింది.

"నే చెప్పేది కాస్త అర్థం చేసుకోండి మన ఆర్థిక పరిస్థితేమిటి? ఈ అలవాట్లేమిటి? ఇప్పటికే మీ సిగిరెట్లకింద ఎంతో డబ్బు హరించుకుపోతూంది ఈ విస్కీ కూడా అలవాటైందంటే, ఇంక మన పరిస్థితి ఎంత అధ్వాన్నమవుతుందనేదే నా భయం అందచేతనే కోపంతో ఏమేమో అన్నాను ఆర్థిక పరిమితుల ప్రకారం మనం నడుచుకోకపోతే— అడుక్కోనే గతి పడుతుందని నా భయం ఇప్పటికే ఇంట్లో ఒక్కొక్క వస్తువునే అమ్ముకొని తింటున్నాము"

"ఏం అమ్ముకుతింటే! మిగతా వస్తువులు కూడా అమ్మేయ్! మనుషులే శాశ్వతం కానప్పుడు వస్తువులు మాత్రం శాశ్వతమా? డబ్బు లున్నంత వరకూ బ్రతుకుతాం జీవితానికి వయస్సును కలపడమే మనం చేస్తున్నది అదెంతదూరం తీసుకెళితే అంతదూరం వెళతాం ఆపైన అగాధం వస్తే అందులో పడిపోదాం మన బ్రతుకుల్ని గురించి నాకున్న ఉద్దేశాలు ఇవే శాంతీ! మనిషి పుట్టడం ఎంత సత్యమో, చావడం అంత సత్యం. ఈ జనన మరణాల మధ్య విరామకాలమే మనిషి జీవితం ఆ విరామకాలం ఎంతో ఎవరు చెప్పగలరు? అనిశ్చితమైన ఆ విరామకాలాన్ని సంతోషంగా గడపాలనేదే నా ఆశయం ఆ ఆశయాన్ని నెరవేర్చుకోలేకపోయానంటే జీవితంలో ఓటమిని పొందానన్న మాటే!"

అక్కడ కూర్చోవడం రాజారాంకు ముళ్లమీద కూర్చున్నట్లే వుంది వెళ్ళిపోదామనుకున్నాడు "వెళ్ళొస్తానండీ!" అంటూ లేచాడు.

వెంటనే శాంతి అయిదువందల రూపాయలను ఆలేమరాలోంచి తీసి, రాజారాం చేతికిచ్చింది

"మీరు క్రితంసారి వచ్చినప్పుడు ఈ పైకం దిండుకింద పెట్టి మర్చిపోయారు తీసుకోండి" అంది శాంతి

"లేదు శాంతీ! మర్చిపోలేదు మీ అవసరాలకు అందుబాటులో వుంటుందని నేనే వుంచి వెళ్ళాను." అన్నాడు రాజారాం

"థ్యాంక్స్—అడగని ఈ ఆర్థికసహాయానికి"

"అంతా అయినవాళ్ళమేగదా! మీరు నన్ను నోరుతెరిచి అడగాలా? అర్థించాలా? ఇబ్బందుల్లో వున్నారని భావించి—"

"ఇబ్బందులు అందరికీ వుంటాయి రాజారావ్ అవి కాలాన్నిబట్టీ, కర్మాన్నిబట్టీ కలిగే ఇబ్బందులేగానీ — కలకాలం వుండేవికావు ఈ యిబ్బందులకే మతులు పోగొట్టుకొని, ఆయాచిత దానధర్మాలను పుచ్చుకొనేవరకూ దిగజారలేదు ఎన్ని ఇబ్బందులూ, ఇరకాటాలూ వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు పోగలం. నా బొందిలో ప్రాణమున్నంతవరకూ నా సంసారాన్ని నేను గుట్టుచక్కగా సాగించుకోగలను కాని నాదొక్క మనవి రాజారావ్ మేము విధి చేతిలో దెబ్బలుతిని గాయపడ్డాం. ఆ గాయంమీద ఉప్పూ, కారం చల్లొద్దని వేడుకుంటున్నా"

"శాంతీ! నువ్వు నన్ను పూర్తిగా అపార్థం చేసుకుంటున్నావు మీ గాయాన్ని మాన్పడానికి ప్రయత్నిస్తున్నాను మీకు ఏదోవిధంగా సహాయం చేసి, కష్టాలనుంచి గట్టెక్కించడానికే ఆదుర్దా పడుతున్నాను"

"రాజారావ్! నేనంత అమాయకురాల్ని అనుకోకు సిగిరెట్లు మానివేసిన ఆయనకు మళ్ళీ సిగిరెట్లు అలవాటు చేశావు ఈరోజు స్కాచ్ బాటిల్ తెచ్చి మర్చిపోయిన రుచుల్ని మళ్ళీ రేపెట్టావు ఇదంతా మామీద నిజమైన ప్రేమాభిమానాల కొద్దీ చేశావని నమ్మమంటావా?"

"ఇందులో నా దురుద్దేశం ఏమీలేదు శాంతీ! అనుక్షణమూ అవ్యక్తమైన మానసిక వ్యథతో కృంగిపోతూన్న ఆయనకు రిలీఫ్‌కోసం సిగిరెట్లుగానీ, విస్కీగానీ తాగమన్నానుగానీ — ఆయన్ను చెడగొట్టాలని కాదు అక్కడే నువ్వుపొరపాటుపడేది ఆ డబ్బు యివ్వడంలో కూడా నాకు వేరే ఉద్దేశమేమీ లేదు ఆర్థికంగా అవసరాలకు ఆదుకొంటే, తద్వారా తాత్కాలికంగా ఉపశమనం కలిగి, బ్రతుకుమీద ధైర్యం కలుగుతుందని దీనిని నువ్వు ఉచిత సహాయంగా భావించకపోతే, చేబదులుగా తీసుకో మీ దగ్గిర డబ్బు ఉన్నప్పుడు ఇవ్వొచ్చు పుచ్చుకొంటాను ఒక స్నేహితునితో కూడా మాట్లాడాను — నీ ఉద్యోగం విషయమై. తప్పకుండా చూద్దామన్నాడు"

"మీరు నాకేమీ చేబదుళ్లు ఇవ్వనక్కర్లేదు; ఉద్యోగాలూ ఇప్పించనక్కర్లేదు" అంది శాంతి పౌరుషంగా

అప్పుడు రాంమ్మోహన్ కలగజేసుకున్నాడు.

"అదేమిటి శాంతీ! మరీ అంత పెడసరంగా మాట్లాడతావు సహాయం చేస్తానంటూ వచ్చిన వ్యక్తి మొహం మీద కళ్లాపి నీళ్లు చల్లినట్టు మాట్లాడతావేం? ఇదేమైనా మర్యాదస్తుల లక్షణమేనా?"

"మీరైనా చెప్పండి, శాంతికి అభిమానం జాస్తి. ఆలోచన తక్కువ." అన్నాడు రాజారాం

"ఇందులో ఒహళ్లు నాకు చెప్పాల్సింది ఏమీ లేదు మనుషుల మనస్సుల్నీ, మనస్తత్వాల్నీ పెద్ద బాలశిక్ష చదివినట్టు చదివాను"

"మరీ అంత ఇదిగా మాట్లాడతావేం శాంతీ! మన పరిస్థితి బాగా లేనప్పుడు శ్రేయోభిలాషులు నలుగురూ ఓ చేయి వేస్తేనే పరిస్థితులు చక్కబడేది మన దుస్థితికి తోడు నలుగురితో విరోధాలు కూడా దేనికి?" అన్నాడు రాంమ్మోహన్

"నాకు విరోధం ఎవ్వరితోనూ లేదు ఎవ్వరితోనూ తెమ్చుకోబోవటంలేదు. కాని మనం సహాయం పొందేముందు మనకు ముందు ఆలోచన కూడా వుండాలి ఇచ్చినవాళ్ల దగ్గరల్లా సహాయాన్ని అందుకొంటే, ముందు ముందు కొన్ని చిక్కులు వస్తాయి అది కనిపెట్టి నడుచుకోవాలి కష్టాల్లో వున్నవాళ్లకు ఎవరు చేయి అందించినా అది అమృతహస్తంలాగానే కనబడుతుంది ఆ హస్తంలో నిజంగా అమృతమే వుందో, హాలాహలమే వుందో విచక్షణా జ్ఞానంతో తెల్సుకోవాలి"

శాంతి మాటల వెనుక వున్న వ్యంగ్యానికి రాజారాం తట్టుకోలేకపోయాడు అయిదువందల్నీ లాల్చీ జేబులో పెట్టుకొని, "వెళ్ళొస్తానండీ!" అని రాంమ్మోహన్‌తో చెప్పి వెళ్లిపోయాడు

ఏమీ తోచక సిగిరెట్టు నోట్లో పెట్టుకున్నాడు రాంమ్మోహన్ ఆ సిగిరెట్టును శాంతి వెలిగిస్తూంటే — "రాజారాం మంచివాడుకాదా?" అన్నాడు రాంమ్మోహన్

"ఒక వ్యక్తి మంచిచెడ్డలు మాటలవల్ల తెలియవు చేష్టలవల్లనే వ్యక్తమవుతాయి" అంది శాంతి ఆరిపోయిన అగ్గిపుల్లను పారవేస్తూ

(ఇంకా వుంది)

రాలిన ముత్యాలు

స్టెరిలైజ్ చేయని సిరెంజితో
ఇంజెక్షను చేయబూనిన డాక్టర్
రోగికి పరమ శత్రువు!

బూతులతో కవిత్వాన్ని నింపి
సాధిస్తున్నాం విప్లవ మనుకునే కవి
విప్లవానికే పరమ శత్రువు!

— శ్రీ సోమసుందర్





నవంబరులో ప్రారంభం అవుతుందని, నిర్మాత ప్రభాకర్ చెప్పారు

డాక్టర్ కొర్రపాటి గంగాధరరావుగారి నవలా ధారంగా నిర్మింపబడుతున్న ఈ చిత్రానికి పినిసెట్టి సంభాషణలకు, రాజేశ్వరరావు సంగీతానికి, బుల్ బులే ఛాయాగ్రహణానికి అధిపతులు

రామదాసుగా చలం నటిస్తున్న ఈ చిత్రంలో జగ్గయ్య, రావుగోపాలరావు, అల్లురామలింగయ్య, చంద్రమోహన్, ప్రభాకరరెడ్డి ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు

చిత్రానికి ఆయువుపట్టయిన నాయిక పాత్ర లను జయసుధ, రోజారమణి పోషించగలరని తెలిసింది ఈ చిత్రానికి బాబురావు దర్శకుడు

బలేబాబురావు

రామవిజేత సంస్థ అందించిన అన్ని చిత్రాలను

ఈకాలం దంపతులు"లో హేమా చవుదరి

విజయదశమినాడు ప్రారంభం

విజయదశమి పర్వదినాన నాలుగు ముహూర్తాలు జరిగాయి ఒకటి "భక్త కన్నప్ప" రికార్డింగ్, రెండు శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ "మంచి మారాజు" రికార్డింగ్, మూడు ఉదయలక్ష్మి పిక్చర్స్ ఆఫీసు ప్రారంభం నాలుగు ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌లో సాంగ్ కంపోజింగ్

భక్త కన్నప్ప !

నటుడు కృష్ణంరాజు సమర్పించు "భక్త కన్నప్ప" వర్ణ చిత్రానికి విఖ్యాత సంగీత దర్శకులు ఆదినారాయణరావు, సత్యంగార్ల అధ్వర్యంలో, వేటూరి సుందరరామమూర్తి విరచితమైన "భక్త శంకరా' అనెడి భక్తి గీతం ప్రసాద్ థియేటర్లో రికార్డింగ్ జరిగింది

"కన్నప్ప" చిత్రం షూటింగు నవంబరు అయిదు మంచి యిరవై వరకు బుట్టాయగూడెం, ఏలేశ్వరం, తాడేరు పరిసర ప్రాంతాలలో జరుగుతుందని, నిర్మాత సూర్యనారాయణరాజు చెప్పారు

మొదటి షెడ్యూల్‌లో పాల్గొనేది ఎవరని ప్రశ్నించాను

కన్నప్ప పాత్రధారి కృష్ణంరాజు, కథానాయిక వాణిశ్రీ, పూజారి పాత్రధారి రావుగోపాలరావు, గూడెం దొర పాత్రధారి ప్రభాకరరెడ్డిగార్లతో బాటు రాజబాబు, గిరిజారాణి, జయమాలిని పాల్గొంటారని, కో - డైరెక్టర్ భీమేశ్వరరావు చెప్పారు

ప్రముఖ దర్శకుడు బాపుగారిచేత "భక్త కన్నప్ప" వర్ణ చిత్రం కమనీయ చిత్రకావ్యంగా రూపం అందుకునేందుకు సత్యానంద్ రచన, స్వామి ఛాయాగ్రహణం, వాలి కళాహృదయం, ఆదినారాయణరావు - సత్యంగార్ల సంగీతం సమర్ధవంతంగా సహకరిస్తాయి

కృష్ణంరాజు నట జీవితంలో "కన్నప్ప" పాత్ర మైలురాయిగా నిలిచిపోగలదు "కన్నప్ప" పాత్రపోషణపట్ల కృష్ణంరాజు ప్రత్యేక శ్రద్ధను తీసుకొంటున్నారు

అన్ని హంగులు వున్న యీ భక్తి చిత్రానికి ప్రేక్షకుల అనురక్తి, ఆసక్తి అవశ్యం లభించగలదు లక్ష్మి విడుదల

లంబాడోళ్ళ రామదాసు

రామవిజేత ఎలింన్ కలర్‌లో తలపెట్టిన "లంబాడోళ్ళ రామదాసు" చిత్రం షూటింగు

జనరంజకంగా రూపొందించిన బాబురావు "తులసి" చిత్రం ద్వారా ఆర్థిక నష్టాన్ని పొందడానికి, మిస్ కాస్టింగ్ ముఖ్య కారణమని చెపితే అబద్ధంకాదు

షూటింగుకు వెళ్ళేముందు, పూర్తి స్క్రిప్టు చేతముంటేనే, అంకురార్పణచేసే మనస్తత్వం గొప్ప బాబురావు, తను తీసే చిత్రం నిడివి యింతే వుండాలి అని కూడా ఆరంభంలోనే నిర్ణయించగల సమర్ధతను బడసియున్నాడు "లంబాడోళ్ల రామదాసు" చిత్రాన్ని హిట్ చేసే ప్రయత్నంలో సఫలుడయ్యేది తథ్యము అనిపించేవిధంగా "స్క్రిప్టు" సిద్ధపడింది

లైలా - మజ్ను !

"నటసామ్రాట్" నాగేశ్వరరావుగారికి రొమాంటిక్ హీరో బిరుదాన్ని తెచ్చిపెట్టిన "మజ్ను" పాత్రను మరింత విపులీకరించి, వర్ణ చిత్రంగా నిర్మించడానికి రామవిజేత సోదరులు నిర్ణయించారు

"మజ్ను" పాత్రను వెయ్యదగిన అర్హత, వేసి ప్రేక్షకులను మెప్పించగలిగిన యోగ్యత వున్న నాయకాగ్రేసరుడు ఎవరో చెప్పకోండి

నటీనటుల ద్విపాత్రాభినయం

రాబోయే తెలుగు చిత్రాలలో ద్విపాత్రాభినయం ఎవరు ఏఏ చిత్రాలలో చేస్తున్నారో పాఠకులకు తెలియాలిగా

శివాజీకి రెండు పాత్రలు

శివాజీగణేశన్ తండ్రిగా, కొడుకుగా రెండు పాత్రలను పోషించిన "దొంగల్లో మొనగాడు" వర్ణ చిత్రాన్ని గుండు సత్యనారాయణమూర్తి నిర్మించారు పోలీస్ అధికారిగా, చట్టాన్ని అతిక్రమించిన దొంగగా శివాజీ అద్వితీయంగా నటించారు గ్లామర్ గరల్ మంజుల శృంగార రసానికి ప్రాతినిధ్యం వహించ, కన్నీరు కార్పించే దృశ్యాలకు రోజారమణి ఆధిపత్యం వహించింది

ఈ చిత్రానికి "కళావాచస్పతి" జగ్గయ్యగారి కంచు కంఠం యస్సెట్ రాజశ్రీ రచన్ను, సత్యం సంగీతాన్ని నిర్వహించారు



"వింతయిల్లు సంతగోల"లో ప్రభ

గుమ్మళ్ల లక్ష్మణరావు సమర్పించు జయ రాజు కంబైన్స్‌వారి "దొంగల్లో మొనగాడు" చిత్రానికి హిందీ "టీ-మాన్" ఆధారం

కృష్ణంరాజు ద్విపాత్రాభినయం

నళినిశ్రీ కంబైన్స్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో "రెబల్‌స్టార్" వైవిధ్యం వున్న రెండు పాత్రలను పోషిస్తున్నారు ఈ చిత్రం షూటింగు అక్టోబరు 16న ప్రారంభమైంది బి ఎస్ ఆర్ దర్శకత్వంలో తయారవుతున్న యీ చిత్రానికి గాజేశ్వరరావు సంగీతాన్ని, విజయరత్నం రచన్ను, దేవరాజ్ ఛాయను నిర్వహిస్తున్నారు చిత్రంలోని ముఖ్య పాత్రలను రావు గోపాలరావు, మురళీమోహన్, పద్మప్రియ, శ్యామల పోషిస్తున్నారు

రామకృష్ణ పాత్రల వైవిధ్యం

రాజలక్ష్మి చిత్రవారి "ఆస్తికోసం" చిత్రంలో రామకృష్ణ తండ్రిగా, కొడుకుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు ప్రమీల నాయిక పృథ్వీరాజ్, దాసరి సత్యనారాయణమూర్తి నిర్మిస్తున్న యీ చిత్రానికి గిడుతూరి సూర్యం దర్శకుడు

హీ మాన్ ద్విపాత్రాభినయం

అందాల నటుడు శోభన్‌బాబును ఆయన యింట కలిసినప్పుడు, ప్రస్తుతం తను అంగీకరించిన చిత్రాలలో "డ్యూయెల్" రోల్ చిత్రం వున్నదా అని ప్రశ్నించాను

విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ రంగుల్లో నిర్మిస్తున్న చిత్రంలో తనది ద్విపాత్రాభినయం అని చెప్పారు, రెండు పాత్రలకు గల వైవిధ్యాన్ని, వైశిష్ట్యాన్ని విశేషంగా పేర్కొన్నారు

"ఖయిదీ బాబాయ్" ఫేమ్ టి కృష్ణ దర్శకత్వంలో తయారవుతున్న హీ-మాన్ చిత్రానికి మహదేవన్, జి కె రాము, సత్యానంద్, కుదరవల్లి సాంకేతిక శాఖలను నిర్వహిస్తున్నారు

మంజుల, జయసుధ కథానాయిక పాత్రలను పోషిస్తున్న చిత్రాన్ని టి త్రివిక్రమరావు నిర్మిస్తున్నారు

నటరత్న ద్విపాత్రాభినయం

ఆదిత్య చిత్రవారి "మనుషులంతా ఒక్కటే" వర్ణ చిత్రంలో 'నటరత్న" తండ్రిగా, తనయుడుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు

గడుసరి దాసరి వువాచ ఏమిటన "నటరత్న రామారావుగారు తండ్రిని మించిన తనయుడుగా రెండు పాత్రలను పోటీపడి నటించారు "

కళాదర్శకుడు రాజేంద్రకుమార్ సమర్పించు 'మనుషులంతా ఒక్కటే" చిత్రానికి రాజేశ్వరరావు, కన్నప్ప, బాలు ముఖ్య సాంకేతిక సారథులు

"కళా భారతి" జమున, గ్లామర్ గరల్ మంజుల కథానాయిక పాత్రలను పోషించ, సత్యనారాయణ, నాగేష్, అల్లు రామలింగయ్య, రమాప్రభ, ధూళిపాళ, పండరీబాయి సహాయ భూమికలను ధరిస్తున్నారు.

అగ్రనటి అద్వితీయం

సుందరం మూవీస్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న "దొరలు-దొంగలు" చిత్రంలో అగ్ర నటి రాణిగా, రంగిగా ద్విపాత్రాభినయం చేస్తున్న నిజం పాఠకులకు తెలుసు

ఈమధ్య ఆ చిత్రంయొక్క ఏడురీళ్ల రష్ చూడడం జరిగింది అగ్రనటి పాత్రపోషణ ఆద్యంతం అద్వితీయంగా వుంది రాణిగా రాజసాన్ని, రంగిగా పేదరికాన్ని వాణిశ్రీ, ఎంచక్కగా ప్రదర్శించిందో !

"మల్లెమాల" మాటలు, పాటలు రాసిన "దొరలు - దొంగలు" చిత్రానికి సత్యం, కె ఎస్. ప్రసాద్, ఏ కె శేఖర్ ముఖ్య సాంకేతిక శాఖలకు ఆధిపత్యం వహిస్తున్నారు

రామకృష్ణ కథానాయకుడుగా నటించ, రంగనాథ్, చంద్రమోహన్, రాజనాల, సుదర్శనమ్ మంజుభార్గవి, గిరిజారాణి, ఎస్వరలక్ష్మి, శ్రీధర్ సహాయ పాత్రలను పోషిస్తున్నారు కె ఎస్ ఆర్. దాస్‌కు యీ చిత్రం కొత్తమలుపును తెచ్చిపెట్ట గలదు

సెహబాష్ జయసుధ !

"జానపద బ్రహ్మ" విఠలాచార్యగారి వినూత్న సృష్టి "కోటలోపాగా" చిత్రం జయసుధ మార్కెట్టును మరింత పెంచగలదు ఈ నిజాన్ని పిక్చర్ చూచిన ప్రతివొక్కరూ ఒప్పుకొంటారు

"పిట్టకొంచెము - కూతఘనము" అంటారే, అది నిజము నిజము అని జయసుధ తన ద్విపాత్రాభినయం ద్వారా నిరూపించింది

రామకృష్ణ నాయకుడుగా నటించిన "కోటలో పాగా' చిత్రానికి రాఘవులు, వేణు, నాగరాజన్ ముఖ్య సాంకేతిక సారథులు

ఈ చిత్రం ఒక దిట్టమైన దుష్టనటుడ్ని తెలుగుతెరకు యిచ్చింది అతడి పేరు సుదర్శనమ్ అలాగే వాంప్‌గా సత్యప్రియ "తగుదునమ్మా" అనిపిస్తుంది

ప్రభకు శోభ !

"నీడలేని ఆడది" చిత్రంలో ప్రభ అద్భుతంగా నటించిన నిజాన్ని ఎవరూ విస్మరించలేరు ఆమె వాణిశ్రీ అంతటి నటి అవుతుందని ఆశ పెట్టుకున్నవాళ్లు కూడా వున్నారు

ప్రభను గూర్చి చెప్పాలంటె "సమర్థురాలు" అనొచ్చు ఆమె డైలాగ్ డెలివరీ నిజంగా చాలా బాగుంటుంది ఆమెకు అంతస్తును తెచ్చిపెట్టే పాత్రలను దర్శకుడు బి వి ప్రసాద్ 'రాము - సోము" చిత్రంలో కల్పించారు

ప్రభ ద్విపాత్రాభినయం భేషుగ్గా వుందంటున్నారు, "రాము - సోము" రషస్‌ను చూచిన వ్యక్తులు

"రాము - సోము" చిత్రంలో రంగనాథ్, గిరిబాబుగార్లతోబాటు దర్శకుడు బి వి ప్రసాద్ కూడా ఒక ముఖ్య పాత్రను పోషిస్తున్నారు

'కోటలో పాగా"లో ఒక దృశ్యం





కె సంధ్యారాణి (తృతీయ), మాలతీరావు (ద్వితీయ), ఛాయ (ప్రథమ)

విజయవాడ ఇన్నర్‌వీల్ క్లబ్ అందాలరాణి పోటీ...

అంతర్జాతీయ మహిళా సంవత్సరం కనుక విజయవాడ ఇన్నర్ వీల్ క్లబ్ సమధికోత్సాహంతో అక్టోబర్ 19 న ఒకే ఉదయం 'అందాల రాణి పోటీ', ''వస్త్రధారణ ప్రదర్శన'', 'భారతీయ సంప్రదాయపు వధువుల వేషధారణ' అనే కార్యక్రమాలను గోల్డ్‌స్పాట్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసి స్త్రీ సంక్షేమ కార్యక్రమాల కోసం విరాళాలు వసూలు చేశారు

అందాల రాణి పోటీకి వివాహితులు, అవివాహితులు అర్హులే – రామచంద్రపురం, గుంటూరు, బెంగుళూరుల నుంచి ఒక్కొక్కరు విజయవాడ నుంచి 19 మంది పాల్గొన్న యీ అవయవ సౌష్ఠవ పోటీలో సినిమా నటి సంధ్యారాణి చెల్లెలు కుమారి ఛాయ మొదటి బహుమతి అందుకుంది కుమారి వాణిశ్రీ యీమెకు 'విజయవాడ అందాల రాణి 1975' కిరీటాన్ని ధరింపజేసింది ఈమె లక్కీ నెంబర్ 12 ద్వితీయ స్థానంలో మాలతీరావు తృతీయ స్థానంలో కుమారి కె సంధ్యారాణి (యీమె అన్‌లక్కీ నెంబర్ 8) వచ్చారు శ్రీ కె విశ్వనాథ్ ప్రధాన న్యాయమూర్తి

ఈ మూడు ప్రదర్శనలను యిన్నర్ వీల్ క్లబ్ నాయకురాండ్రయిన శ్రీమతులు బంధ్యాం కామేశ్వరి, టి రాధ, మైత్రి, జయశ్రీ నిర్వహించారు – పోటీలో పాల్గొన్న సుందరీమణుల సౌష్ఠవ ప్రమాణాలు, వయస్సులు, అభిరుచులు, విద్యా విశేషాలు మున్నగునవి కూడా చిన్న చిన్న కలం చిత్రాల లాగా కనీసం వారు పత్రికలవారికైనా అందజేసి వుంటె బాగుండేది – ''ఈ కార్యక్రమాలను ఆడవాళ్లే ఏర్పాటు చేశారు కనుక యింత అందంగా వున్నాయి – ఏమైనా లోపాలుంటే అది వారి వెనుక వుండి సలహాలిచ్చిన పురుషులవే తప్ప వీరివి కావు'' అంటూ ఒక పురప్రముఖు డన్నారు ఇన్నర్ వీల్ క్లబ్ సావనీర్‌ను నేపథ్య గాయని సుశీల ఆవిష్కరించారు ఏది ఎలా వున్నా విజయవాడలో అంతర్జాతీయ మహిళా సంవత్సరపు వాసనలీవిధంగా గుబాళించిన ఇన్నర్ వీల్ క్లబ్ సమిష్టి కృషికి జేజేలు అందాలి

— [పి]

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ !

ప్రేక్షకుల ఆదరణకు పాత్రమైన సంస్థల్లో పి ఎ పి ఒకటి ఈ సంస్థ యిప్పటికి 13 చిత్రాలను నిర్మించింది ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి పధ్నాలగవ చిత్రానికి విజయదశమినాడు వారి ఆఫీసులో మ్యూజిక్ కంపోజింగ్ ప్రారంభమైంది

సంగీత దర్శకుడు తాతినేని చలపతిరావు, దర్శకుడు ప్రత్యగాత్మ ఒక విచిత్రమైన వార్తను చెప్పారు ఆచార్య ఆత్రేయ అరగంటలో పాట రాసి యివ్వడమే ఆ విచిత్ర సంఘటన

హైద్రాబాద్‌లో షూటింగును పెట్టాము, అన్నారు నిర్మాత సుబ్బారావుగారు చిత్రంలోని ప్రధాన పాత్రలను రామకృష్ణ, జయసుధ, నాగభూషణం, అల్లురామలింగయ్య, రాజబాబు, ప్రభ పోషిస్తున్నట్టు చెప్పారు

ప్రత్యగాత్మ దర్శకత్వానికి, భమిడిపాటి రచనకు, సెల్వరాజ్ ఛాయకు, జి వి సుబ్బారావు కళకు, కృష్ణస్వామి కూర్పుకు, మోహన్‌గాంధీ సహకార దర్శకత్వానికిఅధినేతలు నవయుగ విడుదల

సినిమా

మంచిమారాజు

శ్రీలక్ష్మి ప్రొడక్షన్స్ వారి ''మంచిమారాజు'' వర్ణ చిత్రం తాలూకు మొదటి పాట రికార్డింగ్ విజయదశమినాడు, విజయా గార్డెన్‌లో జరిగింది

ఆచార్య ఆత్రేయ రాసిన ''రాజా వెడలె రభసకు'' అనెడి పాటను, మహదేవన్ సారథ్యంలో ఎస్ పి బాలసుబ్రమణ్యం పాడారు

నవంబరు పదినుంచి షూటింగు అన్నారు, నిర్మాత పూర్ణచంద్రరావుగారు ప్రధాన పాత్రలను శోభన్, జయసుధ, జయప్రద, రాజబాబు, సత్యనారాయణ పోషిస్తున్న ''మంచిమారాజు'' చిత్రానికి సత్యానంద్, మహదేవన్, కన్నప్ప, జి వి సుబ్బారావు,బాలు మంచిరిజల్ట్ కోసం శ్రమించగలరు

నేపాల్ దగ్గర అవుట్‌డోర్ షూటింగును జరపాలన్న అభిప్రాయం, దర్శకుడు తాతినేని రామారావుగారికి వుంది

తాతినేని రామారావు దర్శకత్వంలో ''మంచి మారాజు'' వర్ణ చిత్రం అందరినీ ఆకర్షించగలదు లక్ష్మి విడుదల

ఉదయలక్ష్మి పిక్చర్స్

మదరాసు బజుల్లా రోడ్డులో వెలసిన కొత్త సంస్థ ఉదయలక్ష్మి పిక్చర్స్ ఈ సంస్థలో విజయదశమినాడు దర్శకుడు బాపయ్య, రచయిత మోదుకూరి జాన్సన్, సంగీత దర్శకుడు మహదేవన్,ఛాయాగ్రాహకుడు భాస్కరరావు కనిపించారు

జనవరి నుంచి షూటింగు ప్రారంభం అయ్యేందుకు నిర్మాతలు తాండ్ర సుబ్బానాయుడు, నన్నపనేని మోహన్‌దాస్, నిర్వాహకుడు నన్నపనేని సుధాకర్ నిర్ణయించారు

''ఊర్వశి'' గ్రహీత శారద కథానాయికగా నటిస్తున్న యీ వర్ణ చిత్రంలో ఒక పాపులర్ హీరో నటించే అవకాశం లేకపోలేదు

''దొరలూ–దొంగలూ''లో వాణిశ్రీ, రంగనాథ్





"దేవుడు లాంటి మనిషి"లో నా భూ, రా బా

ఆంధ్రప్రదేశ్‌లో పాడిపంటలు

హీరో కృష్ణ నాయకత్వంలో, పద్మాలయా ఆర్ట్ పిక్చర్స్ ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మిస్తున్న "పాడిపంటలు" చిత్రం ఏకధాటిగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలలో షూటింగు పూర్తిచేసుకుంటూంది

కృష్ణ కథానాయకుడుగా, నాగభూషణం, జగ్గయ్య, గుమ్మడి, ప్రభాకరరెడ్డి, కాంతారావు, అల్లురామలింగయ్య, చంద్రమోహన్, మాడా, విజయనిర్మల, లత, అంజలీదేవి, కృష్ణకుమారి, జయమాలిని, రమాప్రభ, నిర్మల, సూర్యకాంతం, ఛాయాదేవి ముఖ్య భూమికల నిర్వాహకులుగా తయారవుతున్న నవరసభరితమైన "పాడిపంటలు" వర్ణ చిత్రం ప్రేక్షకలోకాన్ని పరవశింపచెయ్యగల అర్హతను బడసియున్నది

సాంకేతిక శాఖలను నిర్వహిస్తున్న మహారథి, మహదేవన్, వి ఎస్ ఆర్ స్వామి, కోటగిరి గోపాలరావు, వెంకన్నబాబుగార్లు విశేషానుభవం గడించిన విప్లుతులు

హీరో కృష్ణ నటిస్తున్న ఈ వర్ణ చిత్రానికి పి చంద్రశేఖరరెడ్డి దర్శకుడు నాయక, దర్శకులకు పేరు, నిర్మాత ఆదిశేషగిరిరావుగారికి ధనము నార్జించే శక్తి "పాడిపంటలు"కు వుంది తారక రామ విడుదల

పద్మజాలో కృష్ణ !

"నటసామ్రాట్"తో "మనసు–మాంగల్యం" "నటరత్న"తో "దీక్ష" చిత్రాలను నిర్మించిన పద్మజా మూవీస్ అధినేత కోగంటి కుటుంబరావు యిూతూరి కృష్ణతో తలపెట్టిన వర్ణ చిత్రం షూటింగు జనవరిలో ప్రారంభమై, ఫిబ్రవరి చివరన పూర్తయ్యేవిధంగా షెడ్యూల్సు వేసుకొన్న వార్తను తెలుసుకొన్నాను

లోగడ ఒకసారి న్యూస్ రాసినప్పుడు, కుటుంబరావుగారి చిత్రానికి కె ఎస్ ఆర్ దర్శకుడు అని తెలిపాను కాల్‌షీట్లు 'క్లాష్' అయిన కారణంగా, దాస్‌గారి స్థానంలో పి ఎస్ రావ్‌గారిని పెట్టడం జరిగింది

భమిడిపాటి కథ, మాటలను రాసిన పద్మజా మూవీస్‌కు కె వి మహదేవన్ సంగీతాన్ని, ప్రకాష్ ఛాయాగ్రహణాన్ని నిర్వహిస్తారు

కృష్ణ జతగా లత నటిస్తున్నది సహాయ పాత్రలను ప్రతిభావంతులే పోషించగలరు

నమ్మిన నటుడు !

పరిశ్రమలో ఎందరికో సహాయంచేసి, తన మానవతా ధర్మాన్ని ప్రదర్శించిన హీరో కృష్ణ పట్ల కృతజ్ఞతాభావం వున్న వ్యక్తులు ఒకరిద్దరే వున్నారు

"నిర్మాత బాగుండాలి నిర్మాత వచ్చిన లాభం చూసి ఆనందించాలి" అనెడి ధర్మబద్ధమైన మాత్రాన్ని అవలంబించి, తనకు డబ్బిచ్చిన, ఇవ్వకపోయిన రాత్రింబవళ్లు శ్రమించిన కృష్ణగారిని ఎందరు ఆశీర్వదిస్తున్నారు ?

ఎవరి దీవెనలు వున్నా, లేకున్నా ఆంధ్ర ప్రేక్షకుల ప్రేమాభిమానాలు కృష్ణగారికి ఉన్నాయి వారి ఆశీస్సులు కృష్ణను చల్లగా దీవిస్తాయి

నిజం ఎరిగిన కృష్ణ సముచితమైన నిర్ణయాన్ని తీసుకున్నారు అదేమిటన "తక్కువ చిత్రాల్లో నటించడం కలర్ చిత్రాలను మాత్రమే అంగీకరించడం పాత్రనెరిగి ఒప్పుకోవడం "

రాబోయే సంక్రాంతి నుండి కృష్ణకు రాజయోగం తథ్యము

జగ్గయ్య పెద్దన్నయ్య

గా నటిస్తున్న చిత్రాన్ని పాంచజన్య ప్రొడక్షన్స్ ప్రారంభించి, వరుసగా పదిరోజులు షూటింగు జరిపిన ప్రతిఫలంగా అయిదురీళ్లు తయారైంది, అన్నారు దర్శకుడు పి డి ప్రసాద్

"జీవితరంగం, ఇల్లు – వాకిలి" చిత్రాల దర్శకుడు, ప్రత్యగాత్మగారి శిష్యుడు అగు పి డి ప్రసాద్ సమర్థుడు అని నిరూపించుకునే అవకాశం "పెద్దన్నయ్య" చిత్రం కలగచేస్తుంది

ప్రతి యింట్లో జరిగే సంఘటనలు, తారసపడే పాత్రలు "పెద్దన్నయ్య" చిత్రంలోని ముఖ్య అంశం గాబట్టి, అందరూ చూడదగిన కుటుంబ చిత్రంగా రూపం అందుకుంటుంది

"పెద్దన్నయ్య" చిత్రంలో జగ్గయ్య, రాజబాబు, రావుగోపాలరావు, ప్రభాకరరెడ్డి, చంద్రమోహన్, రంగనాథ్, ప్రభ, సంగీత, శాంతాదేవి ప్రముఖ పాత్రలను పోషిస్తున్నారు

రచనకు నంది, ఛాయకు సుకదేవ్, కళకు కళాకార్, సంగీతానికి సత్యం అధిపతులు ఈ చిత్రానికి టి అప్పదాస్, చాంద్‌బాషా, మహేష్ నిర్మాతలు

"పెద్దన్నయ్య" చిత్రాన్ని ఓ బుల్లోడు ప్రారంభించాడు ఆ చిరంజీవి పేరు కోదండపాణి

— శ్రీనివాస

"పెద్ద మనిషి"లో ఒక సన్నివేశం



సుపుత్రుడు

వడ్డమన్నాటి లక్ష్మీప్రసన్న



"ఒరే! అబ్బాయ్! పేరంటాని కవరింటికన్నా వెళ్ళినపుడు చాలా చిన్నతనంగా వుంటోందిరా! అయిదారు నవర్సులులో ఓ రెండు బంగారపు గొలుసులు! ఓ రెండు మూడయినా పట్టుచీరలు విలువేసు కొని కొనిపెట్టురా!"

"ఎంతవుతుందమ్మా మొత్తం?"

"పెద్దగా ఏమీ అవదు నాన్నా! అంతాకలిపి ఓ నాలుగయిదు వేలు అవుతుంది అంతే!"

"అంత మొత్తమా? అమ్మా! నాకేమీ పనీ పాటా లేదనుకున్నావా? నువ్వడిగినవల్లా కొనివ్వటం తప్ప! గొలుసుల్లేవు – గిలుసుల్లేవు! మాట్లాడకుండా కూర్చో!" కొడుకు ధర్మ కుమార్ గొంతులోని కాఠిన్యం విని మొదట నిర్ఘాంతపోయి తరవాత "వట్టి పిసినారి వెధవ! తల్లి నోరు తెరచి అడిగితే అలా చస్తాడేం!" అని మనసులోనే అసహ్యించుకొంది అనసూయమ్మ గారు

* * *

భర్త వైఖరికి ఆశ్చర్యపోయింది – హాలు పక్క గదిలో కుర్చీలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్న సుశీల. భర్త–అత్తగారినిలా మాట్లాడటం ఇదివర కెన్నడూ వినలేదామె

* * *

"అరేయ్! ధర్మా! పెళ్లి సంబంధాల విష యంలో పలుగురు పెద్దమనుషులు వచ్చేపోయే కొంప కద్రటా మనది! మోడ్రన్ ఆర్టికల్స్ లేకపోతే అంతా నవ్వుతారు గాడ్రెజ్ చెయిర్స్ ఒక డజను.! టీపాయ్‌లు నాలుగు! ఫ్రేము కుర్చీలు అర డజను..! సన్‌గ్లాసు డైనింగ్ టేబులు.. ఫాను రేడియో.! సోఫాసెట్! యివన్నీ కొంటేగానీ మనింటికి కళ రాదురా! పద బజా రెళ్ళి కొనుక్కొద్దాం"

"నాన్నగారూ! యింట్లో తిని కూర్చోక ఏమిటీ పథకాలు ప్రణాళికలూను?"

"ఏమిట్రా నీ గదమాయింపు? నాదగ్గర తీసుకున్న పదివేలు ఉందిగదా! నీదగ్గర! అదిలా పారెయ్యి! నీకంత కష్టంగావుంటే నేనే బజార్కు వెళ్లి కొనుక్కొస్తాను"

"మీదగ్గర నేను డబ్బు తీసుకున్నానా? పదివేలా? అహ్హహ్హా!"

"ఒరే! ఒరేయ్! ఎంతమోసం! కన్న కొడుకువి యింత దారుణాని కొడిగడతావా? ఆఫీసులో ఏదో కొంపమీదకొచ్చింది తరువాతిస్తా నని నేను రిటైరయిన తరువాత నాకు గవర్న మెంటిచ్చిన జి పి ఎఫ్ – గ్రాట్యుటీ తాలూకు పదివేలు తీసుకోలేదూ?"

"మీ డబ్బు తీసుకునే ఖర్మ నాకేంపట్టింది? అనవసరంగా అబద్ధాలాడకండి!"

"ఛీ! దుష్టుడా!" వెంకట్రామయ్యగారు చేతుల్తో తలపట్టుక్కూర్చొన్నారు

"ఒరే! అబ్బాయ్! యిది చాలా అన్యాయం! మా ఉసురు తగలకపోదు నీకు ముసలితనంలో కొడుకు తలిదండ్రులకు కలిగించవలసింది సంతో షంరా! సంతాపంకాదు!" దాదాపు ఏడ్చేసింది అనసూయమ్మగారు

"ఏమిటమ్మా! అలావున్నారు?" అంటూ అప్పుడే స్నేహితురాలు కమల యింటినుండి తిరిగి వచ్చిన కూతురు రాగిణిని అక్కున జేర్చుకొని "ఇక నీకు పెళ్లయ్యే దిక్కులేదు తల్లీ! నాన్నగారి దగ్గర తీసుకున్న పదివేల మాట వేనెరగనంటున్నాడే మీ అన్నయ్య!" అంటూ వాపోయింది అనసూయమ్మగారు

"పోన్లే! అమ్మా! ఆ డబ్బుతో అన్నయ్యనే ఉట్టి గట్టుకుని ఊరేగమను." అన్నయ్య వైపు ఏహ్యభావంతో చూస్తూ ఉక్రోషంగా అంది రాగిణి.

ఇక ఊరుకోలేకపోయింది సుశీల. భర్త వైఖరి కతనిమీద అసహ్యం ద్వేషం పుట్టుకొచ్చాయామెలో ఆవేశం పట్టలేకపోయింది. విసురుగా పుస్తకాన్ని నేలమీద కొట్టి హాలులో కొచ్చింది

"ఏమండీ! మీకేమన్నా మతి పోయిందా?" అప్రయత్నంగా అనేసింది.

"నోర్మూయ్! నాకే ఎదురు చెపుతు ధర్మకుమార్ కళ్ళల్లో నిప్పులు కురిపించాడు

"మూస్తాను! కాని ముందు వాళ్ళ డబ్బు వాళ్ళ కిచ్చేస్తాననండి! తల్లిదండ్రులను వృద్ధాప్యంలో

గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14లో భాస్వరామ్లము ఎందుచేత హెచ్చు పాళ్లలో వుందో తెలుసా?

మీరు పండించే వరి, వేరుశెనగ, పప్పుదినుసులు మరియు యితర పైరులు ఆరోగ్యవంతంగా పెరిగి అధిక దిగుబడినిచ్చేందుకు!




వేరుశెనగ, పప్పు దినుసులు, కూరగాయల పైరులు భాస్వరామ్లమును ఎక్కువ మోతాదులో తీసుకుంటాయి. శ్రేష్ఠమైన గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14 భాస్వరామ్లమును హెచ్చు పాళ్లలో కలిగివుంది. ఇందులోని భాస్వరామ్లము అంతా నీటిలో కరుగుతుంది కనుక మీరు పండించే ఈ పైర్లు ఎక్కువగా కావలసిన భాస్వరామ్లమును సులభంగా గ్రహిస్తాయి మరి, వరి తదితర పైర్లకు గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14 దమ్ములోగాని ఆఖరి దుక్కిలోగాని వాడుటకు శ్రేష్ఠమైన ఎరువు

గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14 భాస్వరామ్లమును ఎక్కువ పాళ్లలో కలిగి వుండటం చేత, భాస్వరామ్లము లోపించిన నేలలలో లేక నత్రజని ఎక్కువ పాళ్లలో వున్న ప్రాంతాల్లో. వరి పైరుకు దమ్ములో వాడేందుకు చాల అనువైనది

గ్రోమోర్ ఎన్-పి-కె 14-35-14లో పొటాషియం కూడ ఉంది.








మామూలు రసాయన ఎరువులు వాడితే ఏమి జరుగుతుందో చూడండి

నీటిలోని నత్రజనిలో కొంత భాగం మురుగు నీటిలో కొట్టుకొని పోయి వృథా అవుతుంది భాస్వరామ్లము, నీటిలో కరిగే స్వభావము తక్కువై, పైరుకు తగినంత లభించదు కనుక మీ పైర్లకు పూర్తి పోషణ అందక దిగుబడులు తగ్గుతాయి

గ్రోమోర్ ఎరువులు వేసినపుడు ఫలితం చూడండి:

గ్రోమోర్ లోని నత్రజని అమోనియా రూపంలో లభిస్తుంది కాబట్టి, భూమిలో నిల్వయుండి, పైరు పెరుగుతున్నంత కాలం లభిస్తుంది భాస్వరామ్లము పూర్తిగా నీటిలో కరుగుతుంది కాబట్టి పైరుకు కావలసిన విధంగా సకాలంలో లభిస్తుంది దీనివలన పైరుకు పూర్తి పోషణ కల్గుతుంది



వ్యవసాయ విషయములలో ఉచిత సలహాలకు మట్టి పరీక్ష వివరాలకు యీ క్రింది చిరునామాకు వ్రాసి తెలుసుకోండి:

చేనుకు చేవ,
రైతుకు రొక్కం —
గ్రోమోర్

కోరమాండల్ ఫెర్టిలైజర్స్.
లిమిటెడ్
28 సరోజినిదేవి రోడ్,
సికింద్రాబాద్ 500 003

CF. 428 TL

పోషించవలసిన బాధ్యత పెళ్లీడుకొచ్చిన చెల్లెలుకు మంచి సంబంధం చూసి పెళ్లి జరిపించవలసిన బాధ్యత మీకుంది... వాటిని విస్మరించి వారిని శోకంపాలు చేయననండి!''

''ఆట్టే పేలకు! ఈ ధర్మపన్నాలు నాకు తెలుసు! కుండ బద్దలుకొట్టి చెపుతున్నాను అందరు చెవులు రిక్కించి వినండి నేను తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వను! నా చెల్లెలి పెళ్లి చెయ్యను! తల్లిదండ్రులు అడిగిన వస్తువులు కొనివ్వను! భార్య మాట వినను! మీ చేతనైంది చేసుకోండి! హహ్హహ్హ!'' సినిమాలో విలన్‌లా అరుస్తూ బయటి కెళ్లిపోయాడు ధర్మకుమార్

''ఛీ! దుష్టుడు! దుర్మార్గుడు!'' అందరూ మనసులో అనుకొన్న మాటలవే

*　　*　　*

నెల రోజులు గడిచిపోయాయి ధర్మకుమార్‌తో అతని కుటుంబ సభ్యులంతా ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు ప్రతి సందర్భంలో తమ నిరసన తిరస్కారం తెలుపుతున్నారు వేళకు రావటం ఇంత తిండి తినటం పాలోమంటు వెళ్లిపోవటం! ఇది ధర్మకుమార్ దినచర్య ఎక్కడికెడుతున్నాడో.? ఏం చేస్తున్నాడో? ఎవరికి ఏ విషయం తెలియటం లేదు చివరకు తనకన్నా ఏ విషయం చెప్పకపోవటం సుశీల కెంతో బాధనిపించింది ఓసారి రెట్టించి అడిగితే ''నోర్మూయ్!'' అన్నాడు ధర్మకుమార్

*　　*　　*

ఆ రోజు ధర్మకుమార్ తలిదండ్రులు. భార్య చెల్లెలు గోష్టి తీరియున్నారు చర్చ అంతా ధర్మకుమార్ పైనే ఏమైనా సరే అతనిని విడిచిపెట్టరాదు డబ్బంతా కులాసాలకు విలాసాలకు ఖర్చుపెడుతూ ఉండి ఉంటాడు పైగా ఏడొందలు జీతం! కనుక అతనిమీద చట్టబద్దమైన చర్యేదైనా తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు

అంతలో ఎక్కడినుంచో దూకుడుగా ప్రవేశించాడు ధర్మకుమార్!

''వీటిమీద సంతకాలు పెట్టండి?'' గర్జించాడు తల్లిదండ్రులకు రెండు డాక్యుమెంట్లు చూపించి

''ఏమిటవి? మళ్లీ మమ్మల్ని ఏం ముంచటానికి?'' పేలవంగా ప్రశ్నించారు వెంకట్రామయ్యగారు

''అదంతా మీ కనవసరం! ముందు పెడతారా లేదా?'' హుంకరించాడు ధర్మకుమార్!

''సంతకాలు పెట్టమని ఖచ్చితంగా చెప్పండి మావగారూ?'' సుశీల కర్కశంగా అంది అవే కొంపలంటుకుపోయే కాగితాలో అని ఊహించి

''అయితే అఘోరించండి! అందరూ కలిసి!'' అంటూ, ఆ డాక్యుమెంట్లు రెండు తండ్రి దగ్గర పడేలా విసిరికొట్టి ఓ మడతపెట్టిన కాగితాన్ని సుశీల ముఖంమీద కొట్టి విసురుగా బయటి కెళ్ళిపోయాడు ధర్మకుమార్ కిందపడిన కాగితాన్ని తీసి వదిన కిచ్చింది రాగిణి అందులో ఏముందోనని అందరూ ఆతృతగా సుశీలవైపు చూస్తున్నారు సుశీల ఆ ఉత్తరం పైకి చదవసాగింది అందులో యిలా వుంది

ప్రియమైన నాన్నగారికి –

నమస్కారములు

ఈసరికి నన్ను మీరంతా ఓ బద్ధవిరోధి కింద జమకట్టి దుష్టుడని, పరమదుర్మార్గుణ్ణని అనుకుంటారని ఊహించలేనంత అవివేకిని కాను కాని నేను దుష్టుణ్ణయినా ఫరవాలేదు నా ఆశయాలను మీరంతా దయచేసి సఫలంచేస్తే!

మీరు నాకు పదివేలిచ్చిన మాట నిజమే! కాదనను కానీ ఒక్కసారి మీరు వెనక్కితిరిగి చూసుకోండి! మీ జీవితాన్ని సమీక్షించుకోండి! రిటైరయిన తరువాత మీ భవిష్యత్తును గురించి ఆలోచించారా? తిండిగింజలకోసం ఒక్క ఎకరం పొలమన్నా కొనుక్కోగలిగారా? మీ సర్వీసు మొత్తంలో? ఒక్క పూరిపాకయినా స్వంతంగా వెయ్యగలిగారా? ఒకవేళ నా మనస్సుమారి యీ వయస్సులో మీ పోషణభారాన్ని స్వీకరించకపోతే? మీ పరిస్థితి ఏమవుతుందో ఊహించారా? పెళ్ళీడు కొచ్చిన కూతురి పెళ్లిచేసి రొమ్ములమీద కుంపటి దింపుకోవాలనే తహ తహ మీలో ఉందా? వీటన్నిటినీ విస్మరించి! ఆడంబరంగా కనిపించాలని లక్జూరియస్ ఆర్టికల్స్ కొనాలని! వాళ్ళకు వీళ్ళకు డిన్నర్లివ్వాలనే మనస్థితిలో వున్నారు! పాత కొత్తల సంధిలో కొట్టుమిట్టాడుతూ

పాతకాలపు అమ్మ గూడా మిమ్మల్నిబట్టి మీ ఒరవడినే అనుసరించాలనుకుంటోంది మనిషికి ముఖ్యంగా కావలసింది తిండి! బట్ట! తలదాచుకొనేందుకు ఓ పంచ–! తరవాతనే యితర సుఖాలు కాని ఆ సుఖాలకన్న ముఖ్యమయినది. బాధ్యతాయుతమైనది చెల్లెలి పెళ్లి! ఈ విషయాలు మీ మనసులో హత్తుకునేట్లు చేయాలని శాయశక్తులా ప్రయత్నించి. విఫలుణ్ణయి విసుగెత్తి. యిక యిలా లాభంలేదనుకొని మీయెడల తెచ్చిపెట్టుకున్న కాఠిన్యం చూపించాను మీ అందరి దృష్టిలో దుష్టుణ్ణయిపోయాను కానీ యిప్పుడు నా ధ్యేయం నెరవేరింది. అదే నాకు సంతృప్తి!

మీ కిచ్చిన డాక్యుమెంట్లలో ఒకటి.! మీ పేర ఒక ఎకరం పొలం కొనుగోలు తాలూకు దస్తావేజు! రెండవది అమ్మ పేర ఒకమాదిరి యిల్లు కొనటం తాలూకు దస్తావేజు! యికనయినా వాటిమీద నిరభ్యంతరంగా సంతకం పెడతారని ఆశిస్తున్నాను ఇకపోతే స్టేట్ బాంకులో పని చేస్తున్న ఒకతనిని రాగిణికి సంబంధం చూశాను. అతను మీకు చెల్లెలికి తప్పక నచ్చుతాడని నా నమ్మకం! నచ్చిన వెంటనే పెళ్లి ఏర్పాట్లు చేయిస్తాను వీటన్నిటికీ డబ్బు ఎక్కడిదనే అనుమానం మీకు కలగవచ్చుగదా! కలిసొచ్చిన అదృష్టంలా అయిదువేలు ఆఫీసు అరియర్స్ సమయాని కందుకున్నాయి జి పి ఎఫ్ ఇన్సూరెన్సు లోనులు యితర సేవింగ్స్ డిపాజిట్లలోని విత్‌డ్రాయల్స్ కలిపి మొత్తం పాతికవేలు! పోగయ్యాయి మీదో పదివేలు వుండనే ఉందిగదా! ఈ మొత్తంతో అన్నీ సక్రమంగా జరుగుతాయి మీరేం ఆందోళన పడవద్దు


ఇప్పుడు చెప్పండి! నేను దుష్టుణ్ణికదూ! పరమదుర్మార్గుణ్ణి, నీచుణ్ణి కదూ! నన్ను మీరెవరూ క్షమించరు క్షమించలేరుగదూ!

ఇట్లు,
మీ కడుపున చెడబుట్టిన కొడుకు
ధర్మకుమార్

ఉత్తరం చదనటం సుశీల ముగించగానే అందరి కళ్ళు ఆనందంతో చెమర్చి పశ్చాత్తాపంతో వర్షించసాగాయి

మినీ ఇంటర్వ్యూ


రేపల్లె కాలేజీలో బి కాం ఫైనలియర్ చదువుకుంటున్న అళహరి హేమచంద్ సోషల్‌లీగ్ సభ్యుడు యింట్లో చదరంగం, చిత్రలేఖనం – పత్రికలు చదవటం – వాటిమీద అభిప్రాయాలు



రాయడం ఈ అబ్బాయి హాబీలు అయితే బయట షటిల్‌కాక్ ఆట ఇష్టం క్రికెట్ సరదా కూడా వుంది వాళ్ల వూళ్లో వోసారి ఉచిత నేత్ర చికిత్సా కేంద్రం పెడితే దానిలో చేరి రోగులకి సేవ చేశాడట బొమ్మలు వేసి, ఆటలు ఆడి ప్రశంస అందుకుంటున్న హేమచంద్‌లో రచయిత కావాలన్న అభిలాష వుంది అన్నిరకాల సినిమాలు చూస్తాడు లైబ్రరీలకి వెళ్తాడు 'స్టార్స్' అంటే మామూలు మనుషులేనన్న సంగతి గ్రహించిన యీ స్టూడెంట్ ''పేకాట'' అదీ యింట్లోనే ఆడతానని చెప్పాడు

అన్ని కాలేజీల్లాగే వాళ్ల కాలేజీలోను ఆటల స్థలం లేదు సైకిల్‌మీద తిరిగే యితనికి రైలు స్టేషన్‌లో, సినిమాహాలు దగ్గర క్యూలంటే విసుగు ముందుగా టికెట్‌లు తెప్పించేసుకుంటాడట అందుకని!

ఎన్నో హాబీలున్నాయి అతని బొమ్మలు వాళ్ల కాలేజీలో ఓసారి ప్రదర్శించారు హిందీ సినిమాలు చూస్తాడు టెన్నిస్‌లో విజయ అమృతరాజ్, క్రికెట్‌లో విశ్వనాథ్, స్టార్స్‌లో విజయ్‌అరోరా, జీనతమన్‌లు ఇతని కిష్టం మంచి ఫ్యూచర్ వున్నవాడేననిపించింది [వీ]




కె. వెంకటరామరెడ్డి సమర్పించు రవిరాజ్ కంబైన్స్

సంతానం - సౌభాగ్యం

నిర్మాత: కేశవజయరామ్ దర్శకత్వం: డి.ఎస్. ప్రకాశరావు

Studio Roopkala

రఘురామ (తారకరామ రిలీజ్) * శ్రీ తారకరామ
రాయలసీమ హక్కుదార్లు: నటేష్ ఫిలింస్ ఎక్స్చేంజి.



సునీత కాపురం

(18వ పేజీ తరువాయి)

ఉండగలరు ? కానీ అదొక తృప్తి మనసుకి.

రెండు చేతులూ కళ్ల కడ్డంపెట్టుకుని ఏడుస్తున్నది. ఆమె చేతులు తీయటానికి ప్రయత్నం చేశాను, అనునయిస్తూ-

నా భుజంమీద వాలి వెక్కివెక్కి ఏడ్చింది, సునీత— నా ప్రాణ స్నేహితురాలు

"చెప్పు సునీతా, నాతో చెప్పవూ!" అడిగాను.

"ఆయన......వారు...... అసలు...... యింటిపట్టు నుండటంలేదు. నేనాయనకి... పనికిరావటంలేదు......"

నా గుండె ఒక్క క్షణంపాటు కొట్టుకోవటం. ఆగి. మళ్లా ప్రారంభించింది. నే ననుకున్నది నిజమన్నమాట

బయట అడుగుల చప్పుడైతే చూశాను. ఒకతను లోపలికి వచ్చి ఒక్క క్షణం మా వైపు అలాగే చూస్తూ నిల్చున్నాడు. సునీత యిదేమీ పట్టించుకున్నట్లులేదు, బాధలో నే నతనివేపు చూచి గతుక్కుమన్నాను. సందేహం లేదు... నిన్నటి సినిమాహాల్లో చూసింది, యితన్నే... అంటే .. అంటే అతను చంద్రశేఖరన్నమాట... నాలో యేదో తెలీనిబావం బయలుదేరింది.

అతను గంభీరంగా, వింతగా మా వేపు చూస్తూ— లోపల గదిలోకి వెళ్ళిపోయాడు. దార్లో ఉన్న 'టీపాయ్'ని తన్నుకుంటూ.

శబ్దం విని సునీత లేచింది భర్త రావటం గమనించి గబగబా లోపలికి వెళ్లింది. నేనొక్కణ్ణే ఆలోచిస్తూ కూర్చుండి పోయాను.

లోపల్నుంచి పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి— ఆలకించసాగాను

"ఎన్నాళ్లినుంచీ జరుగుతోందీభాగోతం - నేను లేని సమయంలో వీడిలో కులుకుతున్నావన్నమాట!"— హేళనగా వుందతని స్వరం.

నా కడుపులో చెయి పెట్టి దేవినట్లయింది.

"ఏమండీ, అదేం కాదండీ, మీరు దణ్ణం పెడతానలాగనకండి మా ఎదురింటివాళ్ల బ్బాయండి. చిన్నప్పటి నుంచీ...స్నేహం..."

-"అందుకే యింతదాకా వచ్చింది..."

నాలో ఆవేశం హద్దులు మీరుతున్నవి. గుండెలదిరి పడుతున్నాయి కాళ్లు నిలవటం లేదు. గభాల్న అతని మీదబడి, పీక నుల



తెలుగు జాతీయ జీవితం ప్రతిబింబించే ఉత్తమ చిత్రం!
పూర్ణిమా పిక్చర్స్ వారి
దేవుడులాంటి మనిషి
దర్శకత్వం:
సి.యస్.రావు BA (UTT)
నిర్మాత:
డి.యస్.రాజు
సంగీతం కె.వి.మహదేవన్
నారాయణరెడ్డి, కొసరాజు
మాటలు: డి.వి.నరసరాజు
జి.కె.రాము

సునీత కాపురం

మేయాలన్నంత ఆవేశం వచ్చినా, సునీత కాపురం చెడిపోకూడదని, నా పరువు మంట గలవకూడదని-అలాగే వూరుకుండిపోయాను.

"కాదండీ... అతను నాకు..."— పూర్తిగాలేదు.

"నోర్ముయ్"– చెంప ఛెళ్లుమన్న శబ్దం.

నేనింక అక్కడ నిలబడలేక పోయాను గబ గబా లోపలికెళ్లి అతన్ని గురించి నాలుగూ సునీతెదుటే దులుపుదామనుకున్నాను. కానీ– భర్త అనురాగానికి దూరమైపోయి, నిర్లి ప్తంగా ఉండబోయే సునీత రూపమే నా కళ్ల ముందు అనుక్షణం మెదులుతున్నది. అలా, కాగూడదు నావల్ల సునీత కాపురం చెడ గూడదు అందుకే తమాయించు కున్నాను. కానీ... కానీ, సునీతకు నాకు మధ్య వున్న పవిత్ర స్నేహ బంధాన్నీ... సోదర భావాన్నీ వమ్ముచేసి.... యింకో విధంగా అంటగట్టిన ఆ మనిషిని'– నాలో ఆగటంలేదు ఆవేశం. గబ గబా లోపలికి వెళ్లాను.

వాళ్లిద్దరూ నన్నే చూస్తున్నారు.

"ఏ మాత్రం సిగ్గున్నా ఒక్క క్షణంయిక్కడ ఉండేవాడుగాదు"- శేఖర్ అరుపు.

నేను తమాయించుకున్నాను.

"మిస్టర్ శేఖర్! కొద్దిగా మర్యాదగా మాట్లాడటం నేర్చుకోండి. మా యిద్దరి సోదర సంబంధాన్నీ కించపరుస్తున్న మీరు – మీ తప్పుల్ని కప్పిపుచ్చుకోవాలని చూస్తు న్నారు. మీ సంగతంతా నాకు తెలుసు రాత్రి మీరెక్కడుందీ, ఏం జరిగిందీ, నాకు తెల్సు, ఏది యేమైనా అదంతా అనవసరం సునీతలో యేం తక్కువైందని మీరిలా ప్రవర్తిస్తు న్నారో నా కర్థం కావటంలేదు. ఇక మీద నైనా సునీతని... సరిగ్గా ఆదరించండి. వస్తాను!" — అంటూ గబ గబా వీధిలోకి వచ్చేశాను.


ఇంటర్వ్యూ ఫలితంకోసం కూడా నాగ పూర్లో వుండటం యిష్టంలేక ఆ రోజే బి టి లో బయలుదేరి వరంగల్ చేరాను. మనసు కుదుటపడటంకోసం ఫ్రెండింట్లో రెండ్రోజులు గడిపి విజయవాడ బయలు దేరాను. ఇంటికెళ్లగానే గదిలో ఉన్న ఉత్త రాల్ని విప్పి చూసాను ఒకటి ఇంటర్వ్యూ పోయింది. "రిగ్రెట్" లెటర్. రెండోది సునీత ఉత్తరం!?

—"సారథన్నయ్యా,


నీ ఋణం జన్మ జన్మలకి తీర్చుకోలేను. వారిప్పుడు నెలకి ముప్పై రోజులూ, ఆఫీసు తప్ప మిగిలిన కాలమంతా యింట్లోనే గడుపు తున్నారు."


— సునీత.

అంటూ రాసింది నిజమా?... నా కంతే చాలు. అదే కావాలి చెల్లీ అనుకున్నాను మన సారా...


ఏ పైరుకైనా
సక్రమమైన పోషణకు-సమృద్ధియైన పంటలకు
సుఫల 15:15:15 + యూరియా
ప్రధానమైన ఎన్ పి కె లతోపాటు ముఖ్య ఉపపోషక పదార్థములను అందిస్తుంది
పోషక పదార్థములన్నియూ లభ్యమగు రూపము లోనే ఉన్నవి.
పైరు వేసే ముందు, పైరు పైన వాడవచ్చు
సు ఫల-పేరులోనే ఉన్నది పెన్నిధి
THE FERTILIZER CORPN. OF INDIA LTD
TROMBAY
సుఫల
SUPHALA
15:15:15
N.P.K.
AMM NITRATE PHOS POTASH
50 Kg (Nett)
సమగ్రమైన సుఫల ఎరువు కర్తికి వెలుగాని గులాబి రంగులో ఉంటుంది
సుఫల ద్వారా క్రమమైన పోషణతో, దృఢమైన పైరు మరియు పుష్కలమైన పంట
మార్కెటింగ్ విభాగము
ది ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లి.
(కేంద్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
ఆంధ్ర ప్రదేశ్ రీజినల్ ఆఫీస్
3-10-173 ఫతేమైదాన్ రోడ్ హైదరాబాద్-500 004
kiror-FCI-1

మేము మా రేడియోల కోసం మా టి వి కి ఉపయోగించే పురోగమించిన సాంకేతిక పరిజ్ఞానాన్నే సమకూరుస్తున్నాం






టెలిరాడ్ రేడియోలు—టెలిరాడ్ టివి, టివి సొంతదార్ల ఆదరాభిమానాలు ఎలా పొందిందో అలాగే టెలిరాడ్ రేడియోలు రేడియో సొంతదార్ల ఆదరాభిమానాలు పొందాయి. దానికి కారణం టెలివిజన్లలో టెలిరాడ్‌కు నాయకత్వంచే కూర్చిన సాంకేతిక పరిజ్ఞానము యీ రేడియోలకూ వినియోగించబడడమే. అందుకనే యీ సారి మీకు రేడియో కావలసివచ్చినప్పుడు, ఒకటి, రెండు, మూడు లేక నాలుగు బ్యాండ్ల టెలిరాడ్ రేడియోలలో దేనినైనాసరే ఎన్నుకోండి. అది ఎలా పని చేస్తుందో వినండి. మీ బడ్జెట్టు రు. 85 కావచ్చు లేక రు. 1500 కావచ్చు. ఎంతైనాసరే, సాంకేతికంగా పురోగమించిన ఒక ఎలక్ట్రానిక్ అద్భుతాన్ని మీరు వింటున్నారనేది మాత్రం నిజం

టెలిరాడ్ : సారాభాయ్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చి సెంటర్ వారి సాంకేతిక విజ్ఞానంతో కూడినది.

TELERAD

టెలిరాడ్–టివి. రేడియో. ట్రాన్సిస్టర్లు. స్టీరియో సిస్టమ్స్.

Shilpi TR-31 A/75 Tel


ఈ మూడు సుగుణాలను ఇవ్వగలిగినది
రూబీ డస్ట్ టీ మాత్రమే
1. తక్షణము డికాక్షన్
2. నిండైన పరిమళం
3. ప్రతి పొట్లానికి ఎక్కువ కప్పుల టీ
Superb Teas
RUBY DUST
చిక్కదనము మరియు
పొదుపుతో కూడిన ఒకే ఒక్క
టీ లిప్టన్ రూబీ డస్ట్.
లిప్టన్ రూబీ డస్ట్ - నిండైన
కమ్మదనము మెండైన
సువాసన కలిసి మెలిసే టీ.
డస్ట్ ప్రతి ఒక్క ప్యాకెట్టుకు అధిక
కప్పుల, రుచికరమైన టీని ఇస్తుంది
లిప్టన్ అంటే మంచిటీ
LIPTON
ప్యాకెట్లలోవున్న టీ మాత్రమే
తాజాతనము, సువాసన నిలిచివుండును

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె. ఎమ్. ఆర్. బాపట్ల

మన దేశంలో ప్రేమకు, యితర దేశాల్లోని ప్రేమకు తేడా తెలియ చేస్తారా?

మన దేశంలో ప్రేమ— పెళ్లితో— బాధ్యతగా మారి పోయి గ్లామర్ పోగొట్టుకుంటుంది విదేశాల్లో ప్రేమ పెళ్లికి తరువాత కూడా బాహాటంగా విస్తరిస్తుంది. మనకి ప్రేమ పెళ్లికి దారితీస్తే—నైతికమైన ప్రేమ అది. వాళ్లకా బాధ లేదు ప్రేమించి, కుదరక పోతే సారీ అని వూరుకున్నా బాధ లేదు.

ఎమ్. ఎస్. ఎన్. ఎమ్. ధూళిపూడి

.. తల తిక్కగా సమాధానాలివ్వక, ఒకటి రెండు వాక్యాలలో ముగించక ..

చిత్తం— కొండవీటి చాంతాడులాగా విపులంగా లెక్కలేనా పత్రాలతో రాయమంటారు! అంతేగా. ఈ రోజుల్లో మనుషుల కంత తెరిపి ఎక్కడుంది.

కె ఎస్. పి. కె కైకలూరు

ఆడది తప్పులు చేస్తే మగవాడు క్షమించడు. మగవాడు ఎన్ని తప్పులు చేసినా ఆడది క్షమిస్తుంది ఎందుకని?

క్షమయా ధరిత్రీ! అన్నారు కదండీ అందుకని కాబోలు. . లేక పోతే— తిండికి, బట్టకి, తల దాచుకొనే నీడకి గతి లేక— నోరు మూసుకుని వూరుకుంటుంది అని చెప్తే— భారత నారీలోకాన్ని తక్కువగా అంచనా వేసినట్టు కోప్పడతారు మీరు

కె బి ఆర్. విజయవాడ

ఆడవారికి డబ్బు ఖర్చు గురించి చెప్పి ఒప్పించడం చాలా కష్టం కదండీ!

నిజమే సార్, చౌకగా వచ్చిన దానికి కూడా డబ్బు ఖర్చు వుంటుందని ఆడవారిని ఒప్పించడం చాలా కష్టం.

కె పి ఆర్. భీమునిపట్నం.

భగవంతుని దృష్టిలో స్త్రీపురుషులు సమానం అంటుంది నా శ్రీమతి నేను కాదంటాను.

మీరే రైటు! ఎందుకంటారా? ఇంగితం ఉన్న ఆడదానిమాట యీ లోకంలో చెల్లదు కనుక.

జి వి. ఆర్. మద్రాసు.

మీరు స్త్రీజాతిని పురుషులను కించపరుస్తున్నారు. ఇందువల్ల మీకు స్త్రీలలో ఎక్కువ పేరు లేదు. పైగా పురుషులు ద్వేషిస్తున్నారు ఎందుకీ బాధ?

తీరి కూర్చోలేక! అయినా మీ ద్వేషం— వాళ్ల పొగడ్త కూడ నాకు అనవసరమే.

డి యు కె. కాశీబుగ్గ.

రాజకీయాలకు రాజనీతికి తేడా ఏమిటి?

రాజకీయాలు దైనందిన కార్యక్రమాలు రాజనీతి— వాటినలా నడిపే పోలసీ.

ఐ. కె ఎమ్. మాడుగుల

వరకట్న సమస్య తగ్గాలంటే స్త్రీలలో ఎలాంటి మార్పురావాలి?

మగవాడికి ఆశ్యాశా— ఆడదానికి వ్యక్తిత్వం మీద నమ్మకం— ఒకటి తగ్గాలి రెండోది పెరగాలి

ఎమ్. డి కె. కంచెల.

మన దేశంలో ప్రేమ వివాహాలు ఇతర దేశాలలోలాగా విజయవంతం కాకపోవడానికి కారణం ఏమిటి ?

మన యువతకి బాధ్యతను పెద్దవాళ్ల బుజాలకెత్తడం— అలవాటు అంచేత.

టి బి ఆర్. చిత్తూరు

రామలక్ష్మి అహంకి మారు పేరు అని అంతా ఆడిపోసుకుంటూంటే నేను విజ్ఞాన జ్యోతిగా మిమ్మల్ని ఆరాధిస్తాను. మీరేమంటారు?

పొగడ్తకి లొంగని ప్రాణి ఉంటుందా తమ్ముడూ, నువ్వన్నది నిజం అని నమ్మడం ప్రారంభించాను! సరేనా?

పి. ఎస్. మిర్యాలగూడ.


ప్రతిసారి ప్రశ్నావళిలో మీరు మగవారిపై రాసే విమర్శల వలన సమాధానములు చదవకూడదనుకొంటాను కాని పత్రిక చేతికి అందగానే ప్రశ్నావళే చూస్తాను కారణం తెలుపకలరా?

చేయకూడదన్న పని చేయమని పీకే లక్ష్యం— కోతిలాంటి మనస్సుది. అంతే.

వి. టి ఎస్. కాకినాడ.

మీరే హో విద్యార్థి అనుకోండి. ఎవడో రవుడీ మీ పేరు తెలుసుకుని మిమ్మల్ని వెంటబడించి ఏడిపిస్తున్నాడనుకోండి

కాకినాడే కద! ఏ జగన్నాథం మేష్టారికో చెప్తాను!





రుచికరమైన, పుష్టికరమైన
బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు
B
R
I
T
A
N
N
I
A
Glaxo
BISCUITS
BRITANNIA
Glaxo
BISCUITS
పెరిగే పాపాయిలకు
రుచివంతమైన తోడు
బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు మరీ అంత ప్రత్యేకమైన రుచి గలిగి ఉండటానికి ఏమిటి కారణం? వాటిలో గల సమృద్ధినిచ్చే, సంపూర్ణమైన పుష్టినిచ్చే లక్షణాలే. పిల్లలకు యివి యిష్టం, పెరుగుతారు ఎంతో బాగా వాటితో. బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు ఎదిగే మీ పిల్లలకు ఎంతో మంచివి.
బ్రిటానియా
బిస్కట్లు అత్యుత్తమమైనవి

గెలుపు నాదే!

కుమారి బొడ్డుచెర్ల గౌరీదేవి

(గత సంచిక తరువాయి)

నిజంగా వేణన్నయ్య నా ప్రక్కన గనక ఉంటే బాగా దులిపి వదిలేసేదాన్ని. పిచ్చి జోస్యాలు పీడాను, ఈ ఉత్తరం పొరపాటున ఎవరి కంటైనా పడితే ఏమన్నా ఉందా! ఎన్ని అనర్థాలకి దారి తీస్తుంది! రోజు రోజుకి వేషాలు ఎక్కువైపోతున్నాయి వీడికి!'

ఉత్తరాల ధ్యాసలోపడి హాల్లో మరో మూల ఏం జరుగుతోందో గమనించని నేను ఉలిక్కిపడ్డాను.

"ఏం నేను చేసినదాన్లో తప్పేముంది?" విసురుగా అంటోంది నీరజ.

"తప్పు కాదామరి? నేను ఇంట్లో వుండగానే లేనని చెప్పి ఫోను పెట్టేయటానికి నీకెంత ధైర్యం?" కోపంతో రవి ముఖం ఎర్రగా కందిపోయింది.

"నువ్విలా మాలతో మాట్లాడటం నాకిష్టంలేదని నీతో చాలాసార్లు చెప్పాను."

"నీ ఇష్టాలతో నాకు పనిలేదని నేనూ చెప్పాను. స్నేహానికి ఆంక్షలు విధించటం మంచిదికాదు" రవి తమ మాటలు వినిపించకూడదని మౌత్ పీస్‌ని చేత్తో నొక్కి పట్టుకుంటూ అన్నాడు.

"ఉత్త స్నేహం అయితే ఫరవాలేదు కానీ వ్యవహారం మితి మించుతున్నట్లు తోస్తోంది నాకు." నీరజ బాధగా అన్నది. ఆమె మాటల్ని నిర్లక్ష్యంగా కొట్టిపారేస్తూ.

"అలాటి భయాలు అనవసరం. ఉండు ముందు విషయమేమిటో కనుక్కుని ఫోన్ పెట్టేస్తాను. ఆ తరవాత తీరిగ్గా మాట్లాడుకుందాం కాదు పోటాడుకుందాం." తీరిగ్గా తనే రిసీవర్ చేతిలోకి తీసుకున్నాడు రవి.

"హల్లో... ఏమిటి రెండ్రోజుల్నుండీ కనిపించటం లేదు?... ఎవరు చెప్పారు?... నో, నో. అలాటిదేం లేదే!.. ఆ విషయం ఇంత త్వరగా మర్చిపోతానా? ... కాస్సేపయాక అటువైపు వస్తాను ... ష్యూర్! మరి ఉండనా? బై, బై." ఫోను పెట్టేసి నీరజవంక చూస్తూ.

"ఆ ఇప్పుడు చెప్పు." అన్నాడు.

టేబిల్ మీద పుస్తకాలు సవరిస్తున్న నీరజ తలెత్తి అదోలా చూసింది.

"చెప్పేందుకేముంది? మీ ఇద్దరి మధ్యా ఏమీ లేకపోతే మన పెళ్ళి ఇలా సంవత్సరం నుండీ వాయిదాలెందుకు వేస్తున్నావో నువ్వే చెప్పాలి."

రవి ముఖం గంభీరంగా మారింది. "అదా? ఇప్పుడే చేసుకోవాలని లేదు గనక."

"అసలెప్పటికైనా నన్ను చేసుకోవాలని ఉందా?"

సూటిగా వేసిన ఆమె ప్రశ్నకి రవి దగ్గర సమాధానం లేదని అతని ముఖమే చెప్తోంది.

"ఇప్పుడా విషయాలెందుకు నీరజా?" ఇబ్బందిగా అన్నాడు.

"ఇప్పుడు కాకపోతే మరో రోజైనా ఈ ప్రస్తావన రాకమానదు. నేను బాగా ఆలోచించాను బావా! నీకు నన్ను చేసుకోవాలని లేకపోతే..."

"లేకపోతే...?" ప్రశ్నార్థకంగా చూసాడు రవి.

"నేనేం సినిమాల్లోలా ఆత్మహత్యా చేసుకోనూ, పెళ్ళీ మానేయను. నన్ను ఇష్టపడే వాళ్ళూ, నాకు తగినవారూ దొరకకపోరు." నీరజ కంఠంలోని ఆత్మవిశ్వాసానికి కొద్దిగా చలించాడు రవి. మొదటిసారిగా అభిమానంగా ఆమె వంక చూస్తూ, "నీకేం తక్కువ నీరజా? అసలు నిజానికి నేను నీకు తగనేమో!" అన్నాడు.

> *జరిగినకథ 3:* తండ్రి చిన్ననాటి స్నేహితుడైన మాధవరావుగారి ఆఫీసులో వుద్యోగం సంపాదిస్తుంది సుజాత. కొడుకు రవికి మేనకోడలు నీరజనిచ్చి పెళ్లి చేయా లనుకుంటారు మాధవరావుగారు రవి మాలల పరిచయం నీరజకు ఇష్టంవుండదు. రవి నీరజల మధ్య అభిప్రాయబేధాలు పెరుగుతాయి.

"ఆ విషయం అలా ఉంచు బావా! చిన్నప్పట్నుండీ — ఇటు మామయ్యా, అటు అమ్మా, నాన్నా కూడా మనని భార్యాభర్తలుగా జమకట్టేసారు. నీ కిష్టంలేకపోతే వాళ్ళని నిరీక్షింపచెయ్యకుండా స్పష్టంగా చెప్పేయటం మంచిది. ఇప్పుడు అమ్మకి జబ్బుగా కూడా ఉండటంతో అమ్మ నా పెళ్లి చూడాలని తొందర పడ్తోంది నిన్న మామయ్యకి ఉత్తరం వ్రాసింది కూడా. మామయ్య నీతో చెప్పారా?"

"లేదు"

"అయితే చెప్తారేమో! అదీ కాక మరో విషయం ఉంది..." క్షణం సంశయిస్తున్నటు ఆగిపోయింది నీరజ.

"ఏమిటది?"

అప్పటికే నాకు తెలీకుండానే చాలాసేపు అక్కడే నిల్చుండిపోయాను. ఇక అక్కడ ఉండి వాళ్ళ వ్యక్తిగత విషయాలు వినటం భావ్యం కాదనిపించి మెల్లగా అక్కడ్నుండి జారుకోబోయాను కానీ ఈ లోగానే.

"సుజాతా! నీ ప్రక్కనే నా హేండ్‌బాగ్ ఉంది. ఇలా అందిస్తావా?" అడిగింది నీరజ.

ఆగిపోయి, వంగి బాగ్ అందిచ్చాను.

"నువ్వు వెళ్లనక్కర్లేదు సుజాతా! ఇందులో వినకూడని విషయాలేం లేవు." అన్నది బాగ్ తెరిచి దేనికోసమో వెతుకుతూ నా వంక చూడకుండానే.

"అహఁ! అదికాదు..." తడబడ్డాను. నా తడబాటు చూసి రవి నవ్వాడు.

"అది కాదో, అవునో నీ తడబాటే చెప్తోంది ఇక నిన్నునువ్వు సమర్థించుకోకు." అన్నాడు నవ్వుతూ. నేనింకేం మాట్లాడలేదు.

నీరజ ఈలోగా ఓ ఉత్తరం బయటికి తీసి రవికి అందిస్తూ "ఇది చదువు." అన్నది.

"ఏమిటది?" అందుకోకుండానే అడిగాడతను.

"జయరాం అని, యూనివర్శిటీలోనే ఎమ్.ఎ. ఫైనల్ చదువుతున్నాడు. అతను వ్రాసాడు."

"ప్రేమ లేఖా?"

"ఒక విధంగా అంతే. అయితే అసభ్యత ఏమీ లేదందులో. నీకు చదవటం ఇష్టం లేకపోతే నేనే చదువుతాను విను.

"కుమారి నీరజగారికి,

ఒక్కొక్కర్ని చూస్తే ఒక్కొక్కరికి.

దేశాభ్యున్నతికి ప్రగతికి క్రమశిక్షణ ఉత్పత్తి పెంపుదల ముఖ్యం

వీడుకు ఇష్టం కలుగుతుందో చెప్పలేం. 'మీలో ఈ ప్రత్యేకతలున్నాయి' అని నేను వర్ణించలేను. కానీ మీరంటే నాకు చాలా అభిమానం. ఎంత అభిమానమంటే మిమ్మల్ని నా జీవిత సహచరిణిగా చేసుకోవాలన్నంత అభిమానం. మీరు మీ అభిప్రాయం తెలియచేస్తే, మీకు ఇష్టమైన పక్షంలో మీ పెద్దవాళ్లతో మాట్లాడతాను. త్వరగా జవాబిస్తారుకదూ!

— జయరాం."

చదవటం ఆపి, "కాబట్టి నువ్వు త్వరగా నీ నిర్ణయం తెలిపితే సంతోషిస్తాను బావా!" అన్నది నీరజ. రవి పెదవి కొరుక్కుంటూ ఉండిపోయాడు కాస్సేపు. తరవాత ఆలోచించి నిట్టూర్చాడు. "అవును, అవును నీరజా! నేను గట్టిగా ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది, అలాగే ఆలోచించి నా నిర్ణయం చెప్తాను." అంటూ పైకి వెళ్లిపోయాడు. నేనక్కడే నిలబడిపోయాను.

భద్రంగా ఉత్తరం మడిచి మళ్ళీ బాగ్‌లో పెట్టుకుంది నీరజ. తరవాత కళ్ళెత్తి నా వంక చూసి నవ్వింది. "ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఏ లక్షణాలూ లేని ఈ అమ్మాయికి ప్రేమలేఖలు వ్రాసిన మూర్ఖుడెవరా అనా?"

"ఛ! ఛ! అదేంకాదు . . జయరాం అంటే ఆరోజు నాకు పరిచయం చేసావు. అతనే కదూ!" అడిగాను.

"అవును. ఎలా ఉన్నాడు నీకు?" అడిగింది నీరజ నవ్వుతూ.

"చూడటానికా? బాగానే ఉన్నాడు. కాని రూపం కాదుగా ముఖ్యం!" చిన్నగా నవ్వి అన్నాను. నీరజ ఒప్పుకుంటున్నట్లు తలాడించింది.

గెలుపు నాదే

"మనిషి కూడా మంచివాడే బహుశా అతన్నే పెళ్లి చేసుకుంటానేమో!" అంది ఆలోచిస్తూ.

"ఏం?"

"ఎందుకంటే రవి నన్ను చేసుకోడు కనక." నవ్వి లోపలికి వెళ్లిపోయింది నీరజ.

రవి ఒప్పుకునే సంగతెలా ఉన్నా నీరజకి జయరాం, రవికంటే బాగా సరిపోతాడన్నది మాత్రం నిజం. రోజూ రవి నీరజని కాలేజీ దగ్గర డ్రాప్‌చేసి వెళ్లేవాడు. నేను మొదట బస్‌లో వెళ్ళిపోతానన్నాను కానీ నీరజ బలవంతం మీద కార్లోనే వెళ్ళాల్సొచ్చేది. యూనివర్శిటీ దాటాక అట్టే దూరం లేదు మా కంపెనీ. అందుకే నీరజతోపాటూ కాలేజీ దగ్గర దిగిపోయి, అక్కడ్నుండి నడిచి వెళ్ళేదాన్ని. ఒకరోజు మేం కారుదిగి నాలుగడుగులు వేసామో లేదో "హలో" అంటూ నీరజని పలకరించాడో యువకుడు. అతనే జయరాం. రవి కారు స్టార్ట్ చేసుకుని వెళ్లిపోయాడప్పటికే. నీరజ జయరాంకి నన్ను పరిచయం చేసింది. టైమ్ అయిపోయినందువల్ల నేనతన్ని పరీక్షగా చూడలేదు కానీ, మనిషి మాత్రం చాలా నిదానస్తుడిలా, మంచివాడిలా అనిపించాడు.

ఆలోచిస్తూనే వంట మనిషి లక్ష్మమ్మ అందించిన టిఫిన్ ప్లేటు తీసుకుని ఒకటి నీరజకిచ్చి, ఒకటి నేను తీసుకుని, మరొకటి రవికని పైకి తీసుకెళ్ళాను.

బాల్కనీలో కూర్చుని సిగరెట్ల మీద సిగరెట్లు ఖాళీ చేస్తున్నాడు రవి ఎన్ని త్రాగినా మొదట నేను వచ్చినప్పటి కంటే చాలా తగ్గించేసాడనిపిస్తోంది నాకు

"టిఫిన్ తీసుకోండి." ప్లేట్ అతని ప్రక్కగా పెటి నాలుగడుగులు ముందుకేసాను. మధ్యలో ఒకసారి ఎందుకో వెనక్కి చూసే సరికి అతనింకా అలాగే సిగరెట్ కాలుస్తూ ఆలోచిస్తున్నాడు

"చల్లారిపోతుంది" మళ్లీ వెనక్కి వచ్చి కాస్త గట్టిగా చెప్పాను.

"ఆఁ! తింటాను" ఆలోచనల్లో నుండి తేరుకుని స్పూన్ చేతిలోకి తీసుకున్నాడతను. "నువ్వూ ఇలా కూర్చో సుజాతా!" ఎదురుగా ఉన్న మరో మోడా చూపించాడు.

"ఏం లేదో ఆలోచిస్తున్నట్లున్నారు" అతనా సమయంలో దేనిగురించి ఆలోచిస్తూ ఉంటాడో తెలుసు కాబట్టి ఇబ్బందిగా అన్నాను, అతను పారేసిన సిగరెట్ వంక చూస్తూ.

అతను నవ్వాడు. "వేరే ఆలోచించటానికేముంది? కథల గురించి ఆలోచించటానికి నేలా రచయితని కానుగా! బాధ్యతగల భర్తగా నే నెలా ఉంటానో ఊహించటానికి ప్రయత్నిస్తున్నాను"

"అంటే పెళ్లి చేసుకోటానికి ఒప్పుకుంటున్నారన్న మాటేగా!" ఆశ్చర్యంగా అడిగాను.


"ఇంకెంతకాలం కోరికల్ని అణుచుకుంటూ బ్రహ్మచారిగా ఉండమంటావు?" మళ్లీ నవ్వాడతను. "ఒక వయసొచ్చాక తనది అంటూ ఓ స్త్రీ లేకపోతే కష్టమే!"

అతనంత సూటిగా చెప్తుంటే ముందు నాకు సిగ్గేసింది. "నీ అభిప్రాయమేమిటి సుజాతా! నేను మంచి భర్తగా రాణించగలనంటావా" అది నేనూహించని ప్రశ్న.

"అది నే నెలా చెప్పగలను?"

"రచయిత్రివి. ఆ మాత్రం ఊహించి చెప్పలేవూ?"

ఒక్క నిమిషం ఆలోచించాను. "అది మీ భార్య తత్వం మీద కూడా ఆధారపడి



ఉంటుంది. ఆమె స్వభావం, మీ స్వభావం ఒకటే అయితే మీ దాంపత్యం చక్కగా సాగిపోతుంది. లేకపోతే..."

"ఇల్లు రణ రంగంగా మారుతుంది. అవునా?" అతను పూరించాడు.

"కరెక్ట్" వొత్తి పలికాను.

రెండు నిమిషాలు గడిచాయి.

"ఇంతకీ మీ రెవర్ని చేసుకోబోతున్నారో చెప్పలేదు" అనుకోకుండా అనేసి నాలిక కరుచుకున్నాను. అతను నాకు చెప్పాల్సిన అవసరమేముంది?

"సారీ!" అన్నాను వెంటనే.

'ఫరవాలేదు. రేపో మాపో అందరికీ తెలిసేదే కదా! మాలిని చేసుకుందామనుకుంటున్నాను" తాపీగా, నిర్వికారంగా అన్నాడు రవి.

"మాలినా?" ఉలిక్కిపడ్డట్లు చూశాను — అతను నవ్వులాటకి అంటున్నాడో, నిజంగానే అంటున్నాడో తెలీలేదు.

"ఏం అంత ఆశ్చర్యపోతున్నావు?" యధాలాపంగా అడిగాడే కానీ నా ఆశ్చర్యానికి కారణం తెలుసుకోవాలన్న కుతూహలం పెద్దగా వ్యక్తం చేయలేదతను.

"అహాఁ! ఏంలేదు, నీరజని చేసుకోవా?" మామూలుగా అయిపోయి అడిగాను

"చేసుకోవాలని లేదు ఎందుకో నాకే తెలీదు." మెల్లగా, నిశ్చయంగా వినిపించిన అతని కంఠం నాకు ఆశ్చర్యం వేసింది నీరజ ఎంత కరెక్ట్‌గా ఊహించింది!

"నీకు మాల గురించేం తెలుసు?" హఠాత్తుగా అడిగాడతను. "నాతో చనువుగా ఉంటుందనీ, ఇంట్లో ఎవరికీ ఆమె గురించి సదభిప్రాయం లేదని మాత్రమే తెలుసు. అవునా?"

అతనెందుకలా అడుగుతున్నాడో తెలీలేదు నాకు.

"అంతంటే కాస్త ఎక్కువే తెలుసు. ఆమె బి ఏ లో నా క్లాస్‌మేట్."

"అరె! నిజంగా? నాతో ఇంతదాకా చెప్పలేదేం?" కొత్త విషయం వింటున్నట్లు విన్నాడు రవి. కుతూహలం పట్టలేక కాస్త ముందుకి వంగాడు కూడా.

"అవసరం రాలేదు."

"ఇప్పుడవసరం వచ్చిందనేనా?"

"లేదు నోటికొచ్చేసింది" పశ్చాత్తాప పడుతున్నట్లు అన్నాను.

"అందువల్ల ఇప్పుడేం నష్టంలేదు. అయితే నీకు మాల గురించి బాగా తెలిసుం

గెలుపు నాదే

డాలేని" అతని వాలకం చూస్తే నా దగ్గర్నుండి ఏదో రాబట్టాలన్నట్టుంది నాకది ఇష్టంలేదు లేచి నిల్చుని,

"మీ కంటే ఎక్కువ నాకేం తెలీదు" అనేసి మెట్లవైపు నడిచాను రెండు మెట్లు దిగానో లేదో వెనక నుండి అతను పిలవటం వినిపించింది.

"ఏమిటి ?" మెడ వెనక్కి తిప్పిచూస్తూ అడిగాను.

"ఇప్పుడప్పుడే ఈ విషయం నీరజకి చెప్పకు. ఇంకోసారి ఆలోచించుకుని నేనే చెప్తాను"

అలాగేనన్నట్టు తలూపి క్రిందకి వచ్చేసాను.

ఆ రాత్రి భోజనాల దగ్గర మాధవరావు గారు అన్నారు

"రవీ! అత్తయ్య ఉత్తరం వ్రాసింది నీరజ పెళ్లి విషయం ఏదో ఒకటి తేల్చి చెప్పమంటూ"

పెరుగన్నం కలుపుకుంటున్న రవి తలెత్తి చూసాడు. "అవునట. నీరజ చెప్పింది. నేనూ ఆ విషయమే ఆలోచిస్తున్నాను డాడీ!" రవి నిదానంగా అని పైకి వెళ్లిపోయాడు, గబగబా అన్నం తినేసి.

అంత మాత్రానికే సంతోషపడిపోయారు మాధవరావుగారు "పోన్లే! కనీసం ఆలోచిస్తున్నానన్నైనా అన్నాడు. ఇంతకు ముందులా అసలు పెళ్లే వద్దనలేదు. ఒకవేళ ..." ఒక్కనిమిషం ఆగి "ఒకవేళ వాడికి మేనరికం ఇష్టంలేకపోతే మరెవర్ని చేసుకున్నా ఫరవాలేదు. పెళ్లి చేసుకుని బాధ్యతలు స్వీకరిస్తే అదే చాలు:" అన్నారాయన. ఏ భావమూ వ్యక్తం కానీయకుండా.

నీరజా, నేనూ ముఖాలు చూసుకున్నాం. ఆయన ఎందుకలా అన్నారో నా కర్థం కాలేదు ఆయన రవి ఉద్దేశ్యం గ్రహించారా! ఏమో! అయినా అయి ఉండచ్చు.

"పెళ్లి నిశ్చయమయాక నెల రోజులు ముందుగానే రమ్మని ఉత్తరం వ్రాస్తాను మీ నాన్నకి. వాడిని చూసి చాలా రోజులయిపోయింది." అన్నారాయన మళ్లీ.

చిన్నగా నవ్వి ఊరుకున్నాను. రవి పెళ్లి చేసుకుని గృహస్థుడు కాబోతున్నాడంటే సంతోషంగానే ఉంది కానీ అతని పక్కన మాలని ఊహించుకోటానికి మాత్రం మనస్క

రించటంలేదు. శారీరకంగా వాళ్లిద్దరిదీ చక్కటి జంట అనటంలో సందేహం లేదు. నాజూగ్గా, మల్లె తీగెలా ఉంటుంది మాల. బలంగా, ఆమెకి ఆసరా ఇచ్చే పందిరిలా ఉంటాడు రవి. కానీ రవి కావాలనుకుంటే అంతకంటే అందమైన అమ్మాయిలూ, అణుకువ గలవారూ దొరకనే దొరకరా? రవి తొందరపడుతున్నాడేమో!

మాలతో పరిచయమే తప్ప పెద్ద స్నేహమెప్పుడూ లేదు నాకు. ఎలెక్షన్లలో ఆమెకి ప్రత్యర్థిగా నేను నిలబడి గెలవటంతో నేనంటే ఓ విధమైన ఈర్ష్యా, అసూయా చోటు చేసుకున్నాయి మాలలో. దానికితోడు, క్లాస్‌మేట్స్ అందరూ "అందంలో నీతో పోటీ చేయతగ్గది సుజాత మాత్రమేనోయ్" అంటూండటం ఆమెకి నా పట్ల గల అయిష్టాన్ని మరింత అధికం చేసింది. నన్ను చూడగానే ముఖం తిప్పుకునే ఆమెని చూస్తే నాకు నవ్వొచ్చేది. అప్పటికీ రెండు మూడు సార్లు పలకరించి ఆమె ముభావంగా సమాధానాలివ్వటంతో ఊరుకున్నాను.

బి. ఎ. సెకెండ్ ఇయర్‌లో ఉండగా మాల పేరు శ్రీకాంత్ అనే అబ్బాయితో జత చేయబడి గోడం పైకెక్కింది. మాలా, శ్రీకాంత్ ప్రేమించుకున్నారనీ, పెళ్లి చేసుకోబోతున్నారనీ అనుకోసాగారందరూ. తరచూ పార్కుల్లోనో, సినిమాహాళ్లలోనో వాళ్లిద్దరు కనిపించేవారు. ఈ సంగతి ప్రిన్స్‌పాల్ దాకా పోయి ఆవిడ మాలని పిలిచి మందలించటం జరిగింది కూడా. కానీ హఠాత్తుగా వాళ్లిద్దరి బంధం తెగిపోయింది. కారణం అడిగితే, "మేం ప్రేమించుకున్న మాట నిజమే. కానీ మా పెద్దవాళ్లు పెళ్లికి అంగీకరించటంలేదు. కాబట్టి మామూలు స్నేహితుల్లా మిగిలి పోదామనుకుంటున్నాం" అని సమాధాన మిచ్చిందట మాల.

'ఈ విషయం రవికి తెలుసా? అందర్నీ చురుగ్గా గమనించే రవి వాళ్ల వ్యక్తిత్వాలు అంచనా వేసుకోలేడా? లేక అభ్యుదయ భావాలున్న యువకుడిగా అతనది లెఖ్ఖ చేయదల్చుకోలేదా?! ఒకవేళ మాల సంగతతనికి తెలకపోతే!? నేను వెళ్లి చెప్పాలా? చెప్తే నమ్ముతాడా! అయినా ఈ గొడవలన్నీ నాకెందుకు? అతనిష్టం వచ్చినట్లు చేసుకోనీ!' అనుకున్నాను.

(ఇంకా వుంది)

ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

17—10—75 దసరా సంచిక కన్నుల విందుగా మాముందు నిలిచింది "జయదుర్గ" ముఖచిత్రం మమ్మల్నెంతో ఆకర్షించింది.

సుగ్గుల శివప్రసాద్ (పిడప్రరు)

* * *

ఈ సంవత్సరపు దసరా సంచిక ముఖ చిత్రం మహిషాసుర మర్దని మా ఇంటిల్లిపాదిని చాల ఆకర్షించినది. పత్రిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తాము. సీరియల్స్ గాజుమేడ చాల బావుంది. దాని ముగింపు అనుకున్నట్లుగాలేదు. ప్రభాకరం దురదృష్టవంతుడనే చెప్పాలి. చేతులారా భవిష్యత్ భాగస్వామిని ఎన్నుకొని సుఖించలేని (పెళ్లి చేసుకోనలేని) వాడు. ఏదో సాధించాలని ఉసని పోగొట్టుకున్నవాడు. క్రొత్త సీరియల్ శ్రావణ సంధ్య మొదటి వారమే చాలా బావుంది. ఉత్సాహముగా యున్నది. సంసారం సంసారం కథ మన భారతీయులలో స్త్రీలకుండే ఓర్పుని చాటి చెప్పింది. పత్రికలో ఇంకా మంచి కథలు వేసి అందించెదరని ఆశిస్తున్నాము.

ఎ. సత్యనారాయణమూర్తి, ఎ. సుజాత, ఎ. కుమారి, ఎ. శేషగిరిరావు, ఎ. శకుంతల (ఏటికొప్పాక)

సీరియల్

నేనే "ప్రభాకరం" అయితే ఎంతబాధపడేవాడినో, "గాజుమేడ" ముగింపు చదివిన నాకు అంతబాధ కల్గినది. ఏమయినా గాజుమేడ పత్రికకే ఒక ఆణిముత్యముగా నడిచింది. రచయితకు నా ధన్యవాదాలు. అనుమానాలు కాపురాలనే నాశనము చేస్తుందని "కారణభూతం" కథవల్ల తెలుస్తుంది. పి. లక్ష్మీనరసింహారావు (విశాఖపట్టణం)

కథలు

షోకు, షోకుగా ముస్తాబైన "సోగ్గాడు" శోభన్ ముఖచిత్రంతో వెలువడ్డ 10.10.75 సంచికలోని "చేను మేసిన కంచె"— కథ పాతది కావచ్చు. ముగింపు అంతకంటే పాతది కావచ్చు. కానీ కథనం మాత్రం క్రొత్తదనంతో ప్రవహించని మలుపుతిరిగింది. వృత్తి లక్ష్యాన్ని మరచి, ధనార్జనే ప్రధాన లక్ష్యంగా భావించి నీజీవ్వలేని ఎందరో నిర్భాగ్యులయిన రోగులను నిర్లక్ష్యంగా మృత్యువు నోటి కందిస్తున్న డాక్టర్లున్నారని తెలుసు. కానీ ఎంతో శ్రమించి, ప్రాణదానం చేస్తున్నట్లు పోజు పెట్టి, అనవసరపు ఆపరేషన్లతో రోగిని ఇబ్బందిపెట్టి డబ్బు గుంజే డాక్టర్లున్నారని ఈ కథ వల్ల తెలుస్తుంది

తిర్లుక సుబ్బారావు. (తెనాలి)

సినిమా

10.10.75 పత్రికలో సినిమా శీర్షికలో శ్రీనివాస్‌గారు "భక్త కన్నప్ప" చిత్రాన్ని గురించి ప్రస్తావిస్తూ "ఇద్దరు సంగీత దర్శకులు కలిసి పనిచేయటం తెలుగులో ఇదే ప్రథమం" అన్నారు. కానీ ఇంతకుముందే తెలుగులో రామారావుగారు నటించిన "మంచిమనిషి" చిత్రానికి రాజేశ్వరరావు, చలపతిరావుగార్లు జంట సంగీత దర్శకులు.

సూరం శ్రీనివాసులు (గిద్దలూరు)

* * *

సినిమా శ్రీనివాస్‌గారు శోభన్‌ని "హీ—మాన్"గా వ్యవహరిస్తున్నారు. కాని దృఢమైన శరీర సౌష్ఠవంతో వంపులు తిరిగిన కండలతో (అర్జా జనార్దనరావులా) ఉన్న మనిషినే "హీ—మాన్"గా వ్యవహరించాలి. మనకున్న హీరోలందరూ "షి—మాన్"లే! ఉదయ్ (కాకినాడ) ●

అ వీ—ఇ వీ—అ న్నీ

రాజబాబు నాటికలు

నటుడు రచయిత అయిన శ్రీ కోనేరు రాజబాబు రచించిన శ్రవ్యశ్రీ నాటికల పుస్తకం మా కార్యాలయం చేరింది. వెల : 5 రూ. లు. ప్రతులకు శ్రీనివాస పబ్లికేషన్స్ పోస్టాఫీసు వీధి, కృష్ణలంక, విజయవాడకి వ్రాయవచ్చును.

దేవత లెత్తిన పడగ
వెంటాడే నీడలు

పై రెండు పుస్తకాలు కూడా శ్రీ పి. వి. రమణ రాసిన ప్రయోగాత్మక ప్రదర్శనాత్మకమైన సాంఘిక నాటకాలు. వెల: ఒక్కొక్కటి మూడు రూపాయలు. వీటిని పయనీర్ పబ్లికేషన్స్, పి. వి. రమణ, 10/423, గిర్మాజీ పేట, వరంగల్‌నుంచి పొందవచ్చు. మంచి గెటప్‌లో ప్రచురించారు.

లండన్‌లో ఒకరాత్రి

శ్రీ సజ్జాద్ జహీర్ రాసిన 'లండన్‌లో ఒక రాత్రి" పుస్తకం మా కార్యాలయం చేరింది. అనువాదం శ్రీ ముద్దసాని రాంరెడ్డి దీన్ని విశాలాంధ్ర పబ్లికేషన్ హవుస్, ఏలూరు రోడ్డు. విజయవాడ వారు వేశారు. వెల 4—50.

విద్య

సాంఘిక నవల. రెండు భాగాలు. రచన : శ్రీమతి సి. ఆనందారామం. మొదటిభాగం 96 పేజీలు, రెండవభాగం 112 పేజీలు, ఒక్కొక్కభాగం వెల రు. 3—75 పైలు. ప్రచురణ కర్తలు : బాలసరస్వతి బుక్ డిపో, 6 సుంకురామశెట్టివీధి, మదరాసు—1.

పాలవెల్లి

శ్రీమతి సి. ఆనందరామం నవల పాలవెల్లి బాలసరస్వతీ బుక్ డిపోకర్నూలు మద్రాసు—1. వారు ప్రచురించిన కాపీ మా కార్యాలయం చేరింది. 206 పుటల యీ పుస్తకం వెల.రూ 6లు ప్రతులకు ప్రచురణ కర్తలకు వ్రాయవచ్చును.

అవీ—ఇవీ అన్నీ

సంస్కృత బోధిని 2

శ్రీ అన్నపర్తి సీతారామాంజనేయులు వ్రాసిన బాలల సంస్కృత బోధిని—2 చిన్న పుస్తకం మా కార్యాలయం చేరింది. ప్రతులకి ఆనందబాల ప్రచురణలు, గుంటూరు—4 కి వ్రాయవచ్చును. వెల: రు. 2 లు. పుటలు 62.

గేయ మాల

శ్రీ కోగంటి దుర్గా మల్లిఖార్జునరాయ కవి విరచితమైన గేయమాల ప్రథమభాగం పుటలు 20, మా కార్యాలయం చేరింది వెల 75 పైసలు. ప్రతులకు భారతసమితి పామర్రు. కృష్ణాజిల్లాకి వ్రాయాలి.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


యువతి లాగే
ఉండాలని
అభిలాషపడే
యువతికి
ీరలు
DCM
TEXTILES
బియా మరియు
తయారీదారులు:
హిండాన్ రివర్ మిల్స్
dcm/3